


www.voodayam.com
Estd :1999

# వుదయం




శుక్రవారం, నవంబర్ 21 , 2025 | హైదరాబాద్ | సంపుటి : 26 | సంచిక :256| వెల : రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM TELUGU DAILY

/VOODAYAM Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal



## స్పీకర్‌తో నవీన్ యాదవ్ భేటీ

తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను శాసనసభ భవనంలోని స్పీకర్ చాంబర్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్‌ను స్పీకర్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. చిత్రంలో లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు కూడా ఉన్నారు.

- వుదయం ప్రతినిధి, హైదరాబాద్



## కేంద్ర మంత్రి జోషీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో గురువారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర, ఉన్నతాధికారులున్నారు.

- వుదయం ప్రతినిధి, హైదరాబాద్



## ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా
# హైదరాబాద్

8 వారాల పైలెట్ ప్రోగ్రాం అమలుకు నిర్ణయం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో అనలాగ్ ఏఐ సీఈవో కిప్మన్ భేటీ



వుదయం ప్రతినిధి, హైదరాబాద్

హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాస యోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం అనలాగ్ AI సీఈఓ అలెక్స్ కిప్‌మన్ సీఎంను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను చర్చించారు. ట్రాఫిక్, అర్బన్ ఫ్లడింగ్, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించే మార్గాలను చర్చించారు. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేసే వీలుందని అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీలో ఫిజికల్ ఇంటెలిజెన్స్ను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించారు. ఎనిమిది వారాల పాటు ఈ ప్రోగ్రాం అమలవుతుంది.

ఇందులో భాగంగా సీసీ టీవీ వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మారుస్తారు. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేస్తారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి లైవ్గా దీన్ని మానిటరింగ్ చేస్తారు. ఈ పైలెట్ ప్రోగ్రాం పూర్తయ్యేనాటికి హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా మారుతుందనే అంచనాలున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీని పరిశోధన.. సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను వివరించారు. ఆర్థిక వృద్ధికి సైతం ఫిజికల్ ఇంటెలిజెన్స్ అత్యుత్తమ పరిష్కారాలను అందిస్తుందని కిప్మన్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. డిసెంబర్ 8–9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు రావాలని సీఎం ఆయనను ఆహ్వానించారు.



# ప్రజా ప్రభుత్వం.. రైతుల పక్షం

## దృఢ సంకల్పంతో ముందుకెళుతున్నాం..

- రైతులకు మద్దతుగా రైతు భరోసా
- నాబార్డ్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- నాబార్డ్.. గ్రామీణ భారత్ వెనుక నిశ్శబ్దశక్తి
- 22 లక్షల కుటుంబాలకు రూ.21,000 కోట్ల ఉపశమనం
- 21వ శతాబ్దానికి అనువైన సంస్థలను నిర్మిస్తున్న తెలంగాణ
- ఎర్త్ సమ్మిట్‌లో పాల్గొనడం లభించిన గొప్ప గౌరవం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



వుదయం ప్రతినిధి, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ముందుకెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటుచేసిన నాబార్డ్ మొదటి ఎర్త్ సమ్మిట్‌లో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోనే అతి పెద్ద రుణమాఫీలలో ఒకదాన్ని అమలు చేసి, దాదాపు 22 లక్షల కుటుంబాలకు రూ.21,000 కోట్ల ఉపశమనం అందించామన్నారు. కొనుగోలు వ్యవస్థను విస్తరించి పారదర్శకంగా మార్చాం, రైతులకు నేరుగా, సమయానుసారం మద్దతు అందుకునేలా రైతు భరోసా అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. సాగునీరు, డిజిటల్ పంట రికార్డులు, కోత తర్వాత మౌలిక వసతులలో పెట్టుబడులతో గ్రామీణ కుటుంబాల్లో బలమైన నమ్మకాన్ని పునరుద్ధరించామని తెలిపారు. సంక్షోభ సమయాల్లోనే కాదు, రైతుల ప్రతి రోజూ అభివృద్ధి పయనంలో ప్రజా ప్రభుత్వం తోడుగా ఉంటుంది, ఇది తమ నిబద్ధత ఇది అన్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షమని అన్నారు.

నాబార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రథమ ఎర్త్ సమ్మిట్‌లో పాల్గొనడం తనకు లభించిన గొప్ప గౌరవమని భట్టి ఈ సందర్భంగా అన్నారు. ఈ సమ్మిట్ పేరు మనకు ఒక ముఖ్యమైన సత్యాన్ని గుర్తుచేస్తుంది. భారతదేశ బలం చివరకు దాని నేలలోనే ఉంది, దాని గ్రామాలలో ఉంది, మన రైతుల్లో ఉంది, ప్రతికూలతను సమృద్ధిగా మార్చే వారి నిశ్శబ్ద ధైర్యంలో ఉందన్నారు. ఈ జాతీయ కార్యక్రమం హైదరాబాద్‌లో ప్రారంభం కావడం చాలా సముచితం. దూరదృష్టి కలిగిన జాతీయ నాయకులు నిర్మించిన సంస్థల పునాదిపై ఈ నగరం ఎదిగింది అని తెలిపారు. వ్యవసాయం గురించి మనం మాట్లాడినప్పుడు, సంస్థాగత విప్లవం లేకుండా ఏ గ్రీన్ రెవల్యూషన్ కూడా సాధ్యం కాదని గుర్తు చేసుకోవాలని.. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న నాయకులు మన దేశానికి లభించటం ఒక వరం అని వివరించారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ "మిగతా అన్నీ ఆగొచ్చు, వ్యవసాయం ఆగకూడదు" అనే నమ్మకంతో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, సాగునీటి సంఘాలు, శాస్త్రీయ పరిశోధనా సంస్థలువంటి వ్యవస్థాగత నిర్మాణాన్ని సృష్టించారని భట్టి తెలిపారు. ఇందిరా గాంధీ ముఖ్యంగా గ్రీన్ రెవల్యూషన్ కాలంలో ఆమె చూపిన ధైర్యం రైతుకు భారత ప్రభుత్వ సంపూర్ణ అండ లభించేలా చేసిందన్నారు. మన ప్రాంతానికి చెందిన డా. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఉచిత విద్యుత్, గ్రామీణ ఆరోగ్య వసతులు, ఎస్.హెచ్.జీ. లకు మద్దతు వంటి రైతు-కేంద్రీకృత సంక్షేమ నమూనాతో దయ, అభివృద్ధి రెండూ కలిసిపోవచ్చని నిరూపించారన్నారు. ఇప్పుడు నాబార్డ్ ఎదుట నిలుచుని చూస్తుంటే భారత అభివృద్ధి పథంలో పెద్ద భాగం అనేది సంస్థలను నిర్మించిన కథని మరలా గుర్తొస్తుందన్నారు.

ఆ జాతి నిర్మాణ కాలంలో పుట్టి, శాంతిగా పనిచేస్తూ నిలిచిన గొప్ప సంస్థల్లో నాబార్డ్ అత్యుత్తమమైనదిగా నిలిచింది అని డిప్యూటీ సీఎం తెలిపారు. నాబార్డ్ ఎప్పుడూ ప్రచారం కోసం పోరాడిన సంస్థ కాదు, కానీ నాబార్డ్ లేకపోతే గ్రామీణ భారత్ ఇవాళ ఇలా ఉండేది కాదని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు. పీఏసీఎస్‌ల ఆధునికీకరణ, సహకార సంస్థల బలోపేతం, వ్యవసాయ డిజిటలైజేషన్, ఎఫ్‌పీవోలకు సుస్థిర శక్తి ఇవ్వడం గ్రామీణ భారత పునరుద్ధరణ వెనుక ఉన్న నిశ్శబ్ద శక్తి నాబార్డ్ అని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, నాబార్డ్ చైర్మన్ షాజీ, నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గోవర్ధన్ సింగ్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న
# భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం
- వేద ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేత

**తిరుపతి/ తిరుచానూరు, నవంబర్ 20, వుదయంప్రతినిధి :**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల తిరుపతి తిరుమల పర్యటన సందర్భంగా గురువారం పద్మావతి అమ్మవారి దర్శనం నిమిత్తం సాయంత్రం 4 గంటల 20 నిమిషాలకు తిరుచానూరు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో అనిల్ కుమార్ సింగల్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషీ, జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, సీవీఎస్ ఓ కె.వి.మురళీకృష్ణ, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్, టిటిడి జెఈఓ వి.వీర బ్రహ్మం, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అడిషనల్ ఎస్ పి రవి మనోహరాచారి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ తదితరులు భారత రాష్ట్రపతికి స్వాగతం పలికి పలికారు. ఆలయం వద్ద భారత రాష్ట్రపతికి ఆలయం వద్ద వేద పండితులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. పద్మావతి అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆలయ మర్యాదలతో రాష్ట్రపతికి వేద ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందించారు. దర్శనానంతరం రాష్ట్రపతి సా.5.25 గం.లకు తిరుమల బయల్దేరి వెళ్లారు.



# తెలంగాణ చుక్కాని రామయ్య

## విద్యారంగానికి ఆయన సేవలు అపారమంటూ ప్రశంసలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రామయ్యకు 100వ జన్మదిన శుభాకాంక్షలు



వుదయం ప్రతినిధి, హైదరాబాద్

ప్రముఖ విద్యావేత్త, ఐఐటీ కోచింగ్ వ్యవస్థకు మార్గదర్శి అయిన గురువు చుక్కా రామయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 100 వ జన్మదినం జరుపుకుంటున్న చుక్కరామయ్యకు విద్యానగర్ లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థుల భవితను తీర్చిదిద్దిన వ్యక్తి రామయ్యని కొనియాడారు. "ఐఐటీ అనగానే గుర్తుకొచ్చే తొలి పేరు, విద్య అంటే గుర్తుకొచ్చే మార్గదర్శి, సేవ అంటే గుర్తుకొచ్చే స్ఫూర్తి అంతా చుక్కా రామయ్యదే," అని ఆయన పేర్కొన్నారు. వేలాదిమంది విద్యార్థులను ఐఐటి వంటి ఉన్నత విద్యాసంస్థలకు పంపి దేశానికి అద్భుతమైన సేవ చేసిన గొప్ప విద్యావేత్త చుక్కారామయ్య అన్నారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు అపారమైనవని, ఉన్నతమైన విద్యను గ్రామీణ విద్యార్థులకు చేరవేసిన గొప్ప కృషికి ఆయన నిలువెత్తు సాక్ష్యమని కేటీఆర్ ప్రశంసించారు.


రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐఐటి పూర్తి చేసి ప్రపంచ దేశాల్లో స్థిరపడడానికి కారణం చుక్క రామయ్య అని కొనియాడారు. విద్య ప్రదాత కాకుండా తెలంగాణ పోరాటంలో రాజకీయాల్లో దిక్సూచిగా తన పాత్ర పోషించాడని ఆయన అన్నారు. అలాంటి చుక్క రామయ్య 100వ బర్త్ డే జరుపుకోవడం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. రామయ్య ఆరోగ్యంగా, సుదీర్ఘకాలం జీవించాలని ఆయన ఆకాంక్షించారు.కేటీఆర్ తో పాటు వెళ్లిన నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్ , పళ్ళ రాజేశ్వర్ రెడ్డి , ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్ తదితరులు చుక్క రామయ్యను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయండి

### ఆర్థిక శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం

వుదయం ప్రతినిధి, హైదరాబాద్

జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ తో పాటు సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ మరియు పాలిటెక్నిక్ కళాశాలలు 2,813 సంబంధించిన రూ.161 కోట్ల బకాయిలు ఉన్నట్టుగా అధికారుల సమీక్షలో నిర్ధారించారు. మొత్తం రూ.161 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 23న సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు

• ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో వస్త్ర పంపిణీ, అన్న ప్రసాద పంపిణీ.
• సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హాకిం విశ్వ ప్రసాద్.



నాగర్ కర్నూల్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నాగర్ కర్నూల్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఈ నెల 23న ఆదివారం నాడు సత్యసాయిబాబా శతజయంతి జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హాకిం విశ్వ ప్రసాద్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23న ఆదివారం నాడు మందిరంలో తెల్లవారుజామున 5 గంటలకు ఓంకారం సుప్రభాతం సేవలు, సాయి భక్తులచే జిల్లా కేంద్రంలో మహా నగర సంకీర్తన, అనంతరం రుద్రం, వేదమంత్రోచ్చరణాల మధ్య బాబా వారికి విశేష ద్రవ్యాలతో సామూహిక అభిషేక పూజలు,అర్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12:30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధరణ ఆసుపత్రిలో రోగి సహాయకులకు మరియు పట్టణవాసులకు సామూహిక అన్నప్రసాదం పంపిణీ (నారాయణ సేవ), మరియు పేద రోగులకు వస్త్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాయంత్రం 6 గంటలకు సాయి మందిరంలో వేద పారాయణం, ప్రత్యేక భజన కార్యక్రమాలు, బాల వికాస్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, కేక్ కటింగ్, డోలారోహణం, మహా మంగళ హారతి, విభూతి , తీర్థ ప్రసాదాల పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలోని సత్యసాయి అన్ని విభాగాల బాధ్యులు, భక్తులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొందాలని ఆయన కోరారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

■ కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్,నవంబర్20(వుదయం ప్రతినిధి) బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమం మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ చట్టాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అన్నారు. స్నేహితా కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ బాలల హక్కులను వివరిస్తున్నామని అన్నారు. బాల బాలికలు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా 1098 హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురవుతున్న పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పెట్టెలో ఫిర్యాదు వేయాలని అన్నారు. బాలలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయి మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం గురించి సమాచారం ఉంటే నిర్భయంగా తెలియజేయాలని అన్నారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లో పిల్లలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సైన్ లాంగ్వేజీ లో జాతీయ గేయం పాడిన వారిని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన ప్రభుత్వ క్రీడా పాఠశాల విద్యార్థులను అభినందించారు. పిల్లల దత్తతకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గంగాధర్, మండల విద్యాధికారి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కులం పేరుతో దూషించిన నిందితునికి జైలు శిక్ష

□ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్.



ఆసిఫాబాద్, నవంబర్ 20, (వుదయం ప్రతినిధి): కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని కులం పేరుతో దూషించిన కేసులో నిందితుడికి 6 నెలల జైలు శిక్ష మరియు 2500 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సీ ఎస్టీ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఆదిలాబాద్, కుమార్ వివేక్ తీర్పు విలువరించినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. కాగజ్నగర్ రూరల్ మండలం బట్టుపల్లి గ్రామంలో మార్చి 01,2020 తేదీన జరిగిన ఘటనలో, కుటుంబ వేడుక జరుగుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బొమ్మెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి బాధితుణ్ణి కులం పేరుతో దూషించాడు. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కాగజ్నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో అప్పటి ఎస్.ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ స్వామి ఛార్జ్ షీట్ దాఖలు చేయగా, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్ఐ ఈశ్వర్ సింగ్ సాక్షులను హాజరు పరిచారు. తదుపరి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రమణా రెడ్డి సాక్షులను విచారించి నేరాన్ని ధృవీకరించారు. విచారణలో నేరం రుజువుకావడంతో ఎస్సీ అండ్ ఎస్టీ ప్రత్యేక కోర్టు ప్రధాన న్యాయమూర్తి కుమార్ వివేక్, నిందితుడు బొమ్మెల్లి శ్రీనివాస్‌కు ఆరు నెలల జైలు శిక్ష మరియు రూ. 2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు."బాధితునికి న్యాయం జరిగేలా కృషి చేసిన ఇన్వెస్టిగేషన్ అధికారులు, కోర్టు లైజనింగ్ అధికారులను జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అభినందించారు. ఇటువంటి సంఘటనల్లో బాధితులు ఎలాంటి భయం లేకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

# వుదయం జిల్లా ప్రతినిధిని సన్మానించిన కేంద్ర మంత్రి బండి సంజయ్





కరీంనగర్, నవంబర్20 (వుదయం ప్రతినిధి), వుదయం కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గంగం రాజును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సన్మానించారు. భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంఘమైన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుడిగా గంగం రాజు ఎంపికైన సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖకు ఎంపికైన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా తొలి కార్యవర్గంలో కార్యవర్గ సభ్యుడిగా తనకు అవకాశం ఇచ్చిన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యకులు తాడురి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సత్యనారాయణ లకు గంగం రాజు కృతజ్ఞతలు తెలిపారు

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ లు అందజేత



మక్తల్ నవంబర్20(వుదయం ప్రతినిధి): ఉట్కూర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలోని 5 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ది దారుల కు ఉట్కూర్ ఎంపిడిఓ కార్యాలయం దగ్గర అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఉత్తరాలను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యజ్ఞేశ్వర్ రెడ్డి ,మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్ రెడ్డి, యుత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్, టౌన్ అధ్యక్షుడు కొక్కు లింగం, నాగిరెడ్డి పల్లి యువకుడు పరమేష్, నాయకులు లబ్ది దారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ప్రభుత్వానికి నాగిరెడ్డి పల్లి లబ్ది దారుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి డాక్టర్ శ్రీహరీ,గ్రామానికి 10 ఇండ్లు మంజూరు చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

♦ రూరల్ ఎస్సై రాముడు



నారాయణపేట టౌన్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): నారాయణపేట మండలం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున 6 గంటల ప్రాంతంలో కోటకొండ శివారులో అక్రమంగా ఇసుక ను రవాణా చేస్తున్న ట్రాక్టర్ గుర్తించి పోలీసులు పట్టుకు న్నారు. కావలి నరేష్ అలి యాస్ ఆంజనేయులు కోయిలకొండ మండలనికి చెందిన వ్యక్తి, కోయిలకొండ నుండి కోటకొండకు అక్రమం గా ఇసుక తరలిస్తుండగా రూరల్ పోలీసులు ఆపి విచారణ జరిపి, వాహనంతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించి కావలి నరేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# చల్లగుళ్ళ కృష్ణయ్యకు సత్కారం




సత్తుపల్లి నవంబర్ 19(వుదయం ప్రతినిధి) సత్తుపల్లి సొసైటీ అధ్యక్షులు చల్లగుళ్ళ కృష్ణయ్యను తెలంగాణ సహకార సంఘం యూనియన్ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు.. గడచిన 21 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవుతున్న నేపద్యంలో ఆయనకు ఈ సత్కారం లభించింది.. నవంబర్ 14నుంచి 20వరకు అఖిలభారత 72వ సహకార సంఘ వారోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.. ఈ సందర్భంగా గురువారం హైదరాబాదులో జరిగిన ఒక కార్యక్రమంలో కృష్ణయ్యను యూనియన్ సభ్యులు ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు

# ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్‌కు దరఖాస్తు చేసుకోండి'

బెల్లంపల్లి, నవంబర్20 (వుదయం ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ, 10వ తరగతి చదువుతున్న బిసి, ఈబిసి విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2025-26 సంవత్సరానికి గాను ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ అందించనున్నాయి. అర్హులైన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ. 4వేలు మంజూరు చేయబడుతుందని వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా అధికారి భాగ్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మండల,జిల్లా పరిషత్, ఎయిటెడ్, మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు డిసెంబర్ 15 లోగ tgepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# తాండూరులో బడి బయటి పిల్లల సర్వే



బెల్లంపల్లి, నవంబర్20 (వుదయం ప్రతినిధి): తెలంగాణ సమగ్ర శిక్ష సంచాలకులు, మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అదేనుసారం 2026-27 సంవత్సరానికి సంబంధించిన తాండూరు మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సీఆర్పీలు నాగరాజు, తిరుపతి బడి బయట పిల్లల సర్వే ప్రారంభించినట్లు ఎంఈవో మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బడి బయట పిల్లలు 6 నుండి 14 సంవత్సరాలు, 15 నుండి 19 సంవత్సరాల పిల్లలు విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలనే ఉద్దేశ్యంతోఈ నెల 20వ తేదీ నుంచి 30 వరకు ఇంటింటి సర్వే సర్వే చేస్తున్నట్లు తెలిపారు. బడి మధ్యలో మానేయడానికి కారణాలు తెలుసుకొని విద్యార్థులను దగ్గర్లోని పాఠశాలలో చేర్పించడం జరుగుతుందని అన్నారు.

# జర్నలిస్టులు సమాజంలోని మంచి చెడులను లోతుగా విశ్లేషించాలి

♦ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్
♦ డబ్ల్యూజెఐ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం



కరీంనగర్, నవంబర్,20(వుదయం ప్రతినిధి): సమాజంలోని మంచి, చెడులను లోతుగా విశ్లేషించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. జర్నలిస్టుల రాతలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఆయన సన్మానించారు. నూతన కార్యవర్గం జర్నలిస్టుల సంక్షేమానికి, జర్నలిస్టులలో వృత్తి నైపుణ్యం పెంపొందించడానికి కృషి చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. డబ్ల్యూజెఐ జిల్లా శాఖ నూతన అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మొగురం రమేష్, కోశాధికారి చిటిమల్ల మహేందర్ లతో పాటు కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. అంతకుముందు రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంఘాలు, వాటి పనితీరు రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఆయా సంఘాల సభ్యత్వ వివరాల గురించి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ లోకసభ సభ్యుడు ఈటల రాజేందర్ కు వివరించారు.

# గ్రంథాలయ వారోత్సవాలలో పారడైజ్ విద్యార్థుల ప్రతిభ




కరీంనగర్ నవంబర్20(వుదయం ప్రతినిధి): కరీంనగర్ లోని స్థానిక కేంద్ర గ్రంథాలయంలో గతవారం రోజుల నుండి నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పలు పోటీలను నిర్వహించారు. ఇట్టి పోటీలలో పారడైజ్ పాఠశాల విద్యార్థులు పాల్గొని పలు విభాగాలలో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ డా. పి. ఫాతిమా రెడ్డి తెలిపారు. డ్రాయింగ్ విభాగంలో యు. శివాణి 8వ తరగతి జిల్లాస్థాయిలో 1 ప్రథమ బహుమతి రి మెమరీ విభాగంలో A. మహిత్ 9వ తరగతి జిల్లాస్థాయిలో 1 ప్రథమ బహుమతి రి. క్విజ్ విభాగంలో సాన్విత & టీం జిల్లా స్థాయిలో 1 ప్రథమ బహుమతి రి. వ్యాసరచన పోటీలలో సనా 9వ తరగతి జిల్లా స్థాయి 1 రెండవ బహుమతి రి . మెహిందీ విభాగంలో ఖ. శివాణి 8 వ తరగతి జిల్లాస్థాయిలో 1 రెండవ బహుమతి రి సాధించినట్లు చైర్మన్ తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అభినందన సభలో ఇట్టి విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు పోటీపరీక్షలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో చైర్మన్ పి. ఫాతిమా రెడ్డి, ప్రిన్సిపాల్ టీ. వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని మరియు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

♦ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు.



ఆసిఫాబాద్, నవంబర్ 20, (వుదయం ప్రతినిధి): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ రైతు వేదికలో గురువారం రోజు 23 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లి కోసం ప్రభుత్వం లాంఛనంగా ఇస్తున్న ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ నుండి మాకుడి వరకు డబల్ బీటీ రోడ్డు, అచ్చెల్లి నుండి ఆరేగూడ వరకు బీటీ రోడ్లు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ని కలిసి సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ కు సంబంధించి పలు అభివృద్ధి పనుల గురించి వివరించానని,దక్షిణ్ ఎక్స్ ప్రెస్, బల్లార్షా ఎక్స్ప్రెస్ లకు సిర్పూర్ టౌన్ లో అదనపు స్టాపేజీ మరియు భాగ్యనగర్ ఎక్స్ ప్రెస్ సిర్పూర్ వరకు పొడిగించాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మార్వో రహీముద్దీన్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఆర్ఐ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్లు వేణు, సాయి, భాజపా మండల అధ్యక్షులు లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# నూతన శాఖా గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తాం

♦ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు.



ఆసిఫాబాద్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) దీపక్ తివారి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసిఫాబాదు జిల్లా కేంద్ర లైబ్రరీ భవనం మాదిరి కాగజ్ నగర్ లో కూడా నూతన శాఖా గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో లైబ్రరీ భవనాల నిర్మాణానికి కృషి చేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్, గ్రంథాలయ అధికారి సదానందం, ప్రవీణ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు

♦ అనర్హులకు మంజూరు చేశారంటూ రాజ్యాధికార పార్టీ ధ్వజం



పెద్దపల్లి,నవంబర్ 20:(వుదయం ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా,కాల్వ శ్రీరాంపూర్ మండలం,ఇప్పలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని,నిజమైన నిరుపేదలకు ఇళ్లు దక్కడం లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు ఉమ్మల్ల రాజేందర్ ఆరోపించారు. ఈ అంశంపై గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో వివరాలను వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులలో అనర్హులకు మంజూరు చేశారని ఆరోపించారు. దీనిపై ఇందిరమ్మ కమిటీ సభ్యులను కోరగా,ఎమ్మెల్యే ఇళ్ల ఎంపిక చేశారని చెప్తూ,గ్రామ పంచాయతీ సెక్రటరీ,ఎంపీడీవోను అడగమంటున్నారని తెలిపారు. ఎంపీడీవోను అడిగితే మళ్లీ కమిటీ సభ్యులకే తెలుసని దాటవేస్తున్నారని రాజేందర్ పేర్కొన్నారు. నిరుపేదలను గుర్తించి ఇళ్లు ఇవ్వాల్సిన కమిటీ సభ్యులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు కమిటీ సభ్యులుగా ఉన్న జిల్లాల శ్రీనివాస్,అల్లంల రాజు,వడ్లూరి రజిత, మెర్గావేనా వసంత,తోకల సురేష్ లలో,కమిటీ సభ్యులు అయిన అల్లం రాజు,తోకల సురేష్ కూడా వారికే ఇళ్ళు కేటాయించుకున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. నిరుపేదలకు ఇళ్ళు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ,ఆర్థికంగా,వ్యవసాయ భూమి ఉన్నవారికి ఎలా కేటాయిస్తుందని రాజేందర్ ప్రశ్నించారు. నిజమైన నిరుపేదలను గుర్తించి,ఇళ్లకు రి-సర్వే చేయించి అర్హులకు ఇండ్లు మంజూరు అయ్యేలా జిల్లా కలెక్టర్,స్థానిక ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో అర్హులైన బాధితులతో కలిసి ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

# ట్రంప్ ను కలవనున్న న్యూయార్క్ మేయర్ మమ్దానీ




న్యూయార్క్ మేయర్ గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ తాజాగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా వెల్లడించారు. మమ్దానీని కమ్యూనిస్టుగా సంబోధిస్తూ ట్రంప్.. 'కమ్యూనిస్టు న్యూయార్క్ మేయర్ నన్ను కలవాలని టైమ్ అడిగారు. శుక్రవారం కలుద్దామని చెప్పా. చూద్దాం ఈ సమావేశం ఎలా ఉండబోతోందో' అంటూ ట్రంప్ పోస్టు పెట్టారు. మేయర్ ఎన్నికల్లో మమ్దానీ చారిత్రాత్మక విజయం సాధించిన విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విక్టరీ స్పీచ్ లో ట్రంప్ ను ఉద్దేశించి మమ్దానీ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ అనుసరిస్తున్న వలస వ్యతిరేక విధానాలను మమ్దానీ తప్పుబట్టారు. న్యూయార్క్ వలసదారులతోనే అభివృద్ధిలో దూసుకుపోతోందని చెప్పారు. ట్రంప్ ను ఓడించడం కష్టం కాదని తన గెలుపు నిరూపించిందని మమ్దానీ పేర్కొన్నారు. ఇదే న్యూయార్క్ నగరం ట్రంప్ ను ఉన్నత స్థానంలో నిలబెట్టిందని, ఇక్కడి నుంచే ఆయన ఎదుగుదల ప్రారంభమైందని గుర్తుచేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ట్రంప్ పతనం కూడా ఇక్కడి నుంచే మొదలైందని మమ్దానీ వ్యాఖ్యానించారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం

అమెరికాలో సంచలనం రేపిన ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు విషయంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌పై దర్యాప్తునకు సంబంధించిన అన్ని ఫైళ్లను విడుదల చేయాలని న్యాయ శాఖను ఆదేశించే బిల్లును అమెరికా కాంగ్రెస్ ఆమోదించింది. కాంగ్రెస్‌లోని హౌజ్, సెనెట్ ఉభయ సభలు దాదాపు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. దీంతో ఎప్‌స్టీన్ ఫైల్స్ బిల్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం కోసం శ్వేతసౌధానికి వెళ్లనున్నది. కాగా ఈ బిల్లు ప్రకారం న్యాయశాఖ 30 రోజుల్లోపే అన్ని ఫైళ్లనూ విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే బాధితుల గోప్యత, నడుస్తున్న దర్యాప్తుల నడుమ అనవసరమైన విషయాలు మాత్రమే రహస్యంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశంలో తీవ్రచర్చకు దారి తీసి, రాజకీయ దుమారాన్ని రేపిన ఈ ఫైల్స్‌ను బయటకు తీసుకురావడానికి ఇంతకాలం ట్రంప్ వ్యతిరేకించాడు. అయితే ఇటీవలే ఈ విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. సెనెట్ ఆమోదిస్తే బిల్లుపై సంతకం చేస్తానని చెప్పారు. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం అందరినీ ఆశ్చర్యం కలిగించింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ బిల్లుపై రిపబ్లికన్ పార్టీలోనూ ఘర్షణ తలెత్తింది. కానీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైళ్లను విడుదల చేయాలంటూ ఆయన పరిపాలనపై ఇంటా, బయటా ఒత్తిడి పెరిగింది. దీంతో డోనాల్డ్ ట్రంప్ దిగిరాక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఓటింగ్ కోసం ఆయన రిపబ్లికన్‌లకు పిలుపునిచ్చారు. దీనిపై మంగళవారం ఓటింగ్ జరిగింది.

# నా తల్లిని భారత్ రక్షించింది



న్యూఢిల్లీ: తన తల్లిని హత్య చేయాలన్న కుట్ర జరిగిందని, అయితే ఆమెను సకాలంలో భారత్ రక్షించిందని బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్ వాజేద్ తెలిపారు. ఇందుకు తాను మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. విద్యార్థుల ఉద్యమం కారణంగా గతేడాది ఆగస్టు 5న బంగ్లా ప్రధాని పదవికి రాజీనామా చేసి హసీనా భారత్‌కు పారిపోయి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తన తల్లిని చంపేందుకు ఉగ్రవాదులు ప్రణాళికలు రచించారని, భారత్ రక్షించిందని వాజేద్ అన్నారు. తన తల్లికి బంగ్లాదేశ్ ట్రైబ్యునల్ ఇటీవల విధించిన మరణశిక్ష రాజ్యాంగ విరుద్ధం, అక్రమమని పేర్కొన్నారు. ''భారత్ ఎల్లప్పుడూ మంచి మిత్ర దేశంగా ఉంది. సంక్షోభ సమయంలో నా తల్లి ప్రాణాలు కాపాడింది. ఆమె (హసీనా) బంగ్లాదేశ్ వీడకపోయి ఉంటే మిలిటెంట్లు ఆమె హత్యకు కుట్రలు చేసేవారు. నా తల్లి ప్రాణాలు కాపాడినందుకు ప్రధాని మోదీ ప్రభుత్వానికి నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడిని. అప్పగింత జరగాలంటే న్యాయ ప్రక్రియను అనుసరించాలి. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజ్యాంగ, చట్టవిరుద్ధమైన ప్రభుత్వం ఉంది. నా తల్లిని దోషిగా నిర్ధారించేందుకు, విచారణను త్వరగా ముగించేందుకు చట్టాలను సవరించారు. పార్లమెంటు అనుమతి లేకుండా చట్టాలను సవరించలేం. న్యాయవాదులను పెట్టుకునేందుకు కూడా నా తల్లిని అనుమతించలేదు. విచారణకు ముందే 17 మంది న్యాయమూర్తులను తొలగించి ధర్మాసనంలో ఎలాంటి అనుభవం లేని కొత్త జడ్జిలను నియమించారు. వారికి రాజకీయ సంబంధాలు ఉన్నాయి'' అని సాజిబ్ వాజేద్ అన్నారు. లష్కరే తయ్యిబా ఉగ్రవాదుల అడ్డాగా బంగ్లాదేశ్ మారిందని తెలిపారు.ఈ ఉగ్రవాద సంస్థకు యూనస్ నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం అండదండలందిస్తోందని ఆరోపించారు.


# ఉగ్రదాడుల వేళ మదర్సాలకు కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: ఢిల్లీ బాంబ్ బ్లాస్ట్ ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. దేశ రాజధాని ఢిల్లీలో.. ఎర్ర కోట సమీపంలో పేలుడు జరిగింది. ఇందుకు బాధ్యులైన వారు ప్రస్తుతం పోలీసులు అదుపులో ఉన్నారు.ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా ఉగ్రవాదులను ఏరి వేయడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా.. ఉగ్రదాడులు మాత్రమ ఆగడంలేదు.పైగా ఉగ్రమూకలు ఆత్మాహుతి దాడులకు పాల్పడుతూ.. అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. ఉగ్రవాదులు, వారి సానుభూతి పరులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. ఇదిలా ఉంటే దేశంలో ఉగ్రదాడి వేళ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మదర్సాలకు సంబంధించి కొత్త నిబంధనలు తీసుకువచ్చింది.

దేశంలో తరచుగా ఉగ్రదాడులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో.. భద్రతా సంస్థలను అప్రమత్తం చేయడానికి గాను ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్న యోగి ప్రభుత్వం కొత్త ప్రోటోకాల్‌ను అమలు చేసేందుకు ముందుకు వచ్చింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న మదర్సాలలో ఉండే విద్యార్థులు, మౌలానాల పూర్తి వివరాలను ఉగ్రవాద నిరోధక దళంకి అందివ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో బాంబ్ బ్లాస్ట్ తర్వాత.. భద్రతా దళాలు.. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో దర్యాప్తును విస్తరిస్తున్న సమయంలో యూపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గుర్తింపు పొందిన, పొందని మదర్సాలు .. తమ వద్ద పనిచేస్తున్న మత బోధకులు, ఉపాధ్యాయులు వివరాలను ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

అలానే వారి మొబైల్ నంబర్, ఆధార్, శాశ్వత చిరునామాతో పాటుగా ఇతర గుర్తింపు పత్రాలను కూడా ఎటిఎస్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా, మదర్సాలలో చదువుతున్న విద్యార్థులు కూడా వారికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలి. ఇది కేవలం డేటా సేకరణ, సర్వే మాత్రమే కాదని.. ఏదైనా సంస్థలో చోటు చేసుకునే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడానికి కూడా సాయం చేస్తుందని అధికారులు తెలిపారు.

# కొంతమంది చేసిన తప్పులకు కశ్మీరీలను బాధ్యులను చేయడం సరికాదు



కశ్మీర్: ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎర్రకోట సమీపంలో కారు పేలుడు తర్వాత కశ్మీరీలను అందరూ అనుమానంగా చూస్తున్నారని ఆయన అన్నారు. కొంతమంది చేసిన తప్పులకు కశ్మీరీలందరినీ బాధ్యులను చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఉగ్రకుట్రలకు తమను ఎక్కడ బాధ్యులను చేస్తారేమో అనే భయంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కూడా కశ్మీరీలు భయపడుతున్నారని అన్నారు.జమ్ము కశ్మీర్ నెంబర్ ఉన్న వాహనాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలన్నా తాను కూడా భయపడుతున్నానని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఢిల్లీలో జరిగిన పేలుడుకు కశ్మీర్‌లోని కొందరు బాధ్యులు కావడం వల్ల మొత్తం కశ్మీర్ ప్రజలు అందులో భాగమనే భావనను సృష్టిస్తున్నారని అన్నారు. తాను ఇతర రాష్ట్రాలకు వెళితే ఎవరు ఎక్కడ ఆపి వాహనాన్ని తనిఖీ చేస్తారోనని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తానని అన్నారు.ప్రస్తుతం జమ్ము కశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాన్ని ఢిల్లీలో నడపడం కూడా నేరంగా పరిగణిస్తున్నారని అన్నారు. అందరూ మనల్ని అనుమానాస్పద దృష్టితో చూస్తున్నప్పుడు, మనకు సంబంధం లేని అంశంలో మనల్ని కించపరుస్తున్నప్పుడు బయటకు వెళ్లడం కష్టమనిపిస్తుందని అన్నారు. అందుకే ప్రస్తుతం కశ్మీర్ ప్రజలు తమ పిల్లలను బయటకు పంపడానికి ముందుకు రావడం లేదని అన్నారు.

## భారత పర్యటనకు వస్తున్న ట్రంప్ కుమారుడు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారం భారత్‌లో పర్యటించనున్నారు. రాజస్థాన్‌లోని ''సరస్సుల నగరం''గా ప్రసిద్ధి చెందిన ఉదయ్‌పుర్‌లో జరిగే ఓ వివాహ వేడుకకు ఆయన కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. నవంబర్ 21, 22 తేదీల్లో ఈ వేడుక జరగనుంది.ఓ ప్రముఖ అమెరికన్ వ్యాపారవేత్త కుమారుడి డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ఉదయ్‌పుర్‌లోని పిచోలా సరస్సు మధ్యలో ఉన్న సుప్రసిద్ధ జగ్ మందిర్ ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వస్తున్న ట్రంప్ జూనియర్, నగరంలోని లీలా ప్యాలెస్‌లో విడిది చేయనున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ జూనియర్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. అమెరికా సీక్రెట్ సర్వీసెస్‌కు చెందిన ఒక బృందం ఇప్పటికే ఉదయ్‌పుర్‌కు చేరుకొని ఏర్పాట్లను సమీక్షిస్తోంది. మరోవైపు, స్థానిక పోలీసులు విమానాశ్రయం నుంచి ప్యాలెస్ వరకు పటిష్ఠమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ వివాహ మహోత్సవానికి ట్రంప్ కుటుంబంతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, ఇతర రంగాల వారు కూడా హాజరుకానుండటంతో నగరం సందడిగా మారనుంది.

## జెలెన్‌స్కీకి షాకిచ్చిన ట్రంప్..!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి షాక్ ఇచ్చారు. పుతిన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న రష్యా–ఉక్రెయిన్ శాంతి ప్రణాళికను చడీచప్పుడు లేకుండా ఆమోదించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. మూడేళ్లకుపైగా కొనసాగుతోన్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 28 పాయింట్లతో ఒక ప్లాన్ సిద్ధం చేశారు. అందులో ఎక్కువ పాయింట్లు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ఆ ప్రతిపాదనలను అమెరికా, రష్యా అధికారులు సంయుక్తంగా రూపొందించారు. ఇటీవల దానిని జెలెన్‌స్కీ ప్రభుత్వానికి అందించారు. దీనిపై ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఉక్రెయిన్ జాతీయ భద్రతాధిపతి రుస్తుమ్ ఉమరోవ్ మధ్య సమావేశం జరిగింది. ఈ ప్రణాళికకు అంగీకారం తెలపాలని అమెరికా కోరుకుంటుందని ఆ సందర్భంగా విట్కాఫ్ స్పష్టం చేశారు. కానీ పలు నిబంధనలను జెలెన్‌స్కీ వ్యతిరేకిస్తున్నారు. వాటిని అంగీకరించడం అంటే తమ సార్వభౌమత్వాన్ని వదులుకోవడమేనని కీవ్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. మిత్రదేశం నిరాకరిస్తున్నా.. ట్రంప్ మాత్రం దానికి మద్దతు తెలిపారని ఆ కథనం పేర్కొంది.

## నరేంద్ర మోదీ నవంబర్ 21 నుంచి దక్షిణాఫ్రికాలో పర్యటించనున్నారు




న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 21 నుంచి దక్షిణాఫ్రికాలో పర్యటించనున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో జోహన్నెస్‌బర్గ్‌లో జరగనున్న 20వ జీ20 దేశాల అధినేతలు సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ''ఇది గ్లోబల్ సౌత్‌లో వరుసగా జరుగుతున్న నాలుగవ జీ20 శిఖరాగ్ర సమావేశం. ఈ సదస్సులో, ప్రధానమంత్రి జీ20 ఎజెండాపై భారతదేశం యొక్క దృక్పథాలను తెలియజేస్తారు. సదస్సులోని మూడు సెషన్లలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు'' అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. సదస్సులోని మూడు సెషన్లలో ప్రధాని సమగ్ర, స్థిరమైన ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, వాతావరణ మార్పులు, ఆహార వ్యవస్థలు, అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధస్సు అంశాలపై మాట్లాడనున్నారు. జీ20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా జోహన్నెస్‌బర్గ్‌లో వివిధ దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారని వెల్లడించింది. అదేవిధంగా ఇండియా–బ్రెజిల్–దక్షిణాఫ్రికా నేతల సమావేశంలోనూ పాల్గొననున్నట్లు తెలిపింది.జీ20 సదస్సుకు అమెరికా నుంచి ఎవరూ హాజరు కాబోరని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. దక్షిణాఫ్రికాలో మైనారిటీలైన శ్వేతజాతి రైతులను చూస్తున్న తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతకుముందు మయామిలో చేసిన ఒక ప్రసంగంలో దక్షిణాఫ్రికాను జీ20 నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# అమెరికాకు నాటోయేతర అతిపెద్ద మిత్రదేశం సౌదీ



అమెరికాకు నాటోయేతర అతిపెద్ద మిత్రదేశంగా సౌదీ అరేబియాను పరిగణిస్తున్నట్టు ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరుదేశాల మధ్య రక్షణ, వాణిజ్య, భద్రతా సహకారాన్ని పెంపొందిస్తామని వెల్లడించారు. వాషింగ్టన్‌లోని వైట్ హౌస్‌లో సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో ద్వైపాక్షిక చర్చల సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. సౌదీకి ఎఫ్–35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా సిద్ధమన్నారు. ఎఫ్–35 యుద్ధ విమానాల టెక్నాలజీ సౌదీ నుంచి చైనాకు లీక్ అవుతుందనే అభ్యంతరాలను తన ప్రభుత్వంలోని కొందరు లేవనెత్తినా పట్టించుకోకుండా ఈ డీల్‌కు సిద్ధమైనట్టు అమెరికా అధ్యక్షుడు చెప్పారు. ఈ సమావేశం సందర్భంగా ఎఫ్–35 ఫైటర్ జెట్ల విక్రయ డీల్‌పై అమెరికా, సౌదీ సంతకాలు చేయడం గమనార్హం. అమెరికా నుంచి దాదాపు 300 యుద్ధ ట్యాంకులనూ సౌదీ కొనబోతోంది. క్యాపిటల్ మార్కెట్లు, అరుదైన ఖనిజ నిక్షేపాల మార్కెట్లు, మనీలాండరింగ్ కట్టడి, ఉగ్రవాద సంస్థలకు ఫైనాన్సింగ్‌ను అడ్డుకోవడం వంటి అంశాలకు సంబంధించి కూడా అమెరికా–సౌదీ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. కషోగీ హత్య గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. సల్మాన్‌కు ఏమీ తెలియదు అని చెప్పారు. ఇజ్రాయిల్‌తో స్నేహ బంధానికి సంబంధించిన అబ్రహం అకార్డ్స్ ఒప్పందాలపై సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఒప్పందాల్లో భాగం కావాలని తమకూ ఉందన్నారు. అయితే ఇజ్రాయిల్–పాలస్తీనా వివాదానికి 'రెండు దేశాల ఏర్పాటు' పరిష్కారాన్ని కనుగొనాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# పాక్ ప్రభుత్వమే ఉగ్ర దాడులు చేయిస్తోంది.. ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం ఆరోపణలు



ప్రపంచంలో ఎక్కడ ఉగ్రదాడి జరిగినా.. చాలా వరకు అందరి అనుమానాలు పాకిస్తాన్ మీదకే వెళ్తాయి. పాకిస్తాన్ ఉగ్రవాదులకు పుట్టిల్లు అనేది జగమెరిగిన సత్యం. ప్రపంచదేశాలు, సంస్థలు ఈ విషయంలో పాక్‌కు చీవాట్లు పెట్టినా.. అది మాత్రం పెద్దగా తలకెక్కించుకోదు.. తన తీరు మార్చుకోదు. ఈక్రమంలో తాజాగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి పాకిస్తాన్ మీద సంచలన ఆరోపణలు చేశారు. పాక్ ప్రభుత్వమే ఉగ్రదాడులు చేయిస్తోంది అంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది తాజాగా మన దాయాది దేశం పాకిస్తాన్ మీద సంచలన ఆరోపణలు చేశారు. రాజకీయ అజెండాలో భాగంగానే పాక్ ప్రభుత్వం నకిలీ ఉగ్ర దాడులు చేయిస్తోందన్నారు. అఫ్రిది ఈ వ్యాఖ్యలు చేసినట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. వీటి ప్రకారం.. నెల రోజుల క్రితం అనగా 2025, అక్టోబర్‌లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అఫ్రిది.. బాధ్యతలు స్వీకరించిన అనతి కాలంలోనే పాక్ మీద సంచలన ఆరోపణలు చేయడం గమనార్హం అంటూ వార్తలు వెల్లడించాయి. పాక్ ప్రభుత్వం.. ఖైబర్ ప్రాంతంలో కావాలనే ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాద దాడులు జరిపిస్తోందని అఫ్రిది ఆరోపించారు. ఈ ప్రాంతంలో శాంతి స్థాపనకు తాము చేస్తోన్న ప్రయత్నాలను అడ్డుకుంటుందని తెలిపారు. ఇటీవల ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి పష్తూన్ తహాఫుజ్ మూమెంట్ (పీటీఎం) సభ్యులు హాజరు కాగా.. వారిని గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనను అఫ్రిది తీవ్రంగా ఖండించారు. తమ ప్రాంతంలో శాంతి స్థాపనను అడ్డుకోవడమే కాక.. ఆఫ్గనిస్తాన్‌తో తమ ప్రావిన్స్‌కు మధ్య ఏర్పడిన సంబంధాలను దెబ్బతీసేందుకే.. పాకిస్తాన్ కావాలనే ఇలాంటి పనులు చేస్తోందని ఆయన ఆరోపించారు.

# కేపీసీసీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగుతానన్న డీకే శివకుమార్



బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్.. తాను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవచ్చని పరోక్షంగా సంకేతాలిచ్చారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పుపై తీవ్రస్థాయిలో ఊహాగానాలు చెలరేగుతున్న తరుణంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేపీసీసీ అధ్యక్ష పదవిలో నేను శాశ్వతంగా ఉండలేను. ఇప్పటికే ఐదున్నరేళ్లుగా ఈ బాధ్యతల్లో ఉన్నాను. మరికొద్ది నెలల్లో ఆరేళ్లు పూర్తవుతుంది. ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలి. 2023 మేలో ఉప ముఖ్యమంత్రి అయ్యాక రాజీనామా చేయాలనుకున్నాను. కానీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ మరికొంత కాలం కొనసాగాలని కోరారు. నేను పదవిలో ఉన్నానా లేదా అన్నది ముఖ్యం కాదు, పార్టీని నడిపించడంలో ఎప్పుడూ ముందుంటాను అని డీకే శివకుమార్ స్పష్టం చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను బాధ్యతల నుంచి పారిపోవడం లేదన్నారు.ఇక్కడ ఎవరూ శాశ్వతం కాదు. గాంధీ కుటుంబం, కాంగ్రెస్ అధ్యక్షుడు కోరినంత కాలం పనిచేస్తాను అని వివరణ ఇచ్చారు.వాస్తవానికి, కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు జరుగుతుందనే ప్రచారం చాలాకాలంగా సాగుతోంది. ఇటీవలే సీఎం సిద్ధరామయ్య ఢిల్లీలో సోనియా, రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. తనను పూర్తికాలం సీఎంగా కొనసాగనివ్వాలని, వచ్చే ఎన్నికలకు డీకేను సీఎం అభ్యర్థిగా ప్రకటిద్దామని ఆయన అధిష్ఠానానికి సూచించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, అధిష్ఠానం నుంచి స్పష్టమైన పిలుపు వచ్చే వరకు మౌనంగా ఉండాలని డీకే భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలతో కర్ణాటక కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కాయి

# గుజరాత్ జైల్లో హైదరాబాద్ ఉగ్రవాది అహ్మద్‌ను చితకబాదిన తోటి ఖైదీలు



అహ్మదాబాద్: ఆముదం గింజల నుంచి విషం తయారు చేసి.. దాన్ని ప్రసాదంలో కలిపి.. అమాయకుల ప్రాణాలు తీయాలని భావించిన హైదరాబాద్‌కు చెందిన ఉగ్రవాది అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం అతడు గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్నాడు. ఈక్రమంలో కీలక విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది. జైలులో ఖైదీలు కొందరు అతడిపై దాడి చేసి చితకబాదారని సమాచారం. ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ)తో సంబంధం ఉన్న ఉగ్రవాది డాక్టర్ అహ్మద్‌పై జైలు లోపల దాడి జరిగింది. అతడిని హై సెక్యూరిటీ సెల్‌లో బంధించినప్పటికీ.. అకస్మాత్తుగా వచ్చిన ఖైదీలు అహ్మద్ మీద దాడి చేసి తీవ్రంగా కొట్టారని అధికారులు తెలిపారు. ఖైదీల మధ్య దాడి తీవ్రంగా జరిగిందని.. అహ్మద్‌ను ఖైదీల నుంచి విడిపించేందుకు, అతడి ప్రాణాలు కాపాడేందుకు చివరకు పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. దీని గురించి సమాచారం అందిన వెంటనే గుజరాత్ యాంటీ–టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)కు చెందిన ఓ బృందం సబర్మతి జైలుకు చేరుకుంది. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుంది. అసలు దాడి ఎందుకు జరిగిందనే అంశంపై దర్యాప్తు ప్రారంభించారు. ఖైదీలు ఎందుకు ఇంత అకస్మాత్తుగా దాడి చేశారు అనే దాని గురించి ఇంకా తెలియదలేదు. ఈ నెల అనగా నవంబర్ 8న, గుజరాత్ యాంటీ–టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) ముగ్గురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరిలో హైదరాబాద్ నగరానికి చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. మొహియుద్దీన్.. ఐసీస్‌కు చెందిన ఓ డిపార్ట్‌మెంట్ అయిన.. ఇస్లామిక్ స్టేట్ ఖోరాసన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ)కు చెందిన ఉగ్రవాది అబూ ఖాదీమ్ అనే వ్యక్తితో టచ్‌లో ఉన్నట్లు.. అతడి ఆదేశాల మేరకు పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చైనాలో ఎంబీబీఎస్ చదవిని మొహియుద్దీన్.. అబుల్ ఖాదీమ్ ఆదేశాల మేరకు ఆముదం గింజల నుంచి ప్రమాదకరమైన రైసిన్ అనే ప్రమాదకరమైన విషాన్ని తయారు చేయడానికి ఇంట్లోనే అన్ని పరికరాలు ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అహ్మదాబాద్ ఏటీఎస్ వీరిని విచారిస్తోంది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మొహియుద్దీన్.. మరో ఉగ్రవాది అబూ ఖాదీమ్ ఆదేశాల మేరకు పని చేస్తుంటాడని విచారణలో తెలిసింది. అబూ ఖాదీమ్ పాక్–ఆఫ్ఘాన్ సరిహద్దుల్లో ఉండి ఈ మాడ్యూల్‌ను నడిపిస్తున్నాడని.. దర్యాప్తులో వెల్లడైంది.

# సంపాదకీయం


## అభివృద్ధి, సుపరిపాలనకు పట్టం

బీహార్ 18వ శాసనసభ 243 స్థానాలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ప్రధాని మోదీ సారధ్యంలోని అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) అంచనాలకు మించి అఖండ విజయం సాధించడం సుపరిపాలనకు, అభివృద్ధికి అనుకూలంగా ప్రజలిచ్చిన తీర్పు. ప్రతిపక్ష మహాగట్‌బంధన్ నేతగా బరిలో నిలిచి హెూరాహెూరీగా తలపడి ఈసారైనా ముఖ్యమంత్రి కావాలని ఉ ధృతంగా ప్రచారం సాగించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) యువనేత తేజస్వి యాదవ్ ఆశలు ఆడియా శలయ్యాయి. ఎన్‌డిఎను దీటుగా ఢీ కొట్టడానికి కుటుంబానికో ప్రభుత్వ ఉద్యోగం, ప్రతి మహిళ ఖాతాలో నెలనెలా రూ. 2500 నగదు జమ చేస్తామని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి గట్టి ప్రయత్నాలు చేస్తామని, పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యమిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి యువత జీవితాలలో వెలుగులు నింపుతామని ఆశలు రేపినా అధికార కూటమి ముందు వెలవెలబోవలసి వచ్చింది. ఇందుకు భాగస్వామ్య పక్షాల పనితీరు ప్రధాన కారణమని భావిస్తున్నారు. ప్రాచీన జాతీయ పార్టీగా ఎన్నో ఏళ్ళ ఈ దేశాన్ని, వివిధ రాష్ట్రాల్లో ఏకఛత్రాధిపత్యం నెరపిన కాంగ్రెస్ గంగా మైదాన రాష్ట్రాలు యుపి, బీహార్, పశ్చిమబెంగాల్‌లో మండల్ రాజకీయాల కారణంగా ప్రాభవం కోల్పోయి, సంస్థాగతంగా కోలుకోలేనంత శిథి ల స్థాయికి చేరడం, అయినా చేవలేకపోయినా అత్యధిక స్థానాలు తీసుకుని మహాపరాజయం చెందడం ఈ ఎన్నికలలో మరింత స్పష్టమైనది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలలో పోటీచేసి 19 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ ఈసారి సర్దుబాటులో 51, స్నేహపూర్వక పేరుతో మరో 10 మొత్తం 61 స్థానాలలో పోటీ చేసి కేవలం 6 సీట్లే గెలవడం గట్‌బంధన్‌కు శరాఘాతమైనది. గత ఎన్నికల్లో వామపక్షాలు 16 స్థానాలు గెలిచి (సిపిఐ ఎంఎల్ 12, సిపిఐ 2, సిపిఎం 2) కాంగ్రెస్ కంటే మెరుగ్గా ఫలితాలు సాధించినా ఈసారి సిపిఎంఎల్ కేవలం 2, సిపిఎం భిభూతిపూర్ ఒక్క స్థానాన్ని గెలవగా, సిపిఐ ఒక్క స్థానం లో కూడా విజయం సాధించలేకపోవడం విచారకరం. యాదవ, ముస్లిం బంధంతో 32% ఓట్లకుతోడు అత్యంత వెనుకబడిన (ఇబిసి) కులాల ఓట్లు రాబట్టే వ్యూహంలో భాగంగా నిషదులలో 2.6% ఉన్న మల్లా ఉపకులం ఓట్ల కోసం ముకేశ్ సహానికి ఉప ముఖ్యమంత్రి హామీతో వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి)తో జట్టు కట్టినా ఆ పార్టీ ఒక్క సీటూ గెలవలేకపోయింది. సి.వి ముంబయిలో సినిమా సెట్ డిజైనర్‌గా పనిచేసే ముఖేష్ ఆరేడేళ్ల క్రితం బీహార్‌కు తిరిగి వచ్చి గత ఎన్నికల్లో ఎన్‌డిఎతో చేరి, డిప్యూటీ సిఎం పదవి హామీతో గట్‌బంధన్‌తో జట్టుకట్టినా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. గంగా తదితర నదీ పరీవాహక ప్రాంతాలలో పడవలు నడపటం, చేపలు పట్టడం వంటి వృత్తుల్లో ఉన్న కేవట్, మల్లా తదితర మత్స్యకారులు బీహార్ జనాభాలో 8 శాతం, ఇటీవలలో గణనీయంగా ఉన్నా వారు ప్రధానంగా జెడి(యు), ఎన్‌డిఎ మద్దతుదారులు. ఇలా ప్రధాన భాగస్వామ్య పక్షాలు అధ్వాన ప్రభావం చూపడంతో 50 మంది యాదవులకు అసెంబ్లీ టికెట్లు ఇచ్చినా గట్‌బంధన్ మహా పరాజయాన్ని చవిచూడక తప్పలేదు. అయితే తేజస్వి నేతృత్వంలో ఆర్‌జెడి గత ఎన్నికలలో 75 సీట్లు గెలిచి పెద్ద పార్టీగా నిలిచింది. ఈసారి 143 స్థానాలకు పోటీ చేసి కేవలం 25 సీట్లే గెలిచి, 50 సీట్ల కోల్పోయినా తన 23 శాతం ఓటు బ్యాంకును నిలబెట్టుకోగలగడం ఆ పార్టీకి కొంత ఊరట. బీహార్ వ్యవసాయ ప్రధాన నిరుపేద రాష్ట్రం. పట్టణ జనాభా కేవలం 11 శాతం. జీవాలు, పాడి పశువులు, మత్స్య పరిశ్రమపై ఆధారపడి ముదోవంతు రాష్ట్ర ప్రజలు మనుగడ సాగిస్తున్నారు. గట్‌బంధన్ గెలిస్తే 1990 నుండి -95 వరకు సాగిన లాలూ, రబ్రీదేవిల ఆటవిక పాలన మళ్లీ వస్తుందని ప్రధాని మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజనాథ్‌సింగ్, ఆరోగ్య మంత్రి నడ్డా, యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభృత ఎన్‌డిఎ నాయకులు చేసిన భారీ ప్రచారం ఇబిసి కులాలు, మహా దళితులను భీతావహులను చేసింది. అదీగాక గత పదేళ్లకాలంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు మహిళలు, నిరుపేదలకు అందాయి. పల్లె రోడ్లతోబాటు జాతీయ, రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేసి రాకపోకలను సుగమం చేయడాన్ని ప్రజలు హర్షించారు. 1000 కి.మీగా ఉన్న గ్రామీణ రోడ్లను 1,16,880 కి.మీకు విస్తరించారు. గత 12 ఏళ్లలో పల్లెల్లో వివిధ గృహనిర్మాణ పథకాల కింద పేదలకు 59 లక్షల ఇళ్లను నిర్మించారు. గతంలో నీళ్లు, విద్యుత్, రోడ్ల వంటి మౌలిక సదుపాయాల కోసం ప్రజలు ఎన్నో ఆందోళనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 2019లో జలజీవన్ మిషన్ ప్రారంభించింది. గతంలో కేవలం 2 శాతం ఇళ్లకు మాత్రమే రక్షిత మంచినీటి సరఫరా ఉండేది. గత ఆరేళ్లలో నితీశ్ ప్రభుత్వం 95.7 శాతం ఇళ్ళకు మంచినీటి సౌకర్యాలు కల్పించింది. అఖిలభారత స్థాయిలో రక్షిత నీటి సరఫరా 81.3%. జాతీయ సగటు కంటే తక్కువే అయినా బీహార్‌లో తలసరి విద్యుత్ వినియోగం గత 12 ఏళ్లలో 134 నుండి 363 యూనిట్లకు పెరిగి, 3 రెట్లు పెరిగింది. ఈ అభివృద్ధి కార్యక్రమాలేగాక మహిళా సాధికారతను పెంపొందించడం కోసం నితీశ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయగా, పట్టుదలగా కృషి చేస్తూనే ఉంది. 2006 లోనే పంచాయతీలలో 50 శాతం స్థానాలను మహిళలకు రిజర్వ్ చేసిన మొదటి రాష్ట్రం బీహార్. ఆ తర్వాత ఆ రిజర్వేషన్లను పురపాలక సంఘాలకు విస్తరింపజేశారు. బాలికల విద్యను ప్రోత్సహించడానికి నితీశ్ ప్రభుత్వం 2006లో బాలికలకు సైకిళ్లు కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ. 2 వేలు ఇచ్చింది. అదీగాక హైస్కూలు నుండి డిగ్రీ వరకు వివిధ స్థాయిలలో బాలికలకు లక్ష వరకు ప్రత్యేక స్కాలర్ షిప్‌లు ఇస్తూ వచ్చారు. ఇందువల్ల విద్యావ్యాసం కొనసాగించే బాలికల సంఖ్య 67 శాతానికి పెరిగిందని గణాంకాలు ఘోషిస్తున్నాయి. సోషలిస్టు అయిన నితీశ్ 1973లో స్వర్గీయ మంజు కుమారిని వివాహమాడినపుడు వరకట్నం వద్దని వివాహం పాటించారు. గత ఎన్నికలలో ఒంటరిగా బరిలోకి దిగి జెడి(యు)పై పోటీ పెట్టి ఆ పార్టీ విజయావకాశాలు దెబ్బతీసిన చిరాగ్ పాశ్వాన్ లోక్‌జనశక్తి పార్టీ ఈసారి ఎన్‌డిఎ భాగస్వామిగా 29 స్థానాలకు పోటీ చేసి, 19 గెలిచి బీహార్‌లో 4వ పెద్ద పార్టీగా నిలిచింది. ఎల్‌జెపి, మహా దళిత నేత జితన్ రామ్ మాంజి భాగస్వాములుగా ఉన్నందున గత ఎన్నికల్లో 37% ఉన్న ఎన్‌డిఎ ఓట్లు 10 శాతం అంటే 47 శాతానికి పెరిగాయి. 2010 ఎన్నికలలో ఆర్‌జెడికి 22 స్థానాలు, ఎన్‌డిఎకు 206 స్థానాలు వచ్చాయి. 2020 ఎన్నికలలో 43 స్థానాలకే పరిమితమైన నితీశ్ జెడి(యు) ఈసారి రెట్టింపు (85) స్థానాలు గెలవడమేగాక, తన సుపరిపాలనతో మహిళలు, మహా దళితులు, అత్యంత వెనుకబడిన కులాలను బాగా ఆకట్టుకుని వాళ్ళు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొని ఎన్‌డిఎ 67% పైగా ఓట్లు సాధించడంలో ప్రశంసనీయ పాత్ర పోషించారు. అందుకే జెడి(యు) ఈసారి 5% ఓట్లు పెరిగి, ఓట్లు 23 శాతానికి పెరగడం గమనార్హం. నితీశ్ ఎక్కడా కులమత ఘర్షణలు జరగకుండా పాలనలో కట్టుదిట్టంగా చర్యలు చేపట్టారు. మైనారిటీలకు రక్షణ కల్పించారు. నితీశ్ ప్రాబల్యాన్ని తగ్గించడానికి బిజెపి కుతంత్రాలు పన్ని చిరాగ్‌ను ఎగదోసినా, పెద్ద పార్టీగా బిజెపికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని అప్పుడప్పుడు కొందరు కమల నేతలు సన్నాయి నొక్కులు నొక్కినా అందుకు సాహసించలేకపోయారు.

# శాస్త్ర పరిశోధనలో సిద్ధి పొందిన తాపసి సి.వి. రామన్



విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్ ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహెూన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్ లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాస్సై కలకత్తా ప్రభుత్వ ఆర్థిక శాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లవలేమేమిటి?. విదేశీయులే... పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహెూన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్ లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డ పైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. "నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు."విజ్ఞాన శాస్త్ర సారాంశం ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు. మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ దైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గత మవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు. రామన్. అప్పటికున్న అరకొర సదుపాయాలతోనే మన దేశ విజ్ఞాన కిరణాలను నలుదిశలా ప్రసరింప జేశారు. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు. పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించారు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్ట్" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటిష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్ కు ఎన్నో గౌరవ డాక్టరేట్లు లభించాయి. 1924 లో ఇంగ్లండ్ "రాయల్ సొసైటీ" సభ్యుడయ్యాడు. 1928 లో రామన్ కు "సర్" బిరుదు దక్కింది. 1947 లో ప్రతిష్టాత్మకమైన "ఫ్రాంక్లిన్ మెడల్" లభించింది. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్థ్యంతో ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. 1987 ఫిబ్రవరి నుండి ప్రతీ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం అధికారకంగా జరుపుతోంది. రామన్ నూటికి నూరుపాళ్ళు భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్స్ రంగంలో విజయ ఢంకా మోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్స్ లో, పారిశ్రామిక రంగం లోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రో స్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణ పై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరు లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించారు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగళూ రులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్స్ అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టల్ స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# మనవ జీవన విధానం పై టెలివిజన్ ప్రభావం



1996 నవంబర్ 21, 22 తేదీలలో ఐక్యరాజ్య సమితి మొదటి ప్రపంచ టెలివిజన్ ఫోరమ్‌ను నిర్వహించింది, దీనిలో ప్రముఖ మీడియా ప్రముఖులు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో సమావేశమై నేటి మారుతున్న ప్రపంచంలో టెలివిజన్ గురించి పెరుగుతున్న ప్రాముఖ్యతను చర్చించారు. అందుకే నవంబర్ 21ని ప్రపంచ టెలివిజన్ దినోత్సవంగా ప్రకటించాలని మహాసభ నిర్ణయించింది. అప్పటి నుండి నవంబర్ 21 న ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. టీవీ అద్భుతమైన ఆవిష్కరణలలో ఒకటి. మానవ జీవన విధానం పై ప్రభావాన్ని సృష్టించిన ఏకైక ఎలక్ట్రానిక్ మీడియా ఇది. టెలివిజన్" (దూర దర్శన్) అనునది సుదూర ప్రాంతాలకు ఒక మాధ్యమం ద్వారా చలన చిత్రాలను, ధ్వనిని ఒకేసారి గ్రహించగలిగే సాధనం. దీనిద్వారా దృశ్య, ధ్వని సమాచారాన్ని ఒకేసారి గ్రహించవచ్చు. ఇది నలుపు-తెలుపు, రంగుల్లో చిత్రాలను చూపించే సాధనం. టెలివిజన్ అనే పదమునకు మూలం లాటిన్, గ్రీకు పదాలు. "దూర దృష్టి" అనే అర్థం వచ్చే గ్రీకు పదం. టెలి అనగా దూరం, లాటిన్ పదం విజియో అనగా దృష్టి అని అర్థము.విద్యుత్ సహాయంతో వార్తల్ని పంపే టెలిగ్రాఫ్ కనుక్కోబడిన రోజుల్లోనే బొమ్మల్ని కూడా ఇలా పంపడానికి వీలవుతుందా అని అలెగ్జాండర్ బెయిన్ అనే స్కాట్?లాండ్ మనో వైజ్ఞానిక శాస్త్రజ్ఞుడు ప్రయత్నం చాడు. దీనికోసం 1842 లో ఇతడు రూపొందించిన చిన్న యంత్రాన్ని బేక్?వెన్ అయిడెల్ల తరువాత మెరుగు పరచాడు. ఈ యంత్రంలో ప్రసారిణి, రిసీవర్ అనే రెండు స్తూపాలుంటాయి. దాదాపు అర్థ శతాబ్దం తరువాత ఆర్థర్ కార్న్ అనే జర్మన్ భౌతిక శాస్త్రజ్ఞుడు ఈ పద్ధతిని మెరుగు పరిచాడు. ప్రసారిణిలో సూదికి బదులు ఫోటో ఎలక్ట్రిక్ సెల్ ని ఉపయోగించాడు. ప్రసారం చేయాల్సిన బొమ్మ వివిధ భాగాలపై క్రమంగా కాంతిని పడనించాడు. ఇలా చేయడాన్ని "స్కానింగ్" అంటారు. వివిధ భాగాల కాంతి తీవ్రతలకు అనుగుణంగా విద్యుత్ ప్రవాహంలో మార్పులు సంభవిస్తాయి. ఈ విద్యుత్తును రిసీవర్కు పంపిస్తారు. మారుతున్న విద్యుత్ కి అనుగుణంగా ఇక్కడ ఓ చిన్న దీపం వెలుగుతూ, దాని కాంతి తీవ్రతలో హెచ్చు తగ్గులను ఏర్పరుతాయి. తిరుగుతున్న స్థూపం మీద అతికించ బడిన ఫోటోగ్రాఫీ కాగితంపై ఈ కాంతి పడినప్పుడు ప్రసారిణిలో వుండే బొమ్మలాంటి ప్రతిబింబం నిర్మించ బడుతుంది.ఇలాంటి పద్ధతి ఇప్పుడు కూడా వినియోగిస్తున్నారు. పోలీసు శాఖకి, వార్తాపత్రికలకి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. వార్తలకు సంబంధించిన ఫోటోలను వివిధ నగరాల నుండి వెలువడే పత్రికల్లో ఏక కాలంలో ముద్రించటానికి ఈ పద్ధతి బాగా ఉపకరిస్తుంది. అమెరికా లోని కొన్ని పత్రికా సంస్థలు ఈ పద్ధతి ద్వారా మొత్తం వార్తా పత్రికలనే పేజీల వారీగా ప్రసారం చేయటం 1950 నుంచి వాడుకలో ఉంది. స్కానింగ్ విధానము దిశలో మొదటి ప్రయోగం 1883 లోనేజరిగింది. బెర్లిన్ విశ్వవిద్యాలయం లోని పోల్ నిప్ కో అనే విద్యార్థి కాస్త మొరటుగా ఉండే స్కానింగ్ సాధనాన్ని నిర్మించాడు. ముఖ్యంగా రెండు ఆవిష్కరణలు అతని ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేశాయి. మొదటికి టెలిఫోన్. సెలీనియం అనే లోహంపై సూర్యకాంతి పడి నప్పుడు దానిగుండా విద్యుచ్ఛక్తి మరింత సులువుగా ప్రవహిస్తుందనే విషయాన్ని కనుక్కోవడం రెండోది. దీని ఆధారంగానే ఫోటో ఎలక్ట్రిక్ సెల్ నిర్మించబడింది. సెలీనియం పై పడే కాంతి తీవ్రతలలో తేడాలను బట్టి విద్యుత్ ప్రవాహం మారుతుంది. గనుక ఒక దృశ్యాన్ని ఈ సిద్ధాంతం ఆధారంగా ప్రసారం చేయాలని నిప్ కో ప్రయత్నించాడు.దృశ్యాన్ని చిన్నచిన్న భాగాలుగా చేసి, వాటిని ఓ క్రమ పద్ధతిలో వేగంగా స్కాన్ చేయాలి. వాటి కాంతి తీవ్రతల తేడాను బట్టి ప్రవహించే విద్యుత్ పరిమాణంలో మార్పులు ఏర్పడతాయి. రిసీవర్ లో ఈ విద్యుత్తుని మళ్లీ కాంతిగా మార్చిస్తే, తెరపై తొలిదృశ్యాన్ని నిర్మించవచ్చు. ఈ సిద్ధాంతం ఆధారంగా నిప్కో నిర్మించిన పరికరానికి విద్యుత్ దూరదర్శిని అని పేరు పెట్టారు. క్రూక్స్ అనే శాస్త్రజ్ఞుడు నిర్మించిన కాథోడ్ కిరణ నాళాన్ని స్ట్రాన్?బర్గ్ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ బ్రాన్ మెరుగుపరిచాడు. కిరణ నాళంలో ఒక వైపున వుండే తెరని కొన్ని రసాయనిక పదార్థాలతో పూస్తే దానిపై ఎలక్ట్రాన్ లు పడినపుడు కాంతివంతమైన చుక్కలు ఏర్పడతాయని బ్రాన్ కనుగొన్నాడు. బ్రాన్ నాళం అనబడే ఈ పరికరం 1897 లో తయారైంది. ఈ సూత్రం ఆధారంగానే జూలియస్ ఎల్?స్టర్, హాన్స్ గైటెర్ అనే ఇద్దరు జర్మన్ శాస్త్రజ్ఞులు సెలీనియం కంటే అతి వేగంగా, సమర్థవంతంగా పనిచేసే ఫోటో ఎలక్ట్రిక్ సెల్ ని నిర్మించారు.స్కాట్లండ్ కు చెందిన ఓ క్రైస్తవ మతాధికారి కొడుకు జాన్ లోగీ బెయిర్డ్ కొన్ని ఆకారాల్ని సుమారు మూడు మీటర్ల దూరందాకా ప్రసారం చేయడంలో కృతకృత్యుడయ్యాడు. తరువాతి పరిశోధనల ఫలితంగా 1925 అక్టోబరు 2 వ తేదీన ఓ కంపెనీలో పనిచేసే అబ్బాయి ముఖాన్ని ప్రసారంచేయగా, ఈ చిత్రాన్ని పక్క గదిలోని రిసీవర్లో చూడటం జరిగింది. కొన్ని నెలల తర్వాత, అతడు తన పరికరాన్ని వైజ్ఞానిక సంఘ సభ్యులకూ, పత్రికా విలేఖరులకూ ప్రదర్శించాడు. అనేక విధ్వాలు ఏర్పడినా పార్లమెంట్ పత్తిడి మూలంగా 1929 లో బి.బి.సి ప్రయోగాత్మకంగా టెలివిజన్ కార్యక్రమాల్ని ప్రసారం చేయటం మొదలుపెట్టింది. టెలివిజన్ ప్రసారాల్ని క్రమంగా ప్రసారం చేయడం లండన్ లో 1936 నవంబర్ 2 వ తేదీన ప్రారంభమైనది. ఒక వారం ప్రసారం బెయిర్డ్ పద్ధతిలో జరిగితే మరుసటి వారం జ్వోరికిన్ పద్ధతిలో జరుగుతుండేవి. రెండు పద్ధతుల్ని మార్చి మార్చి వాడాక జ్వోరికిన్ పద్ధతినే తుదకు ఎన్నుకున్నారు. ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికాలో టెలివిజన్ కు అంకురార్పణ జరిగింది. యుద్ధం ముగిసిన తరువాత టెలివిజన్ రిసీవర్ ల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 1960 నాటికి దేశంలో మూడింట రెండు వంతుల జనాభా టెలివిజన్ కార్యక్రమాల్ని తిలకించటానికి వీలైంది. విన్న విషయాల కంటే కళ్లకు కట్టినట్టు చూసిన కార్యక్రమాల ప్రభావం మూలాన రేడియో తెరమరుగై, టెలివిజన్ విశ్వరూపం ధరించి ప్రపంచ మంతటా వ్యాపించటం మొదలైంది. ఆధునిక ప్రజాస్వామ్యంలో ఇది కీలక సాధనం. సాంకేతిక ప్రగతి ఊహించలేని స్థాయికి ఎదిగింది. చేయిలో ఉంచుకోవటానికి వీలైన పరిమాణంలో టెలివిజన్ సెట్ ని 1952 లో తయారు చేశారు.మొదట నలుపు తెలుపు దూరదర్శినిలు మాత్రమే వచ్చాయి. కొంతకాలానికి రంగుల దూరదర్శిని వాడకంలోకి వచ్చింది. పెద్ద సాధారణ టీవీ నుండి స్మార్ట్, సాగిస్తున్న టీవీ వరకు టీవీ అసాధారణమైన వృద్ధిని సాధించింది. టీవీ సిగ్నల్స్ కూడా అనలాగ్ నుండి డిజిటల్ గా మార్చబడ్డాయి. ఈ రోజు %ుణ% (హై డెఫినిషన్) టీవీ, ఐపిటీవి, మొబైల్ టీవీ మరియు 3 డి టీవీ ఉన్నాయి. ఈ రోజు టీవీ ప్రసారం, కమ్యూనికేషన్, కంప్యూటర్ల కలయికకు ఇది ఒక అద్భుతమైన ఉదాహరణ. వెబ్ బ్రౌజింగ్, వీడియో కాల్స్ మరియు సోషల్ నెట్‌వర్కింగ్ చేయవచ్చు.భారత దేశంలో 1959లో టీవి ప్రవేశించగా, 1961 లో ఈ పాఠ్యాంశాల కోసం టెలివిజన్ కార్యక్రమాలు ప్రవేశ పెట్టబడ్డాయి.1965 లో ఢిల్లీ ద్వారా ప్రతిరోజూ న్యూస్ బులెటిన్‌తో ఒక గంట సమయం, కొన్ని వినోద కార్యక్రమాలు కూడా ప్రారంభం అయినాయి.1967 లో కృషి దర్శనం, గ్రామీణ, రైతుల కోసం కార్యక్రమాలు ఉన్నాయి. 1972 లో టీవీ సేవలు ముంబైకి విస్తరించ బడ్డాయి.1975 నాటికి కలకత్తా, చెన్నై, శ్రీనగర్, అమృతసర్, లక్నో వంటి నగరాల్లో కూడా టీవీ స్టేషన్లు ఉన్నాయి.1975-76లో ఉపగ్రహ బోధనా టెలివిజన్ ప్రయోగం 2,400 గ్రామాలకు తీసుకువచ్చింది.ఏప్రిల్ 1, 1976 న, దూరదర్శన్ ఆల్ ఇండియా రేడియో నుండి విడిపోయింది. దూరదర్శన్ భారత ప్రభుత్వం నిధులు సమకూర్చిన స్వతంత్ర ప్రజా సేవా ప్రసారకర్త. భారత్‌లో టీవీ ప్రసారాలను 1972 లో ఢిల్లీ లో చిన్నగా భూస్థిత నెట్ వర్క్ ను ప్రస్తుతం దూరదర్శన్ ప్రారంభించి, 1984 నాటికల్లా కలర్ ప్రసారాలను ప్రవేశ పెట్టారు. రామాయణం, మహా భారత్, భారత్ ఏక్ ఖోజ్, రజని వంటి గొప్ప సీరియల్లను చూపారు. 1990 తరువాత అంతర్ జాతీయ చానెల్స్ ఉపగ్రహ ప్రసారాలు ప్రారంభించగా1995 లో ప్రాంతీయ చానల్స్ రాకతో కేబుల్ టీ.వి వ్యవస్థ ప్రారంభమైంది.

## మాసానాం మార్గశీర్షోహం"

బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్‌మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః"వేదాలలో సామవేదాన్ని, ఛందస్సుల్లో గాయత్రీ ఛందస్సును, మాసాలలో మార్గశిర మాసాన్ని, ఋతువులలో వసంత ఋతువును' అంటూ సాక్షాత్తు శ్రీ కృష్ణ పరమాత్ముడు భగవద్గీతలోని విభూతియోగంలో చెప్పిన శ్లోకమిది. కార్తీకయుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడు, వంటివారితో పాటు స్వయం భగవానుమూర్తి ప్రకటితమైన శ్రీమద్భగవద్గీత అవతరించిన మాసం. విభూతి యోగంలోనే "నక్షత్రాణ మహం శశి" అన్నారు. చంద్రుడు తారా నాధుడు. "మాసాలలో మార్గశీర్షం- నక్షత్రాలలో చంద్రుడు"- మృగశిరా నక్షత్ర యుక్త పౌర్ణమిని మార్గశిరం - ఈ మాసమునకు అధినాయకుడు చంద్రుడు. మృగశిరా నక్షత్రముకు కూడ చంద్రుడే అధినాయకుడు. ఇంకే నక్షత్రానికి చంద్రుడు అధినాయకుడు కాదు. నక్షత్రములు మృగశిరాదిగా నెలలు, మార్గ శీర్షమాదిగా లెక్కించెడివారు. అందువలన మార్గశిర మాసమును భగవానుడు ప్రాధాన్యత కలిగించారు.విషువత్తు అంటే రాత్రి దివసముల సమాన కాలము. మృగశిరా నక్షత్రముతో మనువూర్వ రుషులు విషువత్తు నిర్ణయం గావించారు. మృగశిరా విషువత్తుతో మొదలయ్యే కాలం మార్గశీర్షం.మార్గశిర మాసానికి ఇంకొక ప్రాముఖ్యం ఉంది. పరమ పవిత్రమైన గోదాదేవి వ్రతం ఆరంభించి ఉపనిషత్సుల్యమైన పాశురములను అనుగ్రహించినది. "మార్గళంగల్ మదినిఱైన్ద నన్నాళాల్ మార్గశిరము వచ్చినది. పూర్ణ చంద్రునితో కూడిన శుక్ల పక్షము – వైష్ణవ మాసము – మార్గశీర్షము అనగా భగవంతుని పొందుదారి– "నారాయణనే నమక్కే" అని శరణాగతి.భాగవతం దశమ స్కంధంలోనే భగవంతుని వెదకిన గోపికలు హేమంతంలో ప్రథమ మాసంలో నందవ్రజ కుమారికలు భగవత్ ప్రసాదం "హవిష్యాన్న భుంజానః" కాత్యాయనీ వ్రతం చేయుటకు పూనుకొన్నారని ప్రమాణం ఉన్నది.మార్గశిరం తొమ్మిదవ మాసం. మృగశిరా నక్షత్రంతో కూడిన పౌర్ణమి గల మాసం మార్గశిరం. మార్గశీర్షం పరమ పవిత్రం. నక్షత్ర మండలంలో మూడు నక్షత్రాలు శీర్షాకృతిని పోలి ఉన్నందున "మృగశీర్ష" అని పేరువచ్చింది. రాశి అధి పతి గురుడు, సూర్యచంద్రుల సమాగమమును సంతరించుకున్న ఈ మాసం విష్ణు ఆరాధనతో మోక్షదాయిని అయింది. ఒకప్పుడు మార్గశిరంలోనే సంవత్సరారంభం ఉండేదట. మార్గశిర మాసంలో ఉండేవారు ఉండేవి వారంలో ఉంటుంది వాటి. భాగవత దశమ స్కంధంలో బమ్మెర పోతనామాత్యుడు, గోపబాలుడు "మార్గశీర్షవ్రతం" జరిపారని పేర్కొన్నాడు. కోటిసూర్య గ్రహణ స్నాన తుల్య ఫలాన్ని ఇచ్చే మార్గశిర శుక్ల ప్రతిపద, ఉమామహేశ్వ వ్రతం, అనంత తృతీయ, యోగ తృతీయ, నామ తృతీయ, అనఘ శుక్ల తృతీయ నాడు రంభావ్రతం, చవితి నాడు వినాయక చతుర్థి వ్రతం, పంచమి నాడు దక్షిణాత్యుల నాగపూజ, శివుని రెండవ కుమారుడు, కుమారస్వామి, కార్తికేయుడు స్కందుడు, గుహుడు, షణ్ముఖుడైన సుబ్రహ్మణ్య స్వామిని కొలిచే సుబ్బారాయుడి షష్ఠినాడు స్కంద వ్రతం, బ్రహ్మచారి పూజ, సర్పపూజ, సప్తమి సూర్య ఆరాధన, నందా సప్తమీ వ్రతం, అష్టమి నాడు కాల భైరవ పూజ, నవమి నాడు నందిని దేవి పూజ, దశమి నాడు ఆరోగ్య వ్రతం, మోక్షైకాదశి, స్మార్త ద్వాదశి అని పిలువబడే ఏకాదశి విష్ణు ఆరాధన, త్రయోదశి హనుమత్ వ్రతం, ద్వాదశి నాడు తెలుగు వారి ఇలవేలుపు అయిన వేంకటేశ్వరుని పుష్కరిణి తీర్థదినంగా, త్రయోదశి గోదావరి ప్రాంత హనుమజ్జయంతిగా, చతుర్దశి దత్తాత్రేయుని అవతార పౌర్ణమి నాడు దత్త జయంతి, చంద్రపూజ, యమా రాధన, కృష్ణపక్ష ద్వాదశి మల్లన్న ద్వాదశిగా, చతుర్దశి మాస శివరాత్రి, వ్రత నిష్ఠాపరులకు ఆదరణలో ఉన్నాయి.

# విద్యార్థులు ఆంగ్ల భాష పై పట్టు సాధించే విధంగా తీర్చిదిద్దాలి

- ♦ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ♦ హసన్ పర్తి మండలం కోమటిపల్లి, చింతగట్టు లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన జిల్లా కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

హనుమకొండ, నవంబర్ 20 (వుదయం జిల్లా ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్ల భాష పై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం కోమటిపల్లి లోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చింతగట్టులోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ముందుగా కోమటిపల్లి లోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రతిరోజు ఎంతమంది చిన్నారులు కేంద్రానికి వస్తుంటారని అంగన్వాడీ టీచర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఒకటి నుండి ఐదో తరగతి వరకు ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఎలా చదువుతున్నారు, ఆంగ్ల భాషలో బోధిస్తున్నారా అని ఉపాధ్యాయులను కలెక్టరు అడిగి. పాఠశాల విద్యార్థులతో ఆంగ్లంలోని పాఠ్యాంశాన్ని చదివించి దాని అర్థం తెలుసా అని విద్యార్థులను కలెక్టర్ అడిగారు. ఆంగ్ల పాఠాన్ని ఉపాధ్యాయురాలు చెబుతుండగా కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా చింతగట్టులోని ప్రాథమిక పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని, ఏ తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో రోజు ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారని, ఆంగ్లంలో విద్యార్థులకు చదవడం రాయడం వచ్చా అని, అందరికీ యూనిఫామ్స్ ఇచ్చారా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను గణిత టేబుల్స్ గురించి అడిగారు. ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. గదిలో పాఠ్యాంశాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయుడితో విద్యార్థులకు ఏ మాధ్యమంలో పాఠ్యాంశాన్ని బోధిస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానంలో విద్యార్థుల నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పాఠ్యాంశం అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశం చెప్పే ముందు ఉపాధ్యాయులు ముందస్తుగా సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో మాట్లాడాలని, పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకోవాలన్నారు. పాఠ్యాంశంలోని ప్రతి వాక్యం అర్థం విద్యార్థులకు తెలిసి ఉండాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సబ్జెక్టులను మెరుగైన బోధనతో పాఠ్యాంశాలను అర్థవంతంగా వివరించాలని సూచించారు.

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ♦ ఆర్టిఏ సభ్యులు పోషల్ రాజేష్



నారాయణపేట టౌన్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా నారాయణపేట పట్టణం లోని పలు రహదారులకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి శ్రీకారం చుట్టేందుకు ప్రయత్నిస్తామని ఆర్టిఏ సభ్యులు పోషల్ రాజేష్ అన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్ నారాయణపేట పట్టణంలో ట్రాఫిక్ ఎస్ఐతో కలిసి పలు ట్రాఫిక్ సమస్యలపై ముఖ్య రహదారులను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్నిక రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. పట్టణంలో ఉన్న చౌరస్తా కూడలిలో ముఖ్యంగా సరఫ్ బజార్, ఓల్డ్ బస్టాండ్, న్యూ బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, సింగారం చౌరస్తాలలో పలు ట్రాఫిక్, రోడ్డు భద్రతకు సంబంధించిన పలు సమస్యలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. దామరగిద్ద రహదారి, హైదరాబాద్ రహదారులను పరిశీలించారు. నారాయణపేట వ్యాపార సంఘాలు వారి యొక్క వ్యాపార కూడలి దగ్గర, దుకాణాల దగ్గర ద్విచక్ర వాహనాల పార్కింగ్ ను ఎక్కడపడితే అక్కడ ఉండడం సరికాదని వ్యాపారస్తులకు ఆర్టిఏ మేంబర్ పోషల్ రాజేష్, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ కాంత్ సూచించారు. నిత్యం రవాణా చేసే వాహనాలకు డ్రైవర్ లుగా వెళ్లే వాహన డ్రైవర్లకు నిబద్ధత ప్రకారం అతివేగం ప్రమాదకరమని సూచించినట్లు ఆయన తెలిపారు . ఆటోల పార్కింగ్ వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ముఖ్యంగా మలుపుల దగ్గర, చౌరస్తా కూడలిలో స్పీడ్ బ్రేకార్లు, సైన్ బోర్డు ల కొరత ఉందని గుర్తించారు. రహదారి పక్కన ఉన్న స్కూళ్లను వారు గుర్తించి అక్కడ స్కూల్ జోన్ బోర్డులను నిర్మించాలని నిర్ణయించారు. అదేవిధంగా నారాయణపేట మున్సిపాలిటి పరిధిలోగల చెట్లు కూడా వేపుగా పెరిగి రోడ్డుపైకి వంగి ఉండడం చాలా చోట్ల తొలగించే ప్రయత్నం చేస్తామన్నారు. రోడ్డు భద్రత మహోత్సవ కార్యక్రమంలో వీటి గురించి తెలిపి వీటి సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి దృష్టికి, కలెక్టర్ దృష్టికి, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి ముందు జరగ బోయే రోడ్ సేఫ్టీ కార్యక్రమం లో వీటిపై ప్రతిపాదన చేసి ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, కాంగ్రెస్ నాయకులు మజీద్, సీతారాం రెడ్డి, జనార్ధన్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి


- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని
- వీడియో కాన్ఫరెన్స్ ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం




గద్వాల నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి, హొహొఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు – కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈ ఈ ఈ పి సి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్య క్రమం లో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ నర్సింగరావు, అడిషనల్ ఎస్పీ శంకర్, డిపిఓ నాగేంద్రం, ఎంపీడీవోలు, సంబంధ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హసన్ పర్తి మండలం చింతగట్టులో తుది దశ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్



ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

హనుమకొండ, నవంబర్ 20 (వుదయం జిల్లా ప్రతినిధి) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం చింతగట్టు లో జనగాని సంధ్యారాణి, రాజ్యలక్ష్మి అనే లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు తుది దశ కు చేరుకోగా అధికారులతో కలిసి కలెక్టర్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరికృష్ణ, తహసిల్దార్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉన్నత శారద విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాల ఎదుట ధర్నా ఏబివిపి రాష్ట్ర ఎస్ ఎఫ్ డిసిఓ కన్వీనర్ వెంకటేష




అలంపూర్, నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ శాంతినగర్ శాఖ ఆధ్వర్యంలో జులేకల్ గ్రామంలో ఉన్న శారద విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఉదయ్ అనే విద్యార్థి ని క్లాస్ టీచర్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదని ఉద్దేశంతోనే విద్యార్థిని మోకాల మీద నడిపించగా రక్త గాయాలయ్యాయి విద్యార్థి నడవలేక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి పరిషత్ కార్యకర్తలు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ ఎఫ్ డి సి ఓ కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ శారద విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించకుండా డొక్కు ఆటో లలో విద్యార్థులను పాఠశాలకు తీసుకుని వస్తున్నారు మరియు పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఉదయనే విద్యార్థిని క్లాస్ టీచర్ మోకాల మీద నడిపించింది. ఈ ఘటనకు కారణమైన క్లాస్ టీచర్లు మరియు పాఠశాల పై తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు మరల జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు 1. ఘటనకు కారణమైన క్లాస్ టీచర్ను వెంటనే సస్పెండ్ చేయాలి 2. విద్యార్థిని మోకాళ్ళ మీద నడిపించడానికి గల కారణాలను తెలియజెప్పాలి 3. పాఠశాలకు వెంటనే బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో శాంతినగర్ నగర కార్యకర్తలు రామ్ గణేష్ పవన్ మరియు ఐజ నగర సంయుక్త కార్యదర్శి నరేష్ తిరుమలేష్ విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట కాదు ఇది దుమ్ము పేట



దమ్మపేట నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా దమ్మపేట లోని నెమలి పేట నుండి మందలపల్లి క్రాస్ రోడ్డు వరకు సెంటర్ డివైడర్ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో గతవారంగా డివైడర్ మధ్యలోని మట్టి నింపే పనిలో భాగంగా ట్రాక్టర్లతో మట్టి తోలి, డివైడర్ పక్కన మట్టి పోయడం జరిగింది పోసిన మట్టిని మూడు రోజులు నాలుగు రోజుల తర్వాత తీసి డివైడర్ మధ్యలో పోయటం జరుగుతుంది కానీ దీనికి ఎటువంటి నిబంధనలు పాటించకుండా విపరీతమైన దుమ్ము ధూళితో వాహనదారులను మరియు దుకాణదారులను విపరీతమైన దుమ్ముతో దమ్మపేట నిండిపోయింది పెద్ద వాహనం ఏదైనా ముందుగా వెళుతుంటే షాపులు పైన మరియు వాహనాలకు దారి కనిపించక అనేక ఇబ్బందులు పడుతున్నారు మట్టి కుప్పలుగా పోసి మూడు రోజులకు తీయడం ద్వారా విపరీతంగా రోడ్డుపై మట్టితో నిండిపోయింది దీనిపై ప్రతిపక్షాలు గాని అధికారపక్షం కానీ నోరు మెదడం లేదు దమ్మపేట ప్రజలు దుకాణదారులు వాహనదారులు బహిరంగంగానే అధికారులను తిట్టడం జరుగుతుంది కొన్ని ప్రదేశాల్లో పనులు పూర్తి అయినా గాని రోడ్డుపై మట్టి ఇసుక రాళ్ళు అలాగే వదిలేశారు దీనిపై పంచాయతీ అధికారులు గాని డివైడర్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ గాని రోడ్డుపై ఉన్న మట్టిని శుభ్రం చేయడం లేదు దీనిపై స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జారే ఆదినారాయణమరియు కాంగ్రెస్ నేతలు అధికారులు దీనిపై దృష్టి పెట్టి వెంటనే రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించి దమ్మపేటను దుమ్ము పేట నుండి కాపాడవలసిందిగా పలువురు కోరుచున్నారు

# కనకదుర్గ కాటన్ మిల్ వద్ద సిసిఐ కొనుగోళ్ళ ను పరిశీలించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు



మధిర, నవంబర్20(వుదయం ప్రతినిధి): దెందుకూరు కనకదుర్గ కాటన్ మిల్ నందు గురువారం నాడు సిసిఐ ద్వారా కొనుగోలు చేస్తున్న పత్తి కొనుగోళ్ళను పరిశీలించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు. పత్తి అమ్ముకోవడానికి వచ్చిన రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయ అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మిల్లు యజమాని, కాటన్ ప్రోక్యుర్ ఆఫీసర్ తో మాట్లాడి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తేమ శాతంలో కొంత వెసులుబాటు ఇవ్వాలని కోరారు. కాటన్ జిన్నింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది మరియు రైతులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, గంట వెంకటేశ్వరావు తదితర రైతులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు



నారాయణపేట నవంబర్ 20(వుదయం ప్రతినిధి): గ్రంథాలయాలు విజ్ఞాన బాండా గారాలని పుస్తకపఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుందని చిన్ననాటి నుండే గ్రంథాలయంలో పుస్తకాలను చదవడం ద్వారా పోటీ పరీక్షలకు ఉపయోగకరమైనపుస్తకాలతోపాటు ప్రపంచం విషయాలను తెలుసు కోవచ్చునని జిల్లా కాంగ్రెస్ డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చేర్మెన్ వార్ల విజయకుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, ముగ్గుల పోటీ, చిత్రలేఖనం దేశభక్తి పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులు హాజరై విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ చేర్మెన్ సదాశివా రెడ్డి, లై బ్రేరి కార్యదర్శి ఎం ప్రతాప్, మాజీ మార్కెట్ చేర్మెన్ బండి వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ పట్టణఅధ్యక్షులు సలీమ్, మార్కెట్ డైరెక్టర్ శరణప్ప, ఆర్టిఏ సభ్యులు పోషల్ రాజేష్, గుండ్ మల్ మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి, కోస్గి మాజీ సర్పంచ్ శ్రీలతనరేందర్, లైబ్రెరియాన్ శిల్ప, రాంమోహన్, శ్రీకాంత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి ద్వారా మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- ఏపీఎం రమాదేవి.



ఖానాపురం, నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): చైతన్య మండల సమైక్య ఆధ్వర్యంలో ఐకెపి ద్వారా శుక్రవారం ఉదయం 3 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఏపీఎం రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని మూడు గ్రామాలలోని ఐకెపి ద్వారా శుక్రవారం ఉదయం 10 గంటలకు రాగంపేట, 10:30కు మంగళవారిపేట, 11:00 గంటలకు అయోధ్యనగర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఏపీఎం తెలుపుతూ, ఇట్టి కార్యక్రమంలో ఆయా గ్రామాలలోని నాయకులు మహిళా సంఘాలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఏపీఎం తెలిపారు.

# వేంసూర్ మండలంలో

- బాలల హక్కుల వారోత్సవాలు




సత్తుపల్లి నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా చౌడవరం హైస్కూల్లో సిడిపిఓ మెహరున్నిసా బేగం, వేంసూరు మండల సూపర్ వైజర్లు వసంత రాణి, కమల మరియు భవాని పిల్లలకు వారి యొక్క హక్కులు మరియు పరిశుభ్రత ఇంకా మొదలైన విషయాల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా వేంసూర్ గ్రామంలో ఉన్న సెంటు జోసఫ్ మెర్సి హెూమ్ ను సందర్శించి అక్కడ పరిస్థితులు వసతులు అన్ని పరిశీలించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో సిడిపిఓ మెహరున్నిసా బేగం, వేంసూరు మండల సూపర్ వైజర్లు వసంత రాణి, కమల మరియు భవాని పాల్గొన్నారు.

# ఈనెల 25న జూనియర్ వాలీబాల్ జట్ల ఎంపిక

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): ఖమ్మం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం వారి సహకారంతో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బాలురు, బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 9:30 నుంచి కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీంట్లో పాల్గొనే బాలురు, బాలికలు 1/1/2008 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని అన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం ,పదవ తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆరు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరుకావాలని కోరారు. ఈ టోర్నమెంట్ తదుపరి సిరిసిల్లలో 29 /11/ 2025 నుంచి 2/ 12 /2026 వరకు నిర్వహించబడతాయని తెలిపారు.

# ఖమ్మం జిల్లా స్థాయి అండర్ 17 ఖోఖోలో మైనార్టీ గురుకుల విద్యార్థులు



మధిర, నవంబర్20(వుదయం ప్రతినిధి): 69వ ఎస్ జిఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్17 ఖో ఖో విభాగంలో కల్లూరు లో జరిగిన ఉమ్మడి ఖమ్మం స్థాయి లో మధిర మైనార్టీ గురుకుల విద్యార్థులు షేక్ జావేద్, బి.నరసింహ స్టేట్ కి సెలెక్ట్ కావడం జరిగింది. ఈ.హరిచరణ్ స్టాండ్ బై సెలెక్ట్ అయ్యాడు. వీరి ఎంపిక పట్ల మధిర మైనారిటీ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షమీమ్, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ పిఈటీ .అనురాధ, పీడీ కె.సైదులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# రైస్ మిల్లు ప్రారంభోత్సవానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆహ్వానం



మధిర నవంబర్20,(వుదయం ప్రతినిధి): ముదిగొండ మండలం వనం వారి కృష్ణాపురం గ్రామంలో లంకెల మోహన్ రెడ్డి, పొట్లూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర మోడరన్ రైస్ మిల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులను గురువారం లంకెల మోహన్ రెడ్డి దంపతులు, పొట్లూరి శ్రీనివాస్ రెడ్డి దంపతులు హైదరాబాదులోని ప్రజా భవన్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అనంతరం డిప్యూటీ సీఎం దంపతులకు పట్టు వస్త్రాలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధిర సాక్షి ఆర్సీ ఇన్చార్జి అట్లూరి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

# విలీన గ్రామాల కార్మికులకు వేతనం పెంచాలంటూ కమిషనర్ కు లేఖ

♦ బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు



వేతనాలు పెంచాలంటూ కమిషనర్ కు లేక అందజేసిన బి ఆర్ టి యు నాయకులు

నర్సంపేట నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): నర్సంపేట పురపాలక సంఘం పరిధిలో విలీనం అయిన గ్రామాలలో పనిచేస్తున్న సిబ్బందికి నర్సంపేట పురపాలక సంఘంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చే వేతనం ఇవ్వాలని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు అన్నారు. తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బిఆర్టియు అనుబంధం) సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ భాస్కర్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ పురపాలక సంఘంలో విలీనమైన 8 గ్రామాలు మహేశ్వరం, రాముల్ నాయక్ తండ, పర్ష నాయక్ తండ, తండ, నాగుర్లపల్లి , మాదన్నపేట, ముగ్ధంపురం, రాజ పల్లె, ముతోజిపేట గ్రామాల నుండి 34 మంది సిబ్బంది కారోబార్లు, పంపు ఆపరేటర్లు, స్వీపర్లు తదితర విభాగాలలో పని చేస్తున్న కార్మికులను నర్సంపేట పురపాలక సంఘంలో విలీనం చేసుకొని పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారు. అయినా వారికి గ్రామపంచాయతీలో పనిచేస్తున్నప్పుడు ఇచ్చే 9500 వేతనమే ఇస్తున్నారని కాంట్రాక్టు లేబర్ కు ఇచ్చే 16600 ఇవ్వటం లేదని అన్నారు. కాంట్రాక్టు కార్మికులతో సమానంగా పనిచేసినప్పుడు వీరికి ఎందుకు సమాన వేతనం ఇవ్వరని ప్రశ్నించారు. దీనిపై యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సి డి ఎం ఏ కు మరియు జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులకు కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు గడ్డం సమ్మయ్య ,కార్మికులు పరశురాములు మహేందర్ శ్రీశైలం, శ్రీనివాస్, కృష్ణ ,యాకూబ్ ,రమేష్ వీరన్న, నాగరాజు. తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు చూస్తే రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మే పరిస్థితిలో లేరు


- కొనుగోలు కేంద్రాల్లో పేరుకపోయిన ధాన్యం రాశులు.
- సబ్ మార్కెట్ యార్డ్ ఆవరణలో ధాన్యం పోసి 10 రోజులు కావస్తుంది.
- మండల రైతుల ఆవేదన.



ఖానాపురం, నవంబర్ 20 (వుదయం ప్రతినిధి):ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వ్యవసాయ శాఖ నిబంధనలు చూస్తే రైతులు పండించిన వరి ధాన్యమును కొనుగోలు కేంద్రాల్లో అమ్మే పరిస్థితి లేదని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు పేరుకపోయాయి. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యాడ్ ఆవరణలో వరి ధాన్యం పోసి 10 రోజులు కావస్తున్న నేటి వరకు కాంటాలు పెట్టిన దాఖలాల లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ పరిధిలోని ఈ నెల 10న సబ్ మార్కెట్ యార్డ్ ఆవరణతో పాటు పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన, నేటి వరకు కాంటాలు ప్రారంభించిన దాఖలాలు లేవని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి భోగ శ్రీనివాస్ ను సంప్రదించగా వ్యవసాయ శాఖ నిబంధన మేరకు రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోని వరి ధాన్యమును పోసిన రైతులు ధాన్యంను తూర్పాల పోసి చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకున్న తర్వాతనే అట్టి ధాన్యమును ఆయా సెంటర్ల వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు టోకెన్లు ఇస్తారని ఏవో మండల రైతులకు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల నిబంధనలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దాన్యం అమ్ముకునే రైతులు పాటించవలసినవి ఈ విధంగా ఉన్నాయి. 1) మట్టి పెల్లలు రా

# ఘనంగా కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని జన్మదిన వేడుకలు....

జనాకర్షణ నాయకునికి వెల్లువిరిసిన జన్మ దిన శుభాకాంక్షలు.....
సాదా...సీదా నడవడిక.... వెనుకకు అడిగేయాని నైజం... మాట ఇస్తే ఎంతటి త్యాగానికి ఐనా సిద్ధం మయ్యే జనం మెచ్చిన నాయకుడు ఎర్నేని.....
సినిమా హాల్ బాబు గా జనం లో అభిమానం.....
పేదల పెన్నిధి గా ప్రజా సేవా కే జీవితం అంకితం చేసిన నాయకునికి అభినందనలు.....
దేవాలయం లో పూజలు.... ఎర్నేని యువ సేన సేవా కార్యక్రమాలు.....
కేక్ కట్ చేసి అభినందనలు అందుకున్న ఎర్నేని......



కోదాడ నవంబర్ 20(వుదయం) : కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకట్ రత్నం బాబు జన్మ దిన వేడుకలు గురు వారా కోదాడ పట్టణం లోని ఆయన నివాసం లో ఎర్నేని యువ సేన, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యువ సేన ఆధ్వర్యం లో దేవాలయం లో పూజలు నిర్వహించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కటింగ్ వేడుకల్లో భారీగా పాల్గొని పూల మాలలు బొకే లతో ఎర్నేని కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 5దశాబ్దాలు గా రాజకీయాల్లో ఉంటూ కోదాడ పట్టణ అభివృద్ధి కి బాబు చేసిన కృషి నీ కొనియాడారు. సర్పంచ్ గా, మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటు పార్టీ లో పలు పదవులు చేపట్టి తన దైన శైలి లో పద వులు నిర్వహించి పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. సినిమా హాల్ బాబు గా జనం లో ఆయన కు ఎంతో అభిమానం ఉందని కోదాడ పట్టానికేకే కాక నియోజక వర్గంలో వ్యాప్తంగా పేరుపొందిన నాయకుడు బాబు అన్నారు. సాదా సీదాగా ఉంటూ , పట్టువదలనీ నైజం, మాట ఇస్తే తప్పకుండా , సహాయం చేసి ప్రజల అభిమానం పొందారని కొనియాడారు. ఎప్పుడు జనంతో మమేకమై జనం మనిషి గా ఉన్న బాబు నిండు నూరేళ్ళు ఆయుర్ ఆరోగ్య లతో ఉండాలని ఆకాక్షించారు. పేదల పెన్నిధి గా, రైతు గా ఎర్నేని వ్యక్తిత్వం ను కొనియాడారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వుదయం కథనానికి స్పందన

.. నిర్మాణ పనులను అడ్డుకున్న ఎంపీడీఓ, ఎంపీఓ





ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని ఆపాలని గ్రామస్తుల పిర్యాదు

నిజాంసాగర్, నవంబర్ 20(వుదయం ప్రతినిధి): నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో మెంగారం లక్ష్మీ శ్రీనివాస్ దంపతులు గ్రామ కంఠం భూమిని ఆక్రమిస్తున్నారని స్థానిక ఎంపీడీఓ శివకృష్ణకు గత రెండు రోజుల క్రీతం వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని వుదయం దినపత్రికలో వార్తను ప్రముకంగా ప్రచురించడం జరిగింది. దీంతో స్పందించిన మండలస్థాయి అధికారులు గురువారం మాగి గ్రామానికి చేరుకుని గ్రామస్థుల సమక్షంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. దంపతులు మెంగారం లక్ష్మీ శ్రీనివాస్‌లు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి గృహ నిర్మాణం చేపడుతున్నారని గుర్తించి వారికి హెచ్చరికలు జారీచేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు పూనుకున్న వారిపై చర్యలు చేపడతామని, తమ విచారణ పూర్తి అయ్యేంత వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఎంపీడీఓ హెచ్చరించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి భారతి తదితరులున్నారు.

# ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా జరగాలి



జన్నారం, నవంబర్ 20(వుదయం విలేకరి) ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా సక్రమంగా చేయాలని మిషన్ భగీరథ ఎస్ఈ రవీందర్ సూచించారు.గురువారం రోజున జన్నారం మండలంలోని బంగారు తండా సోనాపూర్ తండా కలమడుగు గ్రామపంచాయతీలోని గోండుగూడా గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా అందుతున్న నీటి సరఫరాను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాలలో తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదా అని పరిశీలించి తాగునీటి పై ఆయా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తాగు నీటిని దుర్వినియోగం చేయకుండా ప్రతి ఒక్కరూ నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేష్, ఏఈఈ నందన్ వర్మ పాల్గొన్నారు.

# విద్యార్థినీని అభినందించిన డీఈవో



మహబూబ్ నగర్ నవంబర్ 20(వుదయం ప్రతినిధి) హైదరాబాద్ లో ఈనెల 16వ తేదీన జరిగిన ప్రెసిడెంట్ కఫ్ ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ లో కటాస్ లో మెరుగైన ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థి హఫ్సా బేగంను డీఈఐఓ కౌసర్ జహాన్ అభినందించారు. గురువారం కళాశాల ఆవరణలో విద్యార్థినికి శాలువాతో సత్కరించారు. ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ లో బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

బాలికలు ఆత్మ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తీసుకోవాలని కోరారు. విద్యార్థినికి కరాటే శిక్షణ అందజేస్తున్న కింగ్ షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్ పాష ఖాద్రీని అభినందించారు.

# డయల్ యువర్ డిఎం నేడే



భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 20 (వుదయం ప్రతినిధి )ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం డిపోల వారీగా ప్రతినెల డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శనివారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. ఆర్టీసీ శ్రేయోభిలాషులు, విద్యార్థిని విద్యార్థులు ,వ్యాపార వర్గాలు మరియు అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సంప్రదించవలసిన నెంబర్ 9959225959

# మండలాల ఎంపీడీఓలు మున్సిపల్ కమీషనర్ లతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వేగవంతముగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు.



గద్వాల నవంబర్ 20 (వుదయం ప్రతినిధి)గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు పనుల పురోగతిపై కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో అన్ని మండలాల ఎంపీడీఓలు మున్సిపల్ కమీషనర్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారిగా పనుల పురోగతిని అడిగి తెలుసుకొని వంద శాతం ఇంటి నిర్మాణ పనుల లక్ష్యాలను చేరుకోవాలని, ప్రత్యేక చొరవ తీసుకుని వివిధ దశలలో ఉన్న వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ఇసుక అందుబాటులో వచ్చినందున పనులను వేగవంతం చేసి జిల్లాను రాష్ట్ర స్థాయిలో టాప్ టెన్ లో నిలుపాలన్నారు. గద్వాల నియోజకవర్గంలో కొత్తగా 300 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ అందించడం జరిగిందని, గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో రాకముందే మార్కెట్ పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మంజూరు అయి నిర్మాణాలకు ఆసక్తి చూపని 1197 మంది గృహాల స్థానంలో కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతిపాదనలు అందజేస్తే అమోదించడం జరుగుతుందన్నారు. ఇట్టి పనులు అన్నింటిని సోమవారం వరకు పూర్తి చేయాలన్నారు. పురోగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రావు, డిపిఓ నాగేంద్రం, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమీషనర్లు, ఏపీవో లు తదితరులు పాల్గొన్నారు

# మధుర స్మృతుల బాల్యం మరపులేనిది.

ప్రతి ఒక్కరి జీవితంలో బాల్య దశ మరపురాని మధురస్మృతులతో సంతోషాన్ని కలిగిస్తుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.



గద్వాల నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు వేడుకలు గురువారం గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ చదువుకోవడం బాలల హక్కు అని, బడి మానేసిన పిల్లలందరినీ పాఠశాలలో చదువుకునేలా విద్యార్థులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రపంచంలో నేడు చాలా చోట్ల కొంతమంది చిన్న పిల్లలు రకరకాల వేధింపులకు గురవుతున్నారని, బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న మొదట తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. చిన్నపిల్లల నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉందని, ఎలాంటి కల్మషం లేకుండా నిస్వార్థంగా జీవించే వాళ్ళు ఎప్పటికీ సంతోషంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, కళా ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, జిల్లా ప్రొబిషన్ అధికారి పరుశురాం, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సహదేవుడు, సభ్యురాలు శైలజ, జువైనల్ జస్టిస్ బోర్డ్ సభ్యురాలు గ్రేసీ, డిసిపిఓ నరసింహా, తదితరులు పాల్గొన్నారు

# సాదారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

-జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
-వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం



హనుమకొండ, నవంబర్ 20 (వుదయం జిల్లా ప్రతినిధి) : ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను పెంచాలని, సిజెరియన్లను తగ్గించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును డీఎంహెచ్ వో డాక్టర్ అప్పయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ 12వారాలలోపు ప్రతి గర్భిణీ వివరాలను ఏఎన్ఎం లు నమోదు చేయాలన్నారు. గర్భిణీలకు తప్పనిసరిగా నాలుగుసార్లు చెకప్ కు వచ్చేలా ఏఎన్ఎంలు, ఆశా లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు ఎక్కువగా జరిగేవిధంగా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు పెరగాలన్నారు. పరకాలలో ప్రతి నెలా కనీసం 50 ప్రసవాలు, కమలాపూర్ లో 15 ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీల నమోదు ,వారి చెకప్ లు తక్కువ నమెదు తక్కువ గా ఉన్న పీహెచ్సీ ల వైద్యాధికారులను అందుకు కారణాలు అడిగి తెలుసుకుని వాటిని అధిగమించి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో 1,98,000 టీబీ వచ్చే అవకాశం ఉన్న ఎనిమిది రకముల ప్రజలకు గాను కు గాను 1,17,000 స్క్రీనింగ్ చేయడంతో పాటు 432 పోషణ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలుపగా వీలైనంత త్వరగా అందర్నీ స్క్రీనింగ్ చేసి ఎక్స్రే పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ప్రసూతిఆస్పత్రి, పరకాల,కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాలు , పి హెచ్ సి లు సమన్వయం తో పనిచేయాలన్నారు. సిజేరియన్ ఆపరేషన్ లు ఎక్కువగా అవుతున్న ఆసుపత్రిల లో సీ సెక్షన్ ఆడిట్ నిర్వహించాలన్నారు. పోషణ లోపం ఉన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించివారికి అవసరమైనచికిత్స అందించడంతోపాటు తల్లిదండ్రులకు పోషకాహారం సంబంధించిన సూచనలు తెలియజేయాలన్నారు ఈ సమావేశంలో హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, అదనపు డీఎంహెచ్ వో డాక్టర్ మదన్ మోహన్ రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, టీబీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్తేదార్ అహ్మద్, మంజుల, డెమో అశోక్ రెడ్డి, పీహెచ్సీ ల వైద్యాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలు స్వాధీనం నిందితుడు అరెస్ట్



ఆసిఫాబాద్, నవంబర్ 20, (వుదయం ప్రతినిధి)కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరి మండలంలోని శివగూడ గ్రామం, బాబేఝరి గ్రామపంచాయతి పరిధిలో నిషేధిత గంజాయి సాగు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో, జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ , ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్ ల ఆదేశాల మేరకు, కెరిమెరి ఎస్సై మధుకర్ తన సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు.దీనిలో భాగంగా టెకం రాజు శివగూడ గ్రామ నివాసి వద్ద 14 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన మొక్కల అంచనా విలువ సుమారు రూ. లక్ష నలభై వేలు ఉంటుందన్నారు.ఈ ఘటనపై నిందితుడిపై సంబంధిత చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేసినట్లు కెరిమెరి ఎస్సై మధుకర్ తెలిపారు.జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని ఎస్సై మధుకర్ హెచ్చరించారు.

## డాక్టర్ సంపత్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు..సంకాపురం రాముడు



అలంపూర్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి)గురువారం రోజు హైదరాబాద్ లోని వారి నివాసం నందు అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసిసి కార్యదర్శి,చత్తీస్ గడ్ ఇంచార్జ్ శ్రీ డా.ఎస్.ఎ.సంపత్ కుమార్ కి కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిజ మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సంకాపురం రాముడు పుష్పగుచ్ఛం అందజేసి మా ప్రియమైన మాజీ శాసనసభ్యులకు జన్మదిన శుభాకాంక్షలు! మీరు ప్రజా సేవలో చూపించే అంకితభావం నిజంగా ప్రశంసనీయం ఈ రోజు మీకు సంతోషాన్ని,ఆనందాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను ఈ పుట్టినరోజు మీకు అద్భుతమైన ఆరోగ్యం,ఆనందం శాంతిని తీసుకురావాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో మీ అన్ని లక్ష్యాలు నెరవేరాలని ఆశిస్తున్నాము మీ నాయకత్వం మాకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం మీ పుట్టినరోజు సందర్భంగా మీరు మరింత బలం, జ్ఞానం సంతోషంతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను మన ప్రాంత అభివృద్ధికి మీరు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు. మీరు మరిన్ని సంవత్సరాలు ఇలాగే ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటూ మరోసారి పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈ జన్మదిన దినోత్సవంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి, చిన్న తాండ్ర పాడు స్టార్ అధినేత వినోద్ కుమార్ కె కె నాగరాజు గోపాల్ కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకం పేర గోల్ మాల్.. ప్రజలను మోసం చేస్తున్న అధికారులు



(గద్వాల నవంబర్ 20 వుదయం ప్రతినిధి) గద్వాల ద్విచక్రవర్గంలోని కేటి దొడ్డి మండ లము కొండాపురం గ్రామానికి చెందిన గాజుల కృష్ణా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 2023లో జరిగిన ఎన్నికల మేనిఫెస్టోలో గృహజ్యోతి పేరుతో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ గృహస్తునకి ఉచితంగా 200 వందల యూనిట్ల కరెంటును అందిస్తామని, గృహజ్యోతి పథకం పేరు 2024 మార్చి 1 నుంచి అమలులోకి తెచ్చిన ప్రభుత్వం నేడు గృహజ్యోతి పథకంహామీ కేవలం కాగితాలకే పరిమితమైందని సామాన్య ప్రజలతో ముక్కు పిండి వసూలు చేస్తున్నారని చెప్పడం జరిగింది. ఉచిత విద్యుత్ వాగ్దానం గంగలో తొక్కేసి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని,ప్రజా పాలన అప్లి కేషన్లలో డేటా ఎంట్రీ లో ఆధార్-కస్టమర్ ఐడి లింకులను తప్పుడు ఏంట్రీ చేసేది వారే ఇలా ప్రజలపై భారం మోపేది వారే చివరకు ఓట్లు వేసి మోసపోయేది మాత్రం మాలాంటి సామాన్య ప్రజలకు తప్ప గృహ జ్యోతికి సంబంధిం చిన సమస్యలు తీరడం లేదని మండల అధికారులు పట్టించుకోక పోవడం అర్హులైన సామాన్య ప్రజలకు మాత్రం అధికారులు ముందుండి జేబులను ఖాళీ చేయిస్తు టారు.ఈ సమస్యల నుండి అధికారులు స్పందించి కేటి దొడ్డి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు విద్యుత్ శాఖ అధికారులు కలెక్టర్ స్పందించి ఉచిత కరెంటు అందే విధంగా చూడాలని పత్రికా ముఖంగా కోరడమైనది.

## జూదం కార్యకలాపాలపై కఠిన చర్యలు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్




ఆసిఫాబాద్, నవంబర్ 20, (వుదయం ప్రతినిధి)కొమురం భీ ఆసిఫాబాద్ జిల్లాలో జూద కార్యకలాపాలపై కఠిన చర్యలకు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం రోజు సాయంత్రం ప్రత్యేక దాడులు నిర్వహించారు.ఆసిఫాబాద్ మండలం గూడెంఘాట్, తుంబపల్లి గ్రామంలో అక్రమంగా పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి మొత్తంగా రూ. 9,600/- నగదు, 52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితులను మరియు స్వాధీనం చేసుకున్న వస్తువులను ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.పట్టుబడ్డ వ్యక్తులు:బోయిని భీమయ్య, కొమ్మ మల్లేశ్, పోలగాని కుమార్ వీరు గూడెంఘాట్, తుంబపల్లి కి చెందిన వారు.తప్పించుకున్న వ్యక్తి:పోలగాని సంతోష్,గూడెం ఘాట్, తుంబపల్లి.జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ"జిల్లాలో అక్రమ జూద కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము. ఇలాంటి అక్రమ కార్యకలాపాలలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం కొనసాగుతుంది. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని" అన్నారు.ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఎస్.ఐ రాజు కందూరి, హోంగార్డ్ శేఖర్, స్పెషల్ పార్టీ పోలీస్ కానిస్టేబుల్స్ రాజ్‌కుమార్, కళ్యాణ్, మోసిన్ లు పాల్గొన్నారు.

## జన్నారం పట్టణాన్ని అభివృద్ధి చేయాలి




జన్నారం, నవంబర్ 20(వుదయం విలేకరి) జన్నారం పట్టణాన్ని అభివృద్ధిపరచాలంటూ మండల మున్నూరు కాపు సంఘ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను కోరారు. గురువారం రోజున వారు ఉట్నూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిసి జన్నారం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్,రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం వెంటనే చేపట్టి జన్నారం మండలాన్ని అభివృద్ధి చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. అలాగే మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు లెక్కల మల్లయ్య,సంఘ నాయకులు నాసాని శ్రీనివాస్, అనుముల శ్రీనివాస్, కస్తూరి భూమన్న, బొడ్డు రాజన్న, భూతం శ్రీనివాస్, పూదరి నరసయ్య, అప్పాల జలపతి, పూదరి చంద్రమోహన్ లు ఉన్నారు.

### ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ ల పంపిణీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి

గద్వాల నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇన్చార్జ్ డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కిరణ్మయి చేతుల మీదుగా గురువారం ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా లో మొత్తం 604 మంది ఆశా కార్యకర్తలకు 1212 చీరలు, ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ ద్వారా, వారి వారి పీహెచ్సీల యందు త్వరలో ఆశల అందరికీ యూనిఫామ్ అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసూనారాణి, డిప్యూటీ డెమో మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎన్సిడి కోఆర్డినేటర్ శ్యాంసుందర్, రామాంజనేయులు డిడిఎం గద్వాల అర్బన్ హెల్త్ సెంటర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రయివేట్ స్కూల్ టీచర్ నిర్వాకం.. 3 ఏళ్ళ బాలుడికి గాయాలు





అలంపూర్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం జూలకల్లు గ్రామంలో ప్రైవేటు పాఠశాలలో ఓ టీచరు తాను అడిగిన ప్రశ్నకు జవాబు ఇవ్వలేదని ఓ టీచరు 3వ క్లాస్ బాలుడిని మోకాళ్లపై నడిపించింది. హృదయ విషాదకర ఈ ఘటన వడ్డేపల్లి మండలం జూలకల్ గ్రామంలో జరిగింది. కొంకలకు చెందిన టీజీ ఉదయ్ కుమార్ జూలకల్లు గ్రామంలోని శారద విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. అడిగిన ప్రశ్నకు జవాబివ్వలేదని మంగళవారం మండే ఇసుకలో నడిపించడంతో గాయాలయ్యాయి. బుధవారం తండ్రి రంగన్న ఫిర్యాదుతో విచారణ చేపట్టినట్లు ఎంఈఓ నరసింహ తెలిపారు.

### ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ లో గద్వాల విద్యార్థుల ప్రతిభ



గద్వాల నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2025లో గద్వాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్ లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17, 18, 19న నిర్వహించిన తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2025 పోటీల్లో వుషు యుద్ధ కళల పోటీలలో గద్వాల జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలోని కేటగిరి 2 లో సిద్రతుల్ ముంతహా 2 సిల్వర్, అబ్రాజ్ 1 గోల్డ్, 1 సిల్వర్, ఉమర్ 2 గోల్డ్ బహుమతులు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా సబ్ జూనియర్ అండర్ 12లోని సండ (ఫైట్) విభాగంలో యాహ్యా అలీ ఖాన్ 1, సబ్ జూనియర్ అండర్ 14 లో మహమ్మద్ సాద్ (బ్రాంజ్), హసనుద్దీన్, ఎండి ఉమర్ (సిల్వర్), ఎండి సాద్ (గోల్డ్) పథకాలు సాధించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

### పొనకల్ సహకార సంఘానికి ఉత్తమ అవార్డు



జన్నారం, నవంబర్ 20(వుదయం విలేకరి) జన్నారం మండలంలోని పొనకల్ సహకార సంఘానికి ఉత్తమ అవార్డు లభించింది. 72వ ఆలిండియా కో-ఆపరేటివ్ సహకార వారోత్సవాలు పురస్కరించుకొని హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో పొనకల్ సహకార సంఘానికి రాష్ట్రస్థాయి అవార్డు లభించింది.దీంతో పాక్స్ చైర్మన్ అల్లం రవి, సీ ఈ ఓ కావటి రాజన్న లు తెలంగాణ సహకార సంఘం యూనియన్ డి సి ఓ సంజీవరెడ్డి,డిసిసిబి చైర్మన్ భూక్యా వెంకన్న,ఎండి అన్నపూర్ణ చేతుల మీదుగా ఉత్తమ పురస్కార అవార్డును అందజేశారు.

## యాస్పిరేషన్ బ్లాక్ ప్రగతి పై సమీక్షించిన నీతి అయోగ్ సీఈఓ




నారాయణపేట నవంబర్ 20(వుదయం ప్రతినిధి)నారాయణపేట జిల్లాలోని యాస్పిరేషన్ బ్లాక్ పరిధిలోని నర్వ మండలంలో సూచించబడిన వివిధ విభాగాల ప్రగతి పై గురువారం నీతి అయోగ్ సీ ఈ ఓ సుబ్రహ్మణ్యం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. నీతి అయోగ్ సీఈఓ అధ్యక్షతన జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి రోహిత్ కుమార్ హాజరు కాగా, నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 47వ కార్యదర్శుల సాధికార కమిటీ సమావేశం నర్వ బ్లాక్ ఇన్నోవేషన్ క్యాటగిరి ప్రాజెక్ట్ ప్రతిపాదనల గురించి వీసీ లో చర్చించారు. వీసీ ద్వారా జరిగిన ఈ సమావేశంలో నర్వ బ్లాక్ లో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, ఉద్యానవన, పశువైద్య విభాగాలలో 12 ప్రతిపాదనలను సమర్పించగా, విద్యా రంగం నుంచి 2 ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. అందులో స్పార్క్- స్కూల్ ప్రోగ్రామ్ ఫర్ ఏ ఐ రెడినెస్, నాలెడ్జ్ (ప్రాథమిక పాఠశాలల్లో ఏ ఎక్స్ ఎల్ డిజిటల్ ల్యాబ్‌ల స్థాపన),శ్రీ పునరుత్పాదక, పర్యావరణ అనుకూల ఆహారం కోసం సోలార్ (నర్వ కేజీబీవీ లో సౌరశక్తితో పనిచేసే వంటగది) కోసం మొత్తం రూ.1.2 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రాజెక్ట్ పూర్తి వివరాలను వెల్లడించారు. వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, యాస్పిరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ పాల్గొన్నారు.

## వీరాపూర్ లో అట్టహాసంగా గృహప్రవేశాలు



కరీంనగర్, నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గురువారం అట్టహాసంగా గృహ ప్రవేశాలు చేశారు. ఈ కార్యక్రమాలకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి పథకం కింద వీరాపూర్ ను పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని, అందులో భాగంగానే సొంత ఇల్లు లేని నిరుపేదలకు వందశాతం గృహాలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం నలుగురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహాల్లో సుఖశాంతులతో ఆనందకరమైన జీవితం గడపాలని, అన్ని శుభాలే చేకూరలని ఎమ్మెల్యే అభిలషించారు."సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ" బెజ్జంకి మండలానికి 21విడుతలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. గురువారం వీరాపూర్ గ్రామాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు బైర సంతోష్, పులి సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు



ధర్మపురి నవంబర్ 20 (వుదయం విలేకరి): పట్టణంలో గురువారం బోయవాడలో లయన్స్ క్లబ్ లయన్ చుక్క. భీంరాజ్ ఆధ్వర్యంలో డయబెటిక్ స్క్రినింగ్ (షుగర్) టెస్ట్ క్యాంపు నిర్వహించగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని షుగర్ పరీక్షలు చేయించుకున్నారు.ఈ క్యాంపుకు సహకరించిన లయన్ డా.రామ కృష్ణ, లయన్, డా.శ్రీనివాస్, అధ్యక్షులు రవి, సెక్రటరీ సర్జరావ్ ట్రెసరర్ శ్రీనివాస్, జి. శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, హరినాథ్ లకు బోయవాడ వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో పూజారికి గాయాలు



జన్నారం, నవంబర్ 20 (వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని పైడిపల్లి హనుమాన్ గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రంలోని కేతేశ్వర కంకాలమ్మ ఆలయ పూజారి రేగుంట భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ఆలయ పూజారి భూమయ్య రోజులాగే మండల కేంద్రంలోని కంకాలమ్మ ఆలయంలో పూజలు చేసి స్వగ్రామమైన లక్షెట్టిపేటకు గురువారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు తన మెడలో ఉన్న టవల్ ద్విచక్ర వాహన టైరులో ఇరుక్కోవడంతో ఒక్కసారిగా ఆయన కింద పడిపోయాడు.దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం అయింది.స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో పూజారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## శక్తి పీఠం సురభి గోశాలలో ఘనంగా కార్తీక దీపోత్సవం



నారాయణపేట నవంబర్ 20(వుదయం ప్రతినిధి)శక్తిపీఠం ఆధ్వర్యంలో కార్తిక అమావాస్యను పురస్కరించుకొని శక్తి పీఠం సురభి గోశాలలో కార్తిక దీపోత్స కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు పూజ,హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ కృష్ణయాజుర్వేద స్మార్త పండితులైన బ్రహ్మశ్రీ ఉట్కూర్ విభావాసు అగ్నిహోత్రి పురోహిత్ చేతులమీదుగా వేదమంత్రాలతో పూజ, హవనాది కార్యక్రమలు నిర్వహించారు. అనంతరం శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా స్వామి శాంతానంద పురోహిత్ విచ్చేసిన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం అందించారు. 7 గంటల నుండి సామూహిక కార్తిక దీపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు స్వామి వారు తీర్థ ప్రసాద ఫలావితరణ ఇచ్చి భక్తులందరికి ఆశీర్వచనములు అందించారు.

## అయిజ సింగిల్ విండో అధ్యక్షుడికి ప్రశంసా పత్రాన్ని అందజేసిన రాష్ట్ర సహకార యూనియన్ కార్యాలయం






అలంపూర్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని తక్కువ సమయంలో అన్ని ప్రమాణాలతో కూడిన అభివృద్ధిని సాధించిన సింగిల్ విండో అధ్యక్షుడు పోతుల మధుసూదన్ రెడ్డిని గురువారం నాడు హైదరాబాదు గన్ ఫౌండ్రిలోని రాష్ట్ర సహకార యూనియన్ కార్యాలయంలో శాలువా జ్ఞాపిక ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండోచైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ 5 సంవత్సరాల క్రితం 6 గురు సిబ్బందితో ఆర్థిక ఇబ్బందుల్లో 4 నెలలకు ఒకసారి జీతాలు తీసుకుంటూ ఉన్న సింగిల్ విండోను మాకార్యదర్శి మల్లేష్ సిబ్బంది ఉమ్మడి కృషి వల్ల అభివృద్ధి సాధ్యమైందన్నారు ప్రస్తుతం 23 మంది సిబ్బందితో ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ సూపర్ మార్కెట్ వ్యాపారాలు అలాగే స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు తక్కువ వడ్డీతో రైతులకు అందజేస్తూ ఈ ఐదు సంవ త్సరాల్లో ఉద్యో గుల జీతభత్యాలు రవాణా హమాలి ఆఫీస్ నిర్వహణ తదితర అన్ని ఖర్చులు పోగా మొత్తం ₹:2 కోట్ల 18 లక్షల రూపాయల నగదు లాభాల్ని ఆర్జించి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అభివృద్ధి చెందిన 15 సొసైటీల్లో ఒకటి గా అయిజ ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం సింగిల్ విండో నిలిచిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు తమ పాలకవర్గం పదవి బాధ్యతలు స్వీకరించే నాటికి ఒక్క కోటి 25 లక్షలు ఇన్ బ్యాలెన్స్ రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము బ్యాంకుకు చెల్లించక పోయిన సొమ్ము) క్లియర్ చేశామన్నారు అలాగే అప్పటికే రెండు కోట్ల 81 లక్షల రూపాయల నష్టాల్లో ఉన్న సొసైటీని ఆనష్టాన్ని ప్రస్తుతం ₹: 25 లక్షల రూపాయలకు తగ్గించామని ఇది తమ పాలకవర్గం మొత్తం సిబ్బంది సమిష్టి కృషి వల్లనే సాధ్యమైందని అందుకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న అన్నారు.


### పాగుంటా శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు





గద్వాల నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) కార్తీక మాసం చివరి రోజు కార్తీక అమావాస్య సందర్భంగా కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్నికి గురువారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు కన్నుల పండువగా స్వామీ వారి కళ్యాణోత్సవంఅమావాస్య సందర్భంగా పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతః కాల పూజలు, అభిషేకం, దీక్షా హోమం, శాంతి హోమం పూర్ణాహుతి, చక్ర స్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అలివేల మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమాని నిర్వహించారు.

### ఉద్యోగుల కరువు భత్యం విడుదల చేయాలి





గద్వాల నవంబర్ 20 (వుదయం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు బకాయి ఉన్న అయిదు విడతల కరువు భత్యాన్ని ప్రభుత్వం వెంటనే అందించాలని పీఆర్టీయు తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి యోగెందర్ లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన మేరకు డిసెంబర్ 9నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవంలో పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్చేశారు. అదే విధంగా పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకొని పీఆర్సీని ప్రకటించాలని, ఉపాధ్యాయుల పాలిట గుదిబండగా మారిన టెట్ నుండి 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినాహయించాలని కోరారు. అలా కాని పక్షంలో మినిమం క్వాలిఫైయింగ్ మార్కులను తగ్గించాలని 35% మార్కులను క్వాలిఫైయింగ్ మార్కులు గా గుర్తించాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

### మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



జన్నారం, నవంబర్ 20(వుదయం విలేకరి) మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇలియాస్ అన్నారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులుగా ఎండి ఇలియాస్ నియామకం అయ్యారు.ఈ సందర్భంగా గురువారం రోజున మంచిర్యాలలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ వచ్చేది బీసీల రాజ్యమే అని అన్నారు.నాపై నమ్మకంతో ఈ పదవిని అప్పజెప్పినందుకు తీన్మార్ మల్లన్న, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ కొమ్ముల ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# బిజినెస్



## దేశంలోనే తెలంగాణకు రెండో స్థానం.. లేటెస్ట్ డేటా రిలీజ్

హైదరాబాద్ సహా పలు కీలక నగరాలు రాష్ట్రాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నాయి. తాజాగా ఓ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. త్రీ-వీలర్ వెహికల్స్ విక్రయాల్లో తెలంగాణ ఈ ఘనత సాధించింది. పరిశ్రమల సమాఖ్యా సియామ్ తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం త్రీ-వీలర్ కేటగిరీలో అత్యధికవిక్రయాలు జరిపిన రెండో రాష్ట్రంగా నిలిచింది. ఇక మొత్తంగా చూసుకుంటే ప్యాసింజర్ వెహికల్స్, కమెర్షియల్ వెహికల్స్ సేల్స్ లో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లోని జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రయాణికుల, వాణిజ్య వాహనాల విక్రయాల డేటాను సియామ్ విడుదల చేసింది. ఈ రెండు కేటగిరీల్లోనూ మహారాష్ట్ర అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. రెండో త్రైమాసికంలో దేశం మొత్తం 10.39 లక్షల ప్రయాణికుల వాహనాలు విక్రయమయ్యాయి. ఇందులో పశ్చిమ రాష్ట్రాల్లో 3.44 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ తెలిపింది. ప్రయాణికుల వాహనాల కేటగిరీ సేల్స్ పరిశీలిస్తే మహారాష్ట్ర 1,31,822 యూనిట్లతో (12.7 శాతం మార్కెట్ వాటా) అగ్రస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉత్తర్ ప్రదేశ్ 1,00,481 యూనిట్లు (9.7 శాతం వాటా), మూడో స్థానంలో గుజరాత్ 87,901 యూనిట్లు (8.5 శాతం), కర్ణాటక 76,422 యూనిట్లతో నాలుగో స్థానం, కేరళ 69,609 యూనిట్లతో ఐదో స్థానంలో ఉన్నాయి. వాణిజ్య వాహనాల విషయానికి వస్తే 2.40 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. అందులో మహారాష్ట్ర 37,091 యూనిట్లతో అగ్రస్థానంలో ఉంది. 22,491 యూనిట్లతో గుజరాత్ రెండో స్థానం, 19,009 యూనిట్లతో ఉత్తర్ ప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. నాలుగో స్థానంలో తమిళనాడు (18,508), ఐదో స్థానంలో కర్ణాటక (16,743) నిలిచాయి. ఇక బైకులు, స్కూటీల వంటి టూ-వీలర్ సెగ్మెంట్‌కి వస్తే మొత్తం 55.62 లక్షల యూనిట్లు విక్రయమయ్యాయి. ఈ కేటగిరీలో మాత్రం 6,92,869 యూనిట్లతో ఉత్తర్ ప్రదేశ్ తొలి స్థానంలో నిలిచింది. 6,29,131 యూనిట్లతో మహారాష్ట్ర రెండో స్థానానికి పరిమితమైంది. మూడో స్థానంలో గుజరాత్ 4,45,722 యూనిట్లుతో నిలిచింది. ఇక సెప్టెంబర్ త్రైమాసికంలో ఆటో రిక్షాల వంటి త్రీ-వీలర్ వాహనాల సేల్స్ విషయానికి వస్తే దేశవ్యాప్తంగా మొత్తం 2.29 లక్షల వాహనాలు విక్రయమయ్యాయి. ఇందులో దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికంగా 77,000 యూనిట్లు సేల్ అవడం గమనార్హం.



## ఆడ పిల్లల పేరుపై రూ.3.25 లక్షల కోట్లు జమ

ఆడ పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సుకన్య సమృద్ధి యోజన పథకంపై ప్రధాన



మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దేశవ్యాప్తంగా పదేళ్ల లోపు వయసు గల ఆడ పిల్లల పేరుపై 4 కోట్లకు పైగా సుకన్య యోజన ఖాతాలు తెరిచారని, వాటిల్లో ఇప్పటి వరకు రూ.3.25 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు చేసినట్లు వెల్లడించారు.భారతీయ సంప్రదాయంలో ఆవులను జీవితం, శ్రేయస్సు, కరుణకు చిహ్నంగా పరిగణిస్తారని అన్నారు. ఎందుకంటే అవి ఈ కుటుంబాల ఆర్థిక, పోషక, సామాజిక శ్రేయస్సుకు సహాయ పడతాయన్నారు. 'పదేళ్ల క్రితం ఆడ పిల్లలకు ఆర్థిక భరోసా కల్పించడం, విద్య కోసం కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన ప్రారంభించింది. ఈ స్కీమ్ ద్వారా మన కుమార్తెలకు అత్యధికంగా 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. ఇప్పటి వరకు సుకన్య సమృద్ధి యోజన కింద 4 కోట్లకు పైగా ఖాతాలు తెరిచారు. ఆయా బ్యాంకు అకౌంట్లలో 3.25 లక్షల కోట్లకుపైగా రూపాయలు జమ చేశారని తెలిస్తే మీరు చాలా సంతోషపడతారు.' అని ప్రధాని మోదీ అన్నారు. ఆధ్యాత్మిక గురువు శ్రీ సత్య సాయి బాబాకు ప్రధాని మోదీ నివాళులర్పించారు.ఆయన బోధనలు, సేవలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది అనుచరులకు మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా గురువు జ్ఞాపకార్థం రూ.100 నాణెం, పలు స్టాంపులను కూడా పీఎం మోదీ విడుదల చేశారు. పది సంవత్సరాల ఆడ పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని లాంచ్ చేసింది. అమ్మాయిల ఉన్నత చదువులు, పెళ్లి ఖర్చులు తల్లిదండ్రులకు భారం కాకుండా ఈ స్కీమ్ ద్వారా మంచి వడ్డీ రేటు కల్పిస్తున్నారు. ఇందులో కనీస పెట్టుబడి రూ.250 ఉండగా గరిష్ఠంగా ఏడాదికి రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేయవచ్చు. 21 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. ఈ స్కీమ్ ద్వారా ట్యాక్స్ బెనిఫిట్స్, అత్యధిక వడ్డీ, పాక్షిక విత్ డ్రా వంటివి లభిస్తాయి. పాప తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఒక పాప పేరుపై ఒకే అకౌంట్ ఉండాలి. పోస్టాఫీసు లేదా బ్యాంకుల్లో అకౌంట్ తీసుకోవచ్చు. 15 సంవత్సరాల పాటు ఇందులో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. 21 సంవత్సరాల తర్వాత మెచ్యూరిటీ అవుతుంది. పాప 10వ తరగతి తర్వాత లేదా 18 ఏళ్ల వయసు దాటిన ఉన్నత విద్య కోసం 50 శాతం వరకు విత్ డ్రా చేసుకోవచ్చు. ఒక వేళ 18 ఏళ్ల తర్వాత పెళ్లి చేస్తే అకౌంట్ క్లోజ్ చేసి మొత్తం డబ్బులు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఇందులో 8.20 శాతం వడ్డీ లభిస్తోంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ రేట్లను కేంద్రం సమీక్షిస్తుంది.

## అనిల్ అంబానీకి మరో భారీ షాక్..



ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌నకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో గట్టి షాక్ ఇచ్చింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, తాజాగా రూ.1400 కోట్ల విలువైన ఆస్తులను ప్రొవిజనల్ గా అటాచ్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.9000 కోట్లకు చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈడీ తాజాగా జప్తు చేసిన ఆస్తులు నవీ ముంబై, చెన్నై, పూణె, భువనేశ్వర్‌లలో ఉన్నట్లు సమాచారం. అనిల్ అంబానీ నేతృత్వంలోని కంపెనీలలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఈడీ కొంత కాలంగా విచారణ జరుపుతోంది. ఈ దర్యాప్తులో భాగంగానే తాజా చర్యలు తీసుకున్నారు. ఇదే కేసులో గతంలో ఈడీ సుమారు రూ.7500 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసి న విషయం తెలిసిందే. ఇప్పుడు అదనంగా మరో రూ.1400 కోట్ల ఆస్తులను జప్తు చేయడంతో దర్యాప్తు మరింత ముమ్మరమైనట్లు స్పష్టమవుతోంది. ఈ కేసులో విచారణ ఇంకా కొనసాగుతోందని, జప్తు చేసిన ఆస్తుల స్వరూపం, అక్రమ లావాదేవీలతో వాటికున్న సంబంధాలపై త్వరలో మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉందని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి.

## ఈసారి రెపో రేటులో 25 బేసిస్ పాయింట్ల కోత ఉండొచ్చు



వచ్చే నెలలో జరగబోయే భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఎంపీసీ సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ప్రముఖ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది.ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. కాబట్టి ఆర్‌బీఐ డిసెంబర్‌లో జరిగే సమావేశంలో కీలక రేట్లను తగ్గించే అవకాశం ఉంది. ఫలితంగా ఆర్‌బీఐ నుంచి బ్యాంకులు తీసుకునే రెపో రేటు 5.25 శాతానికి దిగి వస్తుంది. ఈ నిర్ణయం తర్వాత ఆర్‌బీఐ అప్రమత్త వైఖరిని అనుసరించవచ్చని మోర్గాన్ స్టాన్లీ అభిప్రాయపడింది. తర్వాత మళ్లీ కీలక రేట్లలో కోత నిర్ణయంపై తొందరపడకపోవచ్చు. కానీ, తదుపరి చర్యలు తీసుకునే ముందు ఆర్థిక వ్యవస్థ వృద్ధి, ద్రవ్యోల్బణ తీరును నిశితంగా పరిశీలిస్తుందని తెలిపింది. ఇదే సమయంలో ప్రభుత్వం ఖర్చుల విషయంలో జాగ్రత్త వహించాలని మోర్గాన్ స్టాన్లీ సూచించింది. క్రమంగా కేంద్రం తన రుణ భారాన్ని తగ్గించుకోవాలని, ఇదే సమయంలో పెద్ద ప్రాజెక్టులలో భారీగా పెట్టుబడులు కూడా కొనసాగించడం అవసరమని పేర్కొంది. దీనివల్ల దేశ ఆర్థికవ్యవస్థ వృద్ధిని స్థిరంగా కొనసాగించవచ్చని వెల్లడించింది.

## యాషెస్ తొలి టెస్ట్‌కు ఇంగ్లాండ్ రెడీ..

క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాషెస్.. సిరీస్‌కు వేళైంది. నవంబర్ 21 నుంచి పెర్త్ వేదికగా తొలి టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది.ఏ టెస్టు మ్యాచ్‌కైనా.. ఒకటి రెండు రోజులు ముందుగానే తుది జట్టును ప్రకటించే అలవాటు కొనసాగిస్తున్న ఇంగ్లాండ్.. ఈసారి కూడా అదే పని చేసింది. రెండు రోజుల ముందే పెర్త్ టెస్ట్ కోసం 12 మంది సభ్యులతో కూడిన తుది జట్టును ప్రకటించింది.ఈ మ్యాచ్ కోసం 12 మంది సభ్యులతో కూడిన తుది జట్టును ఇంగ్లాండ్ బుధవారం అంటే నవంబర్ 19న రివీల్ చేసింది. అయితే ఈ జట్టులో ఆ జట్టు యువ సంచలనం, ఐపీఎల్‌లో ఆర్సీబీ ప్లేయర్ జాకబ్ బెథెల్‌కు చోటు దక్కలేదు. స్టార్ పేసర్ మార్క్ వుడ్ గాయం నుంచి పూర్తిగా కోలుకొని తుది



జట్టులోకి వచ్చేశాడు. గత కొంతకాలంగా ఫామ్‌లో లేని ఓలీ పోప్ కూడా ఈ జట్టులో స్థానం సంపాదించాడు. పోప్ స్థానంలో బెథెల్‌కు ఛాన్స్ వస్తుందని అంతా భావించినా.. ఈసీబీ మాత్రం పోప్‌పైనే నమ్మకం ఉంచింది. ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ సైతం ఈ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే ప్లెయింగ్ లెవెన్ మాత్రం ఇంకా ఖరారు కాలేదు. పెర్త్ పిచ్ పేసర్లకు అనుకూలిస్తుందనే అంచనాలు ఉన్నాయి. దీంతో బషీర్.. బెంచ్‌కే పరిమితం కావొచ్చు. భారతకాలమానం ప్రకారం ఈ మ్యాచ్ నవంబర్ 21న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. కాగా ఇటీవల యాషెస్ సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా.. ఇంగ్లాండ్‌పై ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. 2015 నుంచి యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ విజేతగా నిలవలేదు. మరీ ముఖ్యంగా 2 దశాబ్దాలుగా ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవలేదు. మరి ఈసారి ఇంగ్లాండ్ ఎలాంటి ప్రదర్శన చేస్తుందో.


## షాయి హోప్ సూపర్ సెంచరీ వృధా.. విండీస్‌పై కివీస్ థ్రిల్లింగ్ విక్టరీ

వెస్టిండీస్ కెప్టెన్ షాయి హోప్ (109 నాటౌట్) అద్భుతమైన శతకంతో చెలరేగినా జట్టును మాత్రం గెలిపించుకోలేకపోయాడు. న్యూజిల్యాండ్‌తో నేపియర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో కరీబియన్ జట్టు ఓటమి చవిచూసింది.వర్షం కారణంగా 34 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచులో.. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటర్లు ఒక్కొక్కరే పెవిలియన్‌కు క్యూ కట్టడంతో ఒకానొక దశలో 86/5తో ఆ టీం పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. ఇలాంటి సమయంలో కంట్రోల్డ్ ఎగ్రెషన్ చూపించిన హోప్.. 42 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. ఆ తర్వాత మరింతగా రెచ్చిపోయిన అతను 66 బంతుల్లోనే శతకం పూర్తిచేశాడు. అతని పోరాటంతో వెస్టిండీస్ 247/9 పరుగుల స్కోరు



సాధించింది. ఛేజింగ్‌లో కివీస్ ఓపెనర్లు డెవాన్ కాన్వే (90), రచిన్ రవీంద్ర (56) ఆ టీంకు అదిరే ఆరంభం అందించారు. అయితే ఆ తర్వాత వచ్చిన యంగ్ (11), చాప్‌మన్ (0), బ్రేస్‌వెల్ (11) ఫెయిలవడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. ఇలాంటి సమయంలో టామ్ లాథమ్ (39 నాటౌట్)కు జతకలిసిన కివీస్ సారథి మిచెల్ శాంట్నర్ (34 నాటౌట్) చెలరేగాడు. రెండు సిక్సులు, 3 ఫోర్లతో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడి, మరో మూడు బంతులు మిగిలుండగానే న్యూజిల్యాండ్‌ను విజయతీరాలకు చేర్చాడు. షాయి హోప్‌కు వన్డేల్లో ఇది 19వ అంతర్జాతీయ సెంచరీ. దీంతో వెస్టిండీస్ తరఫున అత్యధిక వన్డే శతకాలు చేసిన బ్యాటర్‌గా లెజెండ్ బ్రయాన్ లారా రికార్డును హోప్ సమం చేశాడు. ఈ జాబితాలో యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ 25 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు.

## రోహిత్ స్థానానికి ఎసరు పెట్టిన న్యూజిలాండ్ ప్లేయర్



ఇటీవల నంబర్ వన్ ర్యాంక్‌కు చేరిన హిట్ మ్యాన్..ా జాగా రెండో ప్లేసుకు పడిపోయాడు. న్యూజిలాండ్‌కు చెందిన డేరిల్ మిచెల్.. రోహిత్ ప్లేసును ఆక్రమించాడు. వన్డే బ్యాటర్లలో టాప్ ప్లేస్‌కు చేరుకున్న రెండో న్యూజిలాండ్ బ్యాటర్‌గా నిలిచాడు. ప్రస్తుతం న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య వన్డే సిరీస్ జరుగుతోంది. ఇందులో భాగంగా తొలి వన్డేలో మిచెల్ అద్భుత సెంచరీతో అదరగొట్టాడు. 118 బంతుల్లో 119 పరుగులు స్కోరు చేశాడు. తన కెరీర్‌లో ఏడో వన్డే సెంచరీని కొట్టాడు. దీంతో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మిచెల్.. 782 రేటింగ్ పాయింట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రోహిత్ శర్మ కన్నా ఓ పాయింట్ ఎక్కువ సాధించాడు. ఫలితంగా వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరాడు. ఇక వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరిన రెండో బ్యాటర్‌గా డేరిల్ మిచెల్.. రికార్డు క్రియేట్ చేశాడు. అంతకుముందు 1979లో న్యూజిలాండ్ బ్యాటర్ గ్లెన్ టర్నర్ కివీస్ తరఫున తొలిసారి ఈ ఫీట్ సాధించాడు. తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో అఫ్ఘానిస్థాన్ బ్యాటర్.. జర్దాన్ మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగు, విరాట్ కోహ్లీ ఐదో ప్లేసులో కొనసాగుతున్నారు. టాప్-10లో ఉన్న మరో టీమిండియా బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఓ స్థానం మెరుగుపర్చుకొని 8వ స్థానానికి చేరుకున్నాడు. మిగతా భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (16), అక్షర్ పటేల్ (89), హార్దిక్ పాండ్యా (92) టాప్-100లో చోటు దక్కించుకున్నారు.

## భారత్ అంటే అందుకే అంత ప్రేమ..

అంతర్జాతీయ క్రికెట్ వేదికలపై భారత్‌కు మద్దతుగా నిలిచే ప్లేయర్లలో ఇంగ్లండ్ మాజీ ప్లేయర్ కెవిన్ పీటర్సన్ ఒకడు. ఈ విషయంలో అతనిపై తాజాగా ట్రోలింగ్ జరిగింది.ఎప్పుడూ టీమిండియాను సపోర్ట్ చేస్తాడంటూ అతనిపై సోషల్ మీడియాలో విమర్శలు



వచ్చాయి. వీటికి సూటిగా బదులిచ్చిన పీటర్సన్.. తనకు భారత్‌లో ఎప్పుడూ విమర్శలు, అగౌరవం ఎదురుకాలేదని వెల్లడించాడు. తనకు భారత్‌లో లభించే గౌరవం వల్లనే తను భారత్‌కు మద్దతిస్తానని చెప్పుకొచ్చాడు.'నేను ఎప్పుడూ ప్రో-ఇండియాగా ఎందుకు కనిపిస్తానని చాలామంది అడిగారు. నా సమాధానం చాలా సింపుల్. 20 ఏళ్లలో డజన్ల సార్లు నేను భారత్ వెళ్లా. ఇన్నిసార్లలో ఒక్కసారి కూడా అక్కడ అగౌరవం, నెగిటివిటీ, వెన్నుపోటు వంటి చెడ్డవిషయాలు నేను ఎదుర్కోలేదు. ప్రతిసారీ కేవలం ప్రేమ, దయ, మద్దతు, అభిమానం, గౌరవం మాత్రమే ఎదురయ్యాయి. జీవితాంతం ఉండిపోయే స్నేహితులను అక్కడే పొందా. వాళ్లు నా కుటుంబంగా, సోదరులుగా మారారు' అని పీటర్సన్ వివరించాడు. గౌరవం అనేది కష్టపడి సాధించాల్సిందేనని, తను ఏళ్ల తరబడి మంచి క్రికెట్ ఆడి ఆ గౌరవాన్ని పొందానని చెప్పాడు. భారత్‌పై అయినా, ఐపీఎల్‌లో అయినా తన ఆటతోనే ఈ గౌరవం పొందానన్నాడు. అలాగే ఒక దేశంలోని ప్రజలు మన జీవితాంతం పాజిటివ్ అనుభవాలే అందించినప్పుడు, వారికి ఆ ప్రేమను పదింతలు పొందుతారని వివరించాడు. 'భారత్ ముందుగా తన మనసును నాకిచ్చింది. కాబట్టి నా మనసు ఎప్పుడూ భారత్‌కు ఇస్తూనే ఉంటా. ఎప్పటికీ రుణపడి ఉంటా' అని పీటర్సన్ వెల్లడించాడు. ఈ పోస్టు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇండియన్ అభిమానులు కేపీపై మరోసారి తమ అభిమానాన్ని ఈ పోస్టుకు కామెంట్లు పెట్టి చాటుకుంటున్నారు.

# చక్కని ఆరోగ్యం

## వీరికి తేనె విషంతో సమానం..!



మారుతున్న లైఫ్‌స్టైల్, ఆహారపు అలవాట్ల కారణంగా జనాలు అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎందుర్కొంటున్నారు. అందులో డయాబెటీస్ ఒకటి. ఈ వ్యాధిగ్రస్తులు చక్కెరను తిన కూడదు.. అందుకని వీరు చక్కెరకు బదులు ప్రత్యామ్నాయాల కోసం ఎక్కువగా తేనెను తీసుకోవడం స్టార్ట్ చేశారు. అదే కాకుండా తీనే మన ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలు చేస్తుంది.. అయితే ఇది అందరికీ మంచిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తేన ప్రమాదకరమని అంటున్నారు. తేనే మన ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలు చేసినప్పటికీ వృద్ధులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనికి దూరంగా ఉండాలని, వీలైనంతా తక్కువగా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఎందుకంటే తేనెలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ ఉంటుంది ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఇది మదుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది కాదు. తేనె, తేనెటీగ పుప్పొడి లేదా ఏదైనా ఇతర తేనెటీగల సంబంధిత ఉత్పత్తులకు అలెర్జీలు లేదా హైపర్సెన్సిటివిటీ ఉన్నవారు తేనెను నివారించాలి.అలాగే ఇతర ఆరోగ్య సమస్యలకు యాంటీకోగ్యులెంట్, యాంటీప్లేట్‌లెట్ మందులు తీసుకునేవారు కూడా తేనెను తినకూడదు. ఎందుకంటే ఇది రక్తస్రావం ప్రమాదాన్ని పెంచుతుంది. ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు తేనె ఇవ్వడం అస్సలు ఇవ్వకూడదు. ఎందుకంటే ప్రాసెస్ చేయని తేనెలో తేనెటీగ కుట్టడం, చిన్న కీటకాలు, పురుగుమందులు, రసాయనాలు ఉండవచ్చు, ఇవి పిల్లలలో వాంతులు, వికారం, జ్వరానికి కారణమవుతాయి. కాబట్టి పిల్లలకు తేనెను ఇచ్చేముందు వైద్యులను సంప్రదించండి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం, పురుషులు రోజుకు తేనె వంటి 9 టీస్పూన్ల (36 గ్రాములు) వరకు స్వీటెనర్లను తీసుకోవచ్చు. అలాగే మహిళలు రోజుకు 6 టీస్పూన్ల (24 గ్రాములు) వరకు స్వీటెనర్లను తీసుకోవచ్చు. ఎవరూ అంతకు మించి తేనె తినకూడదని వైద్యులు చెబుతున్నారు.


## ఇమ్యూనిటీ బూస్ట్ చేసే సీక్రెట్ వెపన్స్!



చలికాలం వచ్చిందంటే చాలు... ఒక్కసారిగా జలుబు, దగ్గు, జ్వరాలు లైన్ కట్టినట్టు వస్తాయి. ఎందుకంటే ఈఋతువులో మన రోగనిరోధక వ్యవస్థ కాస్త బలహీనపడుతుంది.కానీ భయపడాల్సిన పని లేదు! కొన్ని సీజనల్ పండ్లను మీ రోజువారీ ఆహారంలో జోడించడం ద్వారా ఇమ్యూనిటీని గట్టిగా నిల్పొని, ఈ వైరస్‌లను సులువుగా తరిమికొట్టవచ్చు. నిపుణులు ఈ మహమ్మారి కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.విటమిన్ సి బాంబులుగా పనిచేసే నారింజ, కివీ, దానిమ్మ పండ్లు ఈ సీజన్‌లో మీ బెస్ట్ ఫ్రెండ్స్. ఒక్కో నారింజ తిన్నా రోజంతా కావాల్సిన విటమిన్ సి దాదాపు పూర్తిగా లభిస్తుంది. కివీలో అయితే విటమిన్ సి నారింజ కంటే దాదాపు రెట్టింపు ఉంటుంది! దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్స్ శరీరంలోని హానికర ఫ్రీ రాడికల్స్‌ను నాశనం చేస్తాయి. ఈ మూడింటితో పాటు రోజూ ఒక యాపిల్ తింటే ఫైబర్, విటమిన్స్ రెండూ సమపాళ్లలో లభిస్తాయి.చలికాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉంటుంది కాబట్టి విటమిన్ డి లోపం సహజంగానే వస్తుంది. ఈ లోపం ఇమ్యూనిటీని మరింత దెబ్బతీస్తుంది. కాబట్టి ఉదయం 15-20 నిమిషాలు సూర్యరశ్మి తగిలేలా గడపడం, వైద్యుడి సలహాతో విటమిన్ డి సప్లిమెంట్స్ తీసుకోవడం మంచిది. ఇది మీ శరీరాన్ని వైరస్‌ల నుంచి బలమైన కవచంలా కాపాడుతుంది. అంతేకాదు, రోజంతా వేడి వేడి నీళ్లు సిప్ చేస్తూ ఉండటం, అల్లం-తులసి జావ, టమాటా సూప్, చికెన్ సూప్ లాంటివి తాగితే శరీరం హాయిగా వేడెక్కుతుంది, గొంతు కూడా సేద తీరుతుంది. ఈ చిన్న చిన్న అలవాట్లతోనే ఈ చలికాలంలో డాక్టర్ దగ్గరకు పరుగులు పెట్టకుండా ఆరోగ్యంగా, ఉల్లాసంగా గడపొచ్చు!

## కాలేయం ఆరోగ్యానికి ఒక కప్పు కాఫీ

ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తోంది. కాలేయంలో కొద్దిగానే కొవ్వు ఉంటుంది. కానీ ఈ కొవ్వు, కాలేయం మొత్తం బరువులో పది శాతానికి మించి ఉంటే దాన్ని ఫ్యాటీ లివర్‌గా పరిగణిస్తారు.ఇది తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. ప్రస్తుత లైఫ్‌స్టైల్, చెడు ఆహార అలవాట్లు, అధిక మోతాదులో మద్యం తీసుకోవడం, ఊబకాయం, డయాబెటిస్.. ఫ్యాటీ లివర్‌కు ప్రధాన కారణం అని నిపుణులు అంటున్నారు.ఫ్యాటీ లివర్ రెండు రకాలు.. మద్యపానం కారణంగా వచ్చే.. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్, మద్యపానం కారణంగా వచ్చే ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్‌తో పాటు, మద్యం తాగకపోయినా వచ్చే నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్. ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ నిశ్శబ్దంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో 'ద లివర్ డాక్' పేరుతో ప్రసిద్ధి పొందిన హెపటాలజిస్ట్ డా. సైర్యాక్ అబ్బీ ఫిలిప్స్ కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. ఆయన చెప్పిన చిన్న చిన్న ఆహార, జీవనశైలి మార్పులు పాటిస్తే, ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడం, తిరిగి ఆరోగ్యంగా మార్చుకోవడానికి సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. మనం తీసుకునే ఆహారం, జీవనశైలి లివర్ ఆరోగ్యానికి ఎంతో కీలకం. లీవర్‌లోని కొవ్వు సామర్థ్యం అయిన 5 శాతానికి మించి కొవ్వు పేరుకుపోయినప్పుడు ఫ్యాటీ లివర్ అభివృద్ధి చెందుతుంది. కాలక్రమేణా ఇది పోషకాలను ప్రాసెసింగ్, టాక్సిన్ తొలగింపు, రక్తంలో చక్కెర నియంత్రణ వంటి జీవక్రియ విధులకు అంతరాయం కలిగిస్తుంది. మన డైట్‌లో అనారోగ్యకరమైన ఆహారాన్ని దూరం పెట్టి, పోషకాహారం తీసుకుంటే ఫ్యాటీ లివర్‌ను నియంత్రించవచ్చని డాక్టర్ ఫిలిప్స్ అన్నారు. కొన్ని ఆహారాలు ఫ్యాటీ లివర్ ముప్పును పెంచుతాయని డాక్టర్ ఫిలిప్స్ అన్నారు. స్వీట్స్, చక్కెర పానీయాలు ఎక్కువగా తీసుకుంటే లివర్‌లో కణాలలో ఇన్సులిన్ నిరోధకత, కొవ్వు నిల్వ పెరుగుతుంది. ఇది నాన్‌ఆల్కహాల్ ఫ్యాటీలివర్ వ్యాధి ముప్పును గణనీయంగా పెంచుతుంది. భారతీయ వంటకాల్లో కొబ్బరి నూనె, పామాయిల్, వెన్న, నెయ్యి ఎక్కువగా వాడుతుంటాం. అయితే, వీటిలోని సంతృప్త కొవ్వులు లివర్‌లో కొవ్వు పేరుకునేలా చేస్తాయి. లివర్ పనితీరును దెబ్బతీస్తాయి. వీటిని తక్కువగా తీసుకుంటే లివర్ ఆరోగ్యానికి మంచిది అని డా. ఫిలిప్స్ సూచించారు. ఆల్కహాల్ లివర్ దెబ్బతినడానికి అతిపెద్ద కారణాలలో ఒకటిగా ఉంది. ఆల్కహాల్ తక్కువగా తీసుకున్నా లివర్ ఆరోగ్యాన్ని దిగజారుస్తుందని నిపుణులు అంటున్నారు. లివర్ ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి, ఫ్యాటీ లివర్ ముప్పును తగ్గించుకోవడానికి ఆల్కహాల్‌ను పూర్తిగా విడిచిపెట్టడమే మంచిది అన్నారు. బ్లాక్ కాఫీ లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని డాక్టర్ ఫిలిప్స్ అన్నారు. ఇది లివర్ పనితీరుకు మద్దతు ఇస్తుందని, కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తుందని, వాపును తగ్గిస్తుందని అధ్యయనాలు చూపిస్తున్నాయి. యాంటీఆక్సిడెంట్లు, బయోయాక్టివ్ సమ్మేళనాలతో సమృద్ధిగా ఉన్న బ్లాక్ కాఫీ ఇన్సులిన్ సెన్సిటివిటీని, మొత్తం జీవక్రియ సమతుల్యతను మెరుగుపరుస్తుంది. రోజూ ఒక కప్పు బ్లాక్‌కాఫీ తాగితే నాన్ ఆల్కాహాలిక్ ఫాటీ లివర్, ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ ముప్పును తగ్గించుకోవచ్చు.



## చింతపండు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

చింతపండు గురించి చెప్పగానే నోరు ఊరుతుంది. కానీ తీపి, పుల్లని చింతపండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా? అవును, మీరు విన్నది నిజమే. చింతపండును పోషకాహార నిధి అని కూడా పిలుస్తారు. చింతపండులోని పోషకాలు శరీరానికి అనేక ప్రయోజనాలను అందించడంలో సహాయపడతాయి. చింతపండును ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఈ సమస్యల నుండి శరీరాన్ని రక్షించుకోవచ్చు. చింతపండు గురించి చెప్పగానే నోరు ఊరుతుంది. కానీ తీపి, పుల్లని చింతపండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా? అవును, మీరు విన్నది నిజమే. చింతపండును పోషకాహార నిధి అని కూడా పిలుస్తారు. చింతపండులో ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు, ఫోలేట్, విటమిన్ సి, విటమిన్లు ఎ, ఇ, కె, బి6, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫైటోకెమికల్స్, యాంటీఆక్సిడెంట్లు, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందించడంలో సహాయపడతాయి. చింతపండును ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఈ సమస్యల నుండి శరీరాన్ని రక్షించుకోవచ్చు.చింతపండులో హైడ్రాక్సి సిట్రిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో ఎంజైమ్స్‌ను గ్రహించి కొవ్వు చేరకుండా నివారిస్తుంది. అందువల్ల శరీర బరువు కంట్రోల్‌లో ఉంటుంది. చింతపండు గుజ్జులో ఉండే ఫైబర్ శరీరంలో ఇంఫ్లమేషన్ నివారించి అజీర్ణం, గ్యాస్టిక్ సమస్యలను తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. చింతపండులో ఉండే టార్టారిక్ యాసిడ్ యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఉండే హానికారక ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. చింతపండులో యాంటీ-బ్యాక్టీరియల్ మరియు యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంపై ఏర్పడే గాయాలను రూపుమాపడంతో సమర్థవంతంగా పని చేస్తాయి. చింతపండులో ఉండే పొటాషియం రక్తపోటు, హార్ట్‌బీట్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. చింతపండు రోజూ తీసుకుంటే రక్తహీనత సమస్యను తగ్గించుకోవచ్చు. చింతపండులో ఉండే పోషకాలు రక్తంలో ట్రైగ్లిజరాయిడ్స్‌ను పెంచి ఎర్రరక్తకణాల వృద్ధికి సహాయపడతాయి. చింతపండులో ఉండే యాంటీ సెప్టిక్ గుణాలు ఆస్తమాను నిరోధిస్తాయని తాజా పరిశోధనల్లో తేలింది. ముఖ్యంగా అలెర్జిక్ ఆస్తమాను నివారించడంలో బాగా ఉపయోగపడుతుంది. చింతపండులో ఫైబర్ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించి సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు బారిన పడకుండా మనల్ని కాపాడతాయి.



## చలికాలంలో అల్లం టీ మ్యాజిక్..


గ్యం గ్యారంటీ!

చలికాలం ప్రారంభమైంది.. రోజురోజుకీ చలి తీవ్రత పెరిగిపోతుంది. ఈ సీజన్‌లో ఒంట్లో వేడిని పెంచే ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. అందులోనే శరీరానికి మేలు చేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. చలికాలం ప్రారంభమైంది.. రోజురోజుకీ చలి తీవ్రత పెరిగిపోతుంది. ఈ సీజన్?లో ఒంట్లో వేడిని పెంచే ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. అందులోనే శరీరానికి మేలు చేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న రోజుల్లో ఉదయాన్నే అల్లం టీ తాగితే శరీరంలో వేడి స్థిరంగా ఉంటుంది. ఇది సాధారణ డ్రింక్ మాత్రమే కాదు, ఒక పవర్‌ఫుల్ నేచురల్ రెమెడీ. అల్లంలో జింజరాల్స్, షోగాల్స్ అనే కాంపౌండ్లు యాంటీ-ఆక్సిడెంట్స్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ ప్రాపర్టీస్ ఉంటాయి. చీదీ× రిసెర్చ్ ప్రకారం, అల్లం యాంటీ-ఇన్ఫ్లమేటరీ, యాంటీ-నాయూసియా ఎఫెక్టస్‌తో శరీరాన్ని రక్షిస్తుంది. చలికాలంలో దగ్గు, జలుబు వంటి సీజనల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. అల్లం టీ రోజూ తాగితే ఇమ్యూనిటీ పెరుగుతుంది. అల్లం శరీరంలో వేడిని పెంచడమే కాదు, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. చలికాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లు సాధారణం. అల్లం టీలోని జింజరాల్స్ గొంతు నొప్పి, దగ్గును తగ్గించి, శ్వాసకోశ సమస్యలను అరికడతాయి. అల్లం యాంటీ-మైక్రోబయల్ ప్రాపర్టీస్‌తో బాక్టీరియా, వైరస్‌లను చంపుతుంది. రోజూ ఒక కప్ అల్లం టీ తాగితే, ఫ్లూ, జలుబు రిస్క్ 30% తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అల్లంలోని విటమిన్ సి, మెగ్నీషియం రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.చలికాలంలో మెటబాలిజం తగ్గుతుంది. గ్యాస్, జీర్ణక్రియ సమస్యలు పెరుగుతాయి. అల్లం జీర్ణరసాలను పెంచి, గ్యాస్‌ను తగ్గిస్తుంది. అల్లం గట్ హెల్త్‌ను మెరుగుపరచి ఉబ్బరం, వికారాన్ని తగ్గిస్తుంది. ఇది గ్యాస్ట్రిక్ ఎంప్టీయింగ్‌ను వేగవంతం చేస్తుంది. చలికాలంలో హెవీగా ఉండే ఆహారం జీర్ణం చేయడానికి సహాయపడుతుంది.చలికాలంలో రక్తనాళాల్లో బ్లడ్ ప్రెషర్ పెరుగుతుంది. అల్లం రక్త ప్రసరణను మెరుగుపరచి, ఆక్సిజన్ సరఫరాని పెంచు తుంది. అల్లం ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించి, క్లాట్ ఫార్మేషన్ సమస్యను తగ్గిస్తుంది. తరచుగా అల్లం తీసుకోవడంవల్ల రక్తపోటు తగ్గుతుంది. అల్లం శరీరాన్ని వేడిగా ఉంచి, లెథర్జీని అరికడుతుంది. గ్రీన్ టీతో కలిపి అల్లంని తీసుకుంటే చలికాలంలో ఎండ్యూ రెన్స్ పెరుగుతుంది, ఇది థర్మల్ సెన్సేషన్‌ను మెరుగుపరుస్తుంది, శరీరంలో శక్తి స్థాయిల్ని పెంచు తుంది. అల్లం మెన్స్ట్రువల్ క్రాంప్స్, మసల్ సోర్‌నెస్, ఆస్తి యోఆర్థ్రైటిస్ పెయిన్‌ను తగ్గిస్తుంది.



## హెడ్ మసాజ్ చేయించుకునే వారు ఈ విషయాలు తెలుసుకోండి !

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు మన పెద్దలు. కానీ ఇప్పటి జనరేషన్ వాళ్లు ఎవరు కూడా ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టడం లేదు. నచ్చిన ఫుడ్ తినుకుంటూ, ఇష్టం వచ్చిన పనులు చేసేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.ఇక మరి కొంతమంది ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఇలాంటి నేపథ్యంలోనే హెడ్ మసాజ్ తరచూ చేసుకునే వారికి వైద్యులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తల మసాజ్ నిత్యం చేసుకోకూడదని సూచనలు చేస్తున్నారు. దానివల్ల మెదడుపై ఎఫెక్ట్ పడుతుందట. హెడ్ మసాజ్ అనేది చాలా సున్నితమైన అంశం. ఆ మసాజ్ చేసుకునేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు వైద్యులు. కొబ్బరి, ఆర్గాన్ లాంటి నూనెలతో హెడ్ మసాజ్ చేసుకుంటే, మంచి ప్రయోజనం ఉంటుందని అంటున్నారు. మెడకు అతిగా ఒత్తిడి చేయకుండా మసాజ్ చేయించుకోవాలట. మెడపై ఒత్తిడి పెంచితే నాడీ వ్యవస్థ దెబ్బ తినే ప్రమాదం ఉంటుందట. ఇక వైద్యుల సూచనల ప్రకారం, హెడ్ మసాజ్ చేయించుకుంటే తలనొప్పి, ఒత్తిడి, ఆందోళన లాంటి సమస్యలను తరిమికొట్టవచ్చని చెబుతున్నారు. రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుందట. మానసిక స్థితి బాగుంటుందట. జుట్టు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా జుట్టు రాలడం తగ్గిపోతుందని వైద్యులు సూచనలు చేస్తున్నారు.



# సినిమా

## కొత్త మూవీ ప్రకటించిన కళ్యాణి ప్రియదర్శన్




'లోకా చాప్టర్ 1: చంద్ర'తో ఒక్కసారిగా ఫుల్ క్రేజ్ పెంచేసుకున్న హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్.. ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ మూవీస్ అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా మరో కొత్త ప్రాజెక్టును ప్రకటించింది. మాయ, మానగరం, మాన్స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్ వంటి వరుసగా ఆరు విజయవంతమైన చిత్రాల తర్వాత పొటెన్షియల్ స్టూడియోస్ తమ ప్రొడక్షన్ నెంబర్ 7ను గ్రాండ్‌గా లాంచ్ చేసింది. ఈ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. నాన్ మహాన్ అల్లా ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్ కీలక పాత్రలు పోషించనున్నారు. నూతన దర్శకుడు ధీరవియం ఎస్ఎన్‌దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కి జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చారు. పొటెన్షియల్ స్టూడియోస్ బ్యానర్ పై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, పి. గోపీనాథ్, తంగప్రభహరన్ ఆర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. దీనికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్‌లు త్వరలో అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.

## కథ చెబుతానని ముద్దు పెట్టుకున్నాడు



నాగిని సీరియల్‌తో భాషతో సంబంధం లేకుండా తెలుగు ప్రేక్షకుల్లో కూడా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది నటి మౌనీ రాయ్. ఇప్పుడు వెండి తెరపై కూడా మెరుస్తూ మెప్పిస్తుంది.ఇదిలా ఉంటే.. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ బ్యూటీ తనకు ఎదురైన ఓ దారుణ అనుభవాన్ని పంచుకుంది. 'నాకు 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు సినిమా ఆఫర్ల కోసం ముంబైకి వెళ్లాను. అక్కడ ఓ డైరెక్టర్ నాకు కథ చెబుతానని పిలిచి బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు. ఆ సంఘటన నన్ను చాలా కాలం వెంటాడింది. అలా ఎన్నో కష్టాలు, ఒత్తిడి, ట్రోలింగ్స్ ఎదుర్కొని ఈ రోజు ఈ స్టేజ్‌లో నిలబడ్డాను' అని తెలిపింది. అయితే ఆ డైరెక్టర్ పేరు మాత్రం ప్రస్తావించలేదు. కాగా.. మౌనీ రాయ్ బాలీవుడ్‌లో ప్రసిద్ధ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. అలాగే కెజిఎఫ్ సినిమాలోని ఒక పాటతో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిన ఈ బ్యూటీ.. సినిమాలు, సీరియల్స్, స్పెషల్ సాంగ్స్‌తో పాటు ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ సంపాదించింది.

## 'పాంచ్ మినార్'పై హైప్ పెంచేస్తున్న హీరో కామెంట్స్



రామ్ కడుముల దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ క్రైమ్ కామెడీ నటిస్తున్న ఈ మూవీని గోవింద రాజు ప్రజెంట్ చేస్తుండగా కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. ఇందులో నుంచి ఇప్పటికే రిలీజైన సాంగ్స్, టీజర్, ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ రాగా.. పాజిటివ్ అంచనాల మధ్య ఈ మూవీ నవంబర్ 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రాజ్ తరుణ్ మీడియాతో ముచ్చటిస్తూ సినిమా విశేషాలు పంచుకున్నారు. 'సినిమాని ఈ ఏడాదిలోనే మొదలుపెట్టాం. ఇది ప్రాపర్ క్రైమ్ కామెడీ. కథ నుంచి బయటికి వెళ్లకుండా జానర్‌కి తగ్గట్టు ప్రతి సీన్‌లోనూ మంచి ఫన్ ఉంటుంది. స్క్రీన్ ప్లే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నాకు కథ వినగానే చాలా నచ్చింది. నిర్మాతలు సినిమాకి కావలసిన ప్రతిదీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సమకూర్చారు. మేము అనుకున్న దాని కంటే చాలా బెటర్‌గా వచ్చింది. పాంచ్ మినార్ ఈ సినిమాలో ఒక కీలక మలుపులో వినిపించే పదం. దాంతో కథ ఇంకో మలుపు తిరుగుతుంది. వినడానికి చాలా క్యాచిగా ఉండే పదం కావడంతో అదే టైటిల్‌గా పెట్టాం. ఉద్యోగం సంపాదించే క్రమంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనుకునే ఓ కుర్రాడు ఎలాంటి పరిస్థితుల్లో ఇరుక్కున్నాడు అనేది కథ. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఎంత నలిగిపోతుందంటే చూసే వాళ్ళకి అంత నవ్వొస్తుంది. ఇది కంప్లీట్‌గా ఫిక్షనల్ స్టోరీ. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల ప్రతి కథలో ఒక కొత్తదనం ఉంటుంది. ఏదో కొత్త పాయింట్ చెప్పారు అనే ఫీలింగ్ క్రియేట్ చేస్తుంది. ఈ సినిమాల్లో కూడా అలాంటి ఒక కొత్తదనం ఉంది.

## 'రాజు వెడ్స్ రాంబాయి' మూవీ బంపర్ ఆఫర్..


అఖిల్ రాజ్, తేజస్వి రావు జంటగా నటించిన లేటెస్ట్ మూవీ రాజు వెడ్స్ రాంబాయి. ఓ పల్లెటూరిలో జరిగిన రియల్ లవ్ స్టోరీని దర్శకుడు సాయిలు కంపాటి చాలా గ్రాండ్ గా తెరకెక్కించారు.డాక్టర్ నాగేశ్వరరావు పూజారి సమర్పణలో వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మాణంలో ఈ సినిమా వస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్ మంచి హైప్ తీసుకువచ్చాయి. ఇక నవంబర్ 21వ తేదీన ఈ మూవీ రిలీజ్ కానుంది. ఇలాంటి నేపథ్యంలో ప్రముఖ




ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ కీలక ప్రకటన చేసింది. తమ సంస్థలో వస్తున్న రాజు వెడ్స్ రాంబాయి సినిమా టికెట్ ధరను రూ.99 గా నిర్ణయించింది. సింగిల్ స్క్రీన్ థియేటర్స్ లో ఈ ధర అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది. మల్టీప్లెక్స్ థియేటర్స్ లో రూ.105 గా టికెట్ ధర నిర్ణయించినట్లు ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ వెల్లడించారు. హైదరాబాద్ లో తాజాగా రాజు వెడ్స్ రాంబాయి సినిమాకు సంబంధించిన ఓ ఈవెంట్ జరిగింది. ఈ సందర్భంగా ఈ విషయాన్ని అధికారికంగా సాయికృష్ణ ప్రకటన చేశారు. పైరసీని అరికట్టేందుకు మొదటి నుంచి ఈటీవీ విన్ పోరాటం చేస్తోందని తెలిపారు. అందుకే జనాలందరూ పైరసీ మానేసి, థియేటర్ కు వెళ్లేందుకు సినిమా టికెట్ల ధరలు తగ్గించినట్లు స్పష్టం చేశారు.

## మంచి ఆర్టిస్టు రిటైర్ అవుతున్నారు

క్యారెక్టర్ ఆర్టిస్టు తులసి గారు డిసెంబర్ 31 తర్వాత సినిమాలకు స్వస్తి చెబుతానని, ఇకపై నటించబోనని, సాయిబాబా సేవలో కాలం గడుపుతానని ప్రకటించడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. అసలే ఇప్పుడు నటీమణుల కొరత తీవ్రంగా ఉంది. యాక్టింగ్ చేయడం, చేయకపోవడం ఆవిడ వ్యక్తిగత నిర్ణయమే అయినప్పటికీ మరికొంత కాలం కొనసాగి ఉండాలని మూవీ లవర్స్ అభిప్రాయపడుతున్నారు.



ఇటీవలే విడుదలైన లవ్ ఓటీపీ, కృష్ణలీలలో తులసి నటించారు. ఈవిడ గురించి ఎందుకు ప్రత్యేకంగా చెప్పాల్సి వచ్చిందో తెలియాలంటే తులసి నేపథ్యం అర్థం చేసుకోవాలి.మూడు నెలల వయసప్పుడే 1967లో జీవన తరంగాలులో తులసి మొదటిసారి కనిపించారు. తరువాత ఆరేళ్ళ వయసొచ్చాక తమిళ సినిమా అరంగేట్రంతో చైల్డ్ ఆర్టిస్ట్ గా ఎంట్రీ ఇచ్చారు. చిల్లరకొట్టు చిట్టెమ్మతో తొలి అడుగు పడగా కె విశ్వనాథ్ వరసగా ఇచ్చిన రెండు అవకాశాలు సీతామాలక్ష్మి, శంకరాభరణం బాలనటిగా ఆమె కెరీర్ ని గొప్ప మలుపు తిప్పాయి. అక్కడి నుంచి చాలా హిట్ మూవీస్ చేశారు,. కోతల రాయుడు, న్యాయం కావాలి, ముద్దమందారం, రామదండు, త్రిశూలం, శుభలేఖ వగైరాలు మంచి పేరు తీసుకొచ్చాయి. చంద్రమోహన్ కాంబినేషన్ లో హీరోయిన్ గా నటించిన ముచ్చటగా ముగ్గురు లాంటి సక్సెస్ లు ఆ టైంలోనే దక్కాయి. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ కలిపి సుమారు మూడు వందలకు పైగా సినిమాలు చేసిన తులసి హీరో హీరోయిన్ల తల్లిగా వదినగా చాలా పాత్రలు చేసి ఇప్పటి ఆడియన్స్ కి దగ్గరయ్యారు తులసి భర్త కన్నడ దర్శకుడు శివమణి.


## అది నా నంబరు కాదు



ఇటీవలే వాట్సప్‌లో తన పేరు, ఫోటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని.. అలాంటి ఫేక్ అకౌంట్‌ల నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి విజ్ఞప్తి చేశారు. తాజాగా మరో నటి శ్రియ శరణ్ కూడా ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఆమె ఈ విషయాన్ని ఇన్‌స్టాలో ఓ పోస్ట్ ద్వారా తెలిపారు. ఈ పోస్ట్‌కి "ఈ వ్యక్తి ఎవరో నాకు తెలియదు. దయచేసి ఇలాంటి వారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులతో సహా నేను అభిమానిస్తూ కలిసి వర్క్ చేయాలనుకునే వారికి కూడా మెసేజ్‌లు చేస్తున్నాడు. చాలా వింతగా అనిపిస్తుంది. ఇలా చేయడానికి మీ సమయాన్ని ఎందుకు వృథా చేసుకుంటున్నారు?" అంటూ శ్రియ అందరూ అప్రమత్తంగా ఉండాలనే వ్యాఖ్యల్ని జోడించారు.

## హిట్టు 'భాగ్యం' ఇవ్వాల్సింది ఆంధ్రకింగే

హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు అవకాశాలకు లోటు లేదు. ఆఫర్లు వస్తున్నాయి. ఏ ముహూర్తంలో దర్శకుడు హరీష్ శంకర్ మిస్టర్ బచ్చన్ ఛాన్స్ ఇచ్చాడో కానీ అది డిజాస్టర్ అయినా సరే అమ్మడికి మాత్రం దశ తిరిగింది. పెద్ద బ్యానర్లు, స్టార్ హీరోలు తనవైపు చూడటం మొదలుపెట్టారు. అందులో భాగంగానే విజయ్ దేవరకొండ కింగ్డమ్ దొరికింది. భారీ బడ్జెట్ తో సితార సంస్థ నిర్మించిన ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలు అందుకోలేదు. ఫ్లాప్ ముద్ర పడింది. తాజాగా విడుదలైన దుల్కర్ సల్మాన్ కాంత సైతం టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఎదురీదుతోంది. తమిళంలో ఓకే అనిపించుకున్నా తెలుగులో మాత్రం నిరాశపరిచింది. ఇప్పుడు ఇదే నెలలో రామ్ తో కలిసి ఆంధ్రకింగ్ తాలూకాలో భాగ్యశ్రీ బోర్సే మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ట్రైలర్ చూస్తే నమ్మకం పెట్టుకోవచ్చు అనేలాగే ఉంది. రామ్, ఉపేంద్రల మధ్య ఫ్యాన్ హీరో ఎమోషన్ తీసుకున్న దర్శకుడు మహేష్ బాబు ఏదో కొత్త ప్రయత్నమైతే చేశాడు. సంగీత దర్శకులు వివేక్ మెర్విన్ పాటలు మెల్లగా చొచ్చుకుపోతున్నాయి. చాలా గ్యాప్ తర్వాత రామ్ ఎనర్జీ పూర్తి స్థాయిలో తెరమీద కనిపిస్తోందని ఫ్యాన్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు. కథ పరంగా ఆంధ్రకింగ్ ఉపేంద్ర అయినప్పటికీ తాలూకా అనే పదం రామ్ ని ఉద్దేశించిందే. తన పాత్రే హైలైట్ గా ఉంటుందని చెబుతున్నారు. ఇక భాగ్యశ్రీ బోర్సేకు తగిన ప్రాధాన్యం దక్కిందని, రామ్ పోషించిన సాగర్ పాత్రకు ఆమెకు మధ్య పెట్టిన లవ్ స్టోరీ కథలో కీలక భాగం పోషిస్తుందట. దీని సక్సెస్ మీద చాలా నమ్మకం పెట్టుకున్న భాగ్యశ్రీకి కాంత ఫలితం నిరాశపరిచిన మాట వాస్తవం. కాకపోతే అందులో ఫస్ట్ హాఫ్ కే హత్యకు గురయ్యే క్యారెక్టర్ అయినప్పటికీ ఉన్నంతలో బెస్ట్ పెర్ఫార్మన్స్ ఇవ్వడానికి దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ అవకాశం కలిగించాడు. కర్నూలులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో రామ్ మాట్లాడుతూ అందం అభినయం రెండూ ఉన్న నటిగా తన గురించి ఓ రేంజ్ లో ఎలివేషన్లు ఇచ్చాడు. మరి హిట్టు భాగ్యం ఆంధ్రకింగ్ కలిగిస్తాడో లేదో చూడాలి.



# డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



డ్రగ్స్ నిర్మూలన ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించిన వరంగల్ పోలీస్ కమిషనర్

హనుమకొండ, నవంబర్ 20 (వుదయం జిల్లా ప్రతినిధి) : డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకై చేపట్టిన చర్యల్లో భాగంగా, మత్తు పదార్థాల వినియోగించే వారితో పాటు, వీటిని విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు, అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని తెలిపే విధంగా డ్రగ్స్ కంట్రోల్ టీం అధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ నినాదంతో రూపొందించిన ప్రచార గోడ పత్రికలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం అధికారులతో కలసి కమిషనరేట్ కార్యాలయములో అవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, యువత భవితవ్యాన్ని కాపాడుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యమని, మత్తు పదార్థాల నియంత్రణలో ప్రజలు సైతం పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందించాల్సి వుంటుందని. ఇందుకోసం ఎవరైన మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలకు పాల్పడితే తక్షణమే 8712584473, 8712685299 నంబర్లకు సమచారం అందించి డ్రగ్స్ రహిత సమాజంకై మీరు భాగస్వాములు కావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచబడుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో పరిపాలన విభాగం అదనపు డిపిపి రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి జితేందర్ రెడ్డి, ఆర్.ఐ శివకేశవులు, ఇన్స్‌స్పెక్టర్ సతీష్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి,నాగరాజు, ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దర్గారావు,సందీప్ పాల్గోన్నారు.

# గన్ మెన్లు లేకుండా ఒంటరిగా బస్టాండ్ వెళ్లిన ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ, నవంబర్ 20 (వుదయం జిల్లా ప్రతినిధి) : ఈరోజు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ హనుమకొండ అభివృద్ధిలో వెనుక ఉందని ప్రజలందరికీ న్యాయం చేరిన ఎమ్మెల్యే పై ప్రజలందరూ అసంతృప్తిగా ఉన్నారని గన్మెన్లు లేకుండా దమ్ముంటే బస్టాండు వెళ్లగలవా అని సవాల్ విసిరిన నేతలకు చెంపపెట్టు సమాధానం ఇచ్చిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తాను ఏప్పుడు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల పక్ష నిలబడ్డానే కానీ హంగు ఆర్భాటాలకు ముందు వరుసలోలేనని వెల్లడించారు.గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు కూడా యూనివర్సిటీ విషయాలపై సవాల్ విసిరినప్పుడు కనీసం ముందుకు రాని నాయకులు ఇప్పుడు గన్మెన్లు లేకుండా తిరగాలని నాపై సవాల్ వేయడమంటే హాస్యస్పదమని అన్నారు. రాజకీయాల్లో దిగజారుడు పనులు చేస్తూ రాజకీయాలను భ్రష్టు ప్రశ్నించిన రాజయ్య గారు కూడా నా యొక్క పనితనాన్ని విమర్శిస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా కనబడుతున్నాయి. గత ప్రభుత్వం కట్టించినప్పటికీ లబ్ధిదారుల దగ్గర డబ్బులు తీసుకుని కాలయాపన చేసి లంచగొండులుగా మరింది మీరు. ప్రజా క్షేత్రంలో మీరు పరిపాలించిన కాలం మొత్తం ప్రజలకు ఏమి చేయలేదని ప్రజలు పక్కన పెడితే ఇంకా బుద్ధి లేనట్టుగా మాటలతో పబ్బం గడుపుతూ కేవలం మాటల వరకే మీ యొక్క మీనమేషాలు చూపించడం ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గతంలో విద్యావంతులుగా ఉండి ఎందరో పిల్లలకు ఆదర్శవంతంగా ఉండి ఇప్పుడు దొరగారి దొడ్డిలో బానిసవ్వడం ఆ దొర మెప్పుకోసం ఊకదంపుడు ఉపన్యాసాలు అర్థం లేని మాటలు మాట్లాడడం సరికాదన్నారు. మంచి వ్యక్తి తప్పుడు పార్టీలో ఉన్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని ఏద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు సవాలు స్వీకరించి స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులను ఆత్మీయంగా పలకరిస్తూ అభివృద్ధి విషయాలపై వారిని నేరుగా అడిగి తెలుసుకున్నారు.

# బాలలు భయాన్ని వీడి ప్రశ్నించడం నేర్చుకోవాలి– జిల్లా కలెక్టర్



వరంగల్, నవంబర్ 20 (వుదయం జిల్లా ప్రతినిధి): బాలలు భయాన్ని వీడి ప్రశ్నించడం నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ యూనిట్, డాన్బాస్కో ఎన్.జీ.ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకథాన్ ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కాశీబుగ్గ నుండి ఓ సిటీ గ్రౌండ్స్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పాఠశాలలు, బాలల సంరక్షణ సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఓ సిటీ గ్రౌండ్స్ లో జరిగిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి నుండి బయట పడాలంటే వారి భయాన్ని వదిలి గొంతెత్తి ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అంతేకాక ప్రతీ పిల్లవాడు ఆరోగ్య కరమైన, ఆహ్లాద కరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. బాలలు వారి హక్కుల పట్ల అవగాహన కలిగి ఉంటూనే బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పాఠశాలల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు అందుబాటులో ఉన్న పిర్యాదుల పెట్టెలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మాట్లాడుతూ బాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా బాలల సంరక్షణ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు పనిచేస్తున్నాయని, అత్యవసర సహాయం కోసం 1098 కు ఫోన్ చేసి సంప్రదించి వారి సమస్యలకు పరిష్కారాన్ని పొందాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబర్చిన వారికి కలెక్టర్, ఆదనపు కలెక్టర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సాంబశివరావు, జిల్లా యువజన, క్రీడాల అధికారి అనిల్, జిల్లా బాలల సంక్షేమ అధికారి ఉమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వసుధ, సభ్యులు మధు, షాహెదా, సుజాత, మండల విద్యా అధికారి వెంకటేశ్వర రావు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ కల్పన, డాన్బాస్కో ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ సంతోష్, షేర్ ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి 15 వేల ఆర్థిక సహాయం



తుంగతుర్తి(శాలిగౌరారం), నవంబర్ 20, (వుదయం ప్రతినిధి): నల్లగొండ జిల్లా, శాలి గౌరారం మండల పరిధిలోని ఎస్జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన వంగూరి గంగమ్మ గత కొన్ని రోజుల క్రితం మరణించింది.వారిది నిరుపేద కుటుంబం.జాతీయ మానవ హక్కుల మండలి నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వర్లు సూచనల మేరకు జాతీయ మానవ హక్కుల మండలి ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ సభ్యుడు వీపురి పరాంకుశం ఆధ్వర్యంలో వంగూరి గంగమ్మ దశదినకర్మకు 15 వేల రూపాయలతో పాటు క్వింటన్నర బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆర్థిక సహాయం అందజేసిన వారిలో ఎన్ హెచ్ ఆర్ సి అభిమానులు, గ్రామ ప్రజలు, మేస్త్రి సంఘం, కార్మిక సంఘ సభ్యులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్ సి అభిమాన సభ్యులు సిరిపంగి పరమేశ, బొల్లెపల్లి సైదులు, సిరిపంగి సత్యం, సిరిపంగి రఘు, నార్కట్పల్లి పరమేశ, గూడపూర్ దావీదు, కొమ్ము మల్లేష్, మేస్త్రి సంఘ సభ్యులు వియాదయ్య, గూడెపురి బాలయ్య, నార్కట్పల్లి భూషలు, లక్ష్మయ్య, గ్రామ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్, మమిల్లగూడెం, ఖమ్మంలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం



ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ లో భాగంగా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సుజాత రెడ్డి (ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, శ్రీ గర్భ ఫెర్టిలిటీ సెంటర్), విద్యార్థులతో మాట్లాడుతూ శారీరక ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఆరోగ్యం, రోజువారీ జీవితంలో పాటించాల్సిన స్మార్ట్ లివింగ్ అలవాట్లపై విలువైన సూచనలు అందించారు. ఆమె సందేశం విద్యార్థులను ఎంతో ప్రేరేపించింది.అలాగే, తాను కూడా శ్రీ చైతన్య విద్యార్థినని గర్వంగా గుర్తుచేసుకున్నారు, శ్రీ చైతన్య అందించిన క్రమశిక్షణ, విలువలు తన ప్రగతికి కీలకమని విద్యార్థులతో పంచుకున్నారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల తరపున విద్యార్థులకు NASA కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ కిట్స్ శాస్త్రీయ ఆలోచన, ప్రయోగాత్మక నేర్పు, అంతరిక్ష శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేలా విద్యార్థుల్లో ఉత్తేజాన్ని కలిగించాయి.ఈ కార్యక్రమంలో చైర్మన్ మల్లంపాటి శ్రీధర్,డైరెక్టర్ శ్రీవిద్య, ఏజిఎం చేతన్, ప్రిన్సిపల్ నీరజ,అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు , హైస్కూల్ డీన్ ఉమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నవంబర్ 23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

**ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులకు ఉచిత విద్య– చైర్మన్ మోషన్ ఐఐటీ నీట్ కాలేజ్**



హనుమకొండ, నవంబర్ 20 (వుదయం జిల్లా ప్రతినిధి) : హన్మకొండ నయీమ్ నగర్ మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కాలేజీలో ఈ నేల 23న జరిగే మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ పోస్టర్ ను కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వేణు గోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఐఐటి, నీట్ కోచింగ్ కు దేశంలోనే అగ్రగామి విద్య సంస్థ అయిన రాజస్థాన్ కోటా మోషన్ ఐఐటీ, నీట్ కాలేజీ ఈ నేల 23న దేశవ్యాప్తంగా మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహించడం జరుగుతుందని, ఈ టాలెంట్ టెస్ట్ ఈ సంవత్సరం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరూ అర్హులని అన్నారు. దేశవ్యాప్తంగా మోషన్ టాలెంట్ సెర్చ్ టెస్ట్ వ్రాసే విద్యార్థులలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య, రూ.2.50 కోట్ల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మోషన్ ఐఐటీ, నీట్ వరంగల్ సెంటర్ నుండి కూడా మోషన్ టాలెంట్ టెస్ట్ లో మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు మొదటి ర్యాంక్ విద్యార్థికి ల్యాబ్ టాప్ రెండవ ర్యాంక్ సాధియించిన విద్యార్థి కి టాబ్ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. కావున ఈ మంచి అవకాశాన్ని ఈ సంవత్సరము 10వ తరగతి చదువుతున్న స్టేట్, సిబిఎస్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. టాలెంట్ టెస్ట్ రిజిస్ట్రేషన్ కోసం 9703000850/851/852 సెల్ నెంబర్లకు గాను మోషన్ ఐఐటీ, నీట్ ఇన్స్టిట్యూట్ నయీమ్ నగర్, హన్మకొండ నందు సంప్రదించగలరని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో మోషన్ కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, ఏజీఎం శనిగరపు సుమన్, ఏవో తాళ్లపెల్లి రమేష్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సురేందర్, తాళ్లపెల్లి వెంకట్, రావుల రవీందర్, ఒంటెరు మనోహర్, బోడ సంతోష్, జి. అనిల్, రంజిత్, కాలేజీ సిబ్బంది లక్ష్మణ్, మౌనిక, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో 26న మోటార్ సైకిల్ ర్యాలీ



దమ్మపేట నవంబర్ 20 (వుదయం ప్రతినిధి): సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం దమ్మపేట మండల కమిటీ సమావేశం తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 9.12.2021న రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడిరపు ద్వారా వచ్చిన మిగులును రైతులకు పంచాలని, కనీస మద్దతు ధరల చట్టం (సి2+50) కొనుగోలుకు గ్యారెంటీ చేస్తూ వెంటనే ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంట కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పత్తి పంట పై 11% పన్ను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, నూతన మార్కెట్ పాలసీ విధానాన్ని రద్దు చేయాలని, నూతన విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో వ్యవ సాయ కార్మికులకు ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్స్ తో సంయుక్త కిసాన్ మోర్చా ఎస్కేయం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నవంబర్ 26న కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలకు ఇచ్చిన పిలుపులో భాగంగా ఎస్ కే యం దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని ఈ కార్యక్రమానికి రైతులు వ్యవసాయ కార్మికులు సంకటిత అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మూత తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం వెంటనే ఎకరాకు 50వేల రూపాయలు ఇవ్వాలని, అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని వ్యవసాయ కార్మికులకు ఇస్తానన్న సంవత్సరానికి 12 వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని పత్తి కింటాకి 10,075 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు సుంకిపాక ధర్మ, తెలంగాణ రైతు సంఘం నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, కోలికపోగు శ్రీనివాస్ రావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

**అధికారులు ప్రతీ రోజు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి**

**ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు రసీదు ఇవ్వాలి**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి జూపల్లి**



నాగర్ కర్నూల్ నవంబర్ 20 (వుదయం ప్రతినిధి)ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కొల్లాపూర్ నియోజక వర్గంలో కుడికిల్ల, నార్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలుతీసుకోవాలని నిర్వాహకులను మంత్రి జూపల్లి ఆదేశించారు. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉంటే నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వెంటనే కొనుగోళ్లు చేయాలని చెప్పారు. సంబంధిత అధికారులు ప్రతీ రోజు సెంటర్లను పరిశీలిస్తూ.. ఎక్కడ జాప్యం చేయకుండా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలను ఆన్ లైన్లో నమోదు చేయాలని, రైతుల అకౌంట్లోకి డబ్బులు జమ అయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యాన్ని విక్రయించిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు తర్వాత రైతులకు ఎలాంటి సంబంధం ఉండదని ఎలాంటి సమస్యలున్నా నిర్వాహకులు, అధికారులు చూసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతులందరూ తమ ధాన్యాన్ని దళారులకు కాకుండా, కొనుగోలు కేంద్రాల్లోనే క్రయవిక్రయాలు జరపాలన్నారు.

## ఈ నెల 27న ఉచిత కంటిచికిత్స శిబిరం..



నాగర్ కర్నూల్ నవంబర్ 20(వుదయం ప్రతినిధి)జిల్లావైద్యఆరోగ్యశా,జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 27న గురువారం నాడు ఉదయం 9నుండి 11.30గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరము నిర్వహిస్తున్నట్లు నాగర్ కర్నూలు ఆప్తాలమిక్అధికారి కొట్ర బాలాజీ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గదినెంబర్ 102లో కంటి శిబిరం ఉదయం 9 నుండి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్టు పొరగల వారికి ఉచితంగా కంటిఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించనున్నట్లుతెలిపారు. రోగులు ముందుగా బి.పి,షుగర్పరీక్షలు చేసుక్కొని రిపోర్టు వెంట తెచ్చుకోవాలని తెలిపారు.ఈ ప్రాంత రోగులు ఆధార్ కార్డు,రేషన్ కార్డు, ఓటర్ కార్డు,ఏదేని గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ, ఫోన్ నెంబర్ ని తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. వివరాలకు 9440876556, 7386940480లో సంప్రదించాలన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి

## నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి




నాగర్ కర్నూల్ నవంబర్ 20(వుదయం ప్రతినిధి)ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలనినాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ,PCR 1955 & POA Act, 1989 అమలుపై సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ చైర్మన్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, శాసనమండలి సభ్యులు కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సమక్షంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి ఛార్జ్ షీట్ వేస్తే, బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం వెంటనే అందజేసి, పేద ప్రజలకు సరైన అవగాహన కల్పించి ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధికారులకు సూచించారు. శాసనమండలి సభ్యులు కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నాగర్ కర్నూల్ డివిజన్ పరిధిలోని భూ సంబంధిత తగల విషయంపై కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్యలను పరిష్కరించి ఎస్సీలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీసులు రెవిన్యూ శాఖ అధికారులకు ఆయన సూచించారు.ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆయ నియోజకవర్గాల పరిధిలోని ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన వివరాలు భూతగాదాలు బాధితుల నష్టపరిహారం సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. సలహాలు సూచనలను ఎస్సీ ఎస్టీ కమిటీకి తెలిపారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి 234 ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులు అందగా అందులో 219 కేసులు అట్రాసిటీ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. వాటిలో 170 కేసులకు చార్జిషీటు వేయడం దాఖలు అయ్యిందని, ఇప్పటివరకు 219 కేసులకు పరిహారం మంజూరు చేయడం జరిగిందని, 19 కేసులు పెండింగ్లో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సభ్యులు, మాట్లాడుతూ పారదర్శకత, బాధ్యతాయుత సమర్పణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖలు మరింతగా సమన్వయం చేసుకోవాలని కమిటీ సూచించింది. సమావేశంలో పాల్గొన్న ప్రతి సభ్యుడు తమ సలహాలు, అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్ దేవ సహాయం అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డి.ఎస్.పి బుర్రి శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ కులాల నుండి ప్రాతినిధ్యం సభ్యులు, ఎల్లపోగు వెంకటస్వామి, చిననగల్లా పరశురాం, గుమ్మకొండ రాములు, వెల్టూరి రెణయ్య, కె. చందర్, రెడ్యా, ఆర్డీవోలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి,మెంబర్ సెక్రెటరీ ఉమాపతి, అధికారిక కమిటీ సభ్యులు పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు , జిల్లా లేబర్ అధికారి రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో గ్రామపంచాయతీ ఎన్నికల పకడ్బందీగా నిర్వహిస్తాం.. జిల్లా కలెక్టర్



నాగర్ కర్నూల్ నవంబర్ 20(వుదయం ప్రతినిధి)స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లాల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, ఎస్పీలతో స్థానిక సంస్థలఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడుతూ... గ్రామ పంచాయతీల ఓటరు జాబితా సవరణ, తుది ప్రచురణపై చర్చించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలు, సాంకేతిక ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారుల అభిప్రాయాలను స్వీకరించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో భద్రతా ఏర్పాట్లు, కేంద్ర బలగాల మోహరింపు, ఎన్నికల కోడ్ అమలు, ఖర్చుల పర్యవేక్షణ, బ్యాలెట్ పత్రాల సన్నద్ధత, శిక్షణ ఏర్పాట్లపై ప్రధానంగా అధికారులు సూచనలు సలహాలతో పాటు వివిధ జిల్లాల కలెక్టర్లతో సలహాలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లాలోని 20 మండలాల పరిధిలో ఉన్న ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల అధికారి సూచనల మేరకు జిల్లాలో సిబ్బంది, భద్రతాపరమైన అంశాలపై తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర వివరాలను ఎస్పీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఓటర్ జాబితా పక్కగా నిర్వహించి ఎన్నికలను సజావుగా నిర్వహించేలా జిల్లాలు చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారువీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డిప్యూటీ సిఈఓ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఇంధనం ప్రజలే

## 2047 నాటికి ప్రపంచ స్థాయి పోటీకి దీటుగా

- వారు కేవలం లబ్ధిదారులే కాదు.. ప్రగతిలో భాగస్వాములు కూడా..
- వచ్చే రెండు దశాబ్దాల్లో 8 రంగాలపై సమగ్ర, సమ్మిళిత దృష్టి
- తెలంగాణ రైజింగ్ 2047 దార్శనిక పత్రం ఈ కోణంలోనే




**వుదయం హైదరాబాద్:**
'రాష్ట్ర ప్రగతికి ఇంధనం ప్రజలే. వారు ఎదిగితేనే తెలంగాణ ఎదుగుతుంది. ప్రజలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా.. అభివృద్ధిలో భాగస్వాములుగా భావించడం ఈ దిశలో ముఖ్యమైన మార్పు. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతాయి. అప్పటికి రాష్ట్రంలో విద్య, ఉపాధి, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, సుస్థిర సమగ్ర అభివృద్ధి, సమాన అవకాశాలు తదితర లక్ష్యాలను సాధించడమే వ్యూహం. వచ్చే రెండు దశాబ్దాల కాలంలో ప్రధానంగా 8 రంగాలపై సమగ్ర, సమ్మిళిత దృష్టి సారించాలనేది లక్ష్యం. ఈ కోణంలోనే 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రం రూపకల్పన'' అని ప్రభుత్వం స్పష్టం చేసింది. వచ్చే నెల 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో రెండు రోజులపాటు నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'లో విడుదల చేయనున్న 'దార్శనిక పత్రం' రూపకల్పనపై కొద్దిరోజులుగా సర్కారు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశంలో.. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళ, బుధవారాల్లో వరుసగా అన్ని శాఖల ఉన్నతాధికారులతో 'విజన్ డాక్యుమెంట్'పై సమీక్షలు నిర్వహించారు. ప్రజాభిప్రాయంలో 65 శాతం యువతే'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్' రూపకల్పనలో భాగంగా ప్రభుత్వం ప్రజల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానించింది. నిర్దేశిత ఫార్మాట్‌లో పత్రాన్ని రూపొందించి.. నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. ఇందులో పాల్గొన్న వారిలో 65 శాతం యువతే కావడం విశేషం. ప్రజల నుంచి వచ్చిన స్పందనల ఆధారంగా ప్రధానంగా ఎనిమిది ప్రాధాన్య రంగాలను ప్రభుత్వం గుర్తించింది. జనాభీష్టం మేరకు విధానపరమైన నిర్ణయాలు తీసుకోనుంది. 33% మంది తమ ప్రాథమ్యంలో.. ఉత్తమ విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్య సేవలు ఉండాలని సూచించారు. ఉద్యోగావకాశాలు, స్కిల్లింగ్, గైడెన్స్, స్టార్టప్స్, స్పోర్ట్స్ అభివృద్ధి వంటి అంశాలపై స్పష్టమైన అభిప్రాయాలు తెలిపారు. ఐటీ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భవిష్యత్ అవకాశాలు కల్పించాలనే డిమాండ్‌ను బలంగా వినిపించారు. మొత్తంగా 2047 నాటికి ప్రపంచ స్థాయి పోటీకి దీటుగా సమాన అవకాశాలు కల్పించగలిగే రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష ప్రజల్లో వ్యక్తమైంది.

# మరింత పక్కాగా ప్రాక్టికల్స్

## ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్స్‌పై మరింత కట్టుదిట్టం

- అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- ఎక్కువ సంఖ్యలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు



**వుదయం హైదరాబాద్:**

రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్స్‌పై మరింత కట్టుదిట్టమైన నిఘా పెట్టనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టింది. గత విద్యా సంవత్సరం సీసీ కెమెరాలను అమర్చి, బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించగా.. ఈ సారి ఫ్లయింగ్ స్క్వాడ్ల బృందాలను పెద్దసంఖ్యలో ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఫిబ్రవరి 2 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరంతోపాటు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. దాదాపు 4 లక్షల మంది హాజరవుతారు. గత ఏడాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో బోర్డు నుంచి ప్రాక్టికల్స్ పర్యవేక్షణ కోసం డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించలేదు. దానికితోడు చివరి నిమిషంలో నిర్ణయం వల్ల అనేక ప్రైవేట్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోలేదు. ఈ సారి అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చనున్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు పాఠశాల విద్యాశాఖ పరిధిలో, ఇతర గురుకులాలు ఆయా శాఖల పరిధిలో ఉంటాయి. వాటిల్లో సీసీ కెమెరాలున్నా బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం కాలేదు. ఒకవేళ ఏదైనా అక్రమం జరిగినా చర్య తీసుకునే అధికారం బోర్డుకు ఉండదు. అందుకే ఈ సారి వాటిల్లో ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను తొలగించారు. వారంతా ఈ పరీక్షలకు ప్రభుత్వ కళాశాలలకు రావాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమైనందున వాటిల్లోనే ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం(2026-27) నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్స్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

# జెలెన్‌స్కీకి షాకిచ్చిన ట్రంప్!

**వాషింగ్టన్ :**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి షాక్ ఇచ్చారు. పుతిన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న రష్యా- ఉక్రెయిన్ శాంతి ప్రణాళికను చడీచప్పుడు లేకుండా ఆమోదించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది మూడేళ్లకు పైగా కొనసాగుతోన్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 28 పాయింట్లతో ఒక ప్లాన్ సిద్ధం చేశారు. అందులో ఎక్కువ పాయింట్లు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ఆ ప్రతిపాదనలను అమెరికా, రష్యా అధికారులు సంయుక్తంగా రూపొందించారు. ఇటీవల దానిని జెలెన్‌స్కీ ప్రభుత్వానికి అందించారు. దీనిపై ట్రంప్ ( ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఉక్రెయిన్ జాతీయ భద్రతాధిపతి రుస్తుమ్ ఉమరోవ్ మధ్య సమావేశం జరిగింది. ఈ ప్రణాళికకు అంగీకారం తెలపాలని అమెరికా కోరుకుంటుందని ఆ సందర్భంగా విట్కాఫ్ స్పష్టం చేశారు. కానీ పలు నిబంధనలను జెలెన్‌స్కీ వ్యతిరేకిస్తున్నారు. వాటిని అంగీకరించడం అంటే తమ సార్వభౌమత్వాన్ని వదులుకోవడమేనని కీవ్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. మిత్ర దేశం నిరాకరిస్తున్నా.. ట్రంప్ మాత్రం దానికి మద్దతు తెలిపారని ఆ కథనం పేర్కొంది.ఆ ప్లాన్ ప్రకారం.. ఉక్రెయిన్ తూర్పు డాన్‌బాస్‌లో ఇప్పటికే తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంతో పాటు మిగిలిన ప్రాంతాన్ని రష్యా కు అప్పగించాలి. ఉక్రెయిన్ తన సైనిక బలాన్ని సగానికి సగం తగ్గించుకోవాలి. అలాగే ఆ దేశ రక్షణకు కీలకమైన అమెరికా సైనిక సహాయాన్ని ఉపసంహరించుకోవాలి. ఉక్రెయిన్ గడ్డపై విదేశీ బలగాలకు అనుమతి ఉండకూడదు. రష్యా భూభాగంలోకి దాడి చేయగల ఆయుధాలను ఉక్రెయిన్‌కు ఎవరూ అందించకూడదు. స్వదేశంలో వెలుగు చూస్తోన్న అవినీతి కుంభకోణాల్లో తన సన్నిహితుల పేర్లు ఉండటంతో జెలెన్‌స్కీ రాజకీయంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆయన సహాయకుల్లో పలువురిని వారి పదవుల నుంచి తొలగించాలన్న డిమాండ్లు తీవ్రమవుతున్నాయి.



## ఇంత పెద్ద దుఃఖం మరెవరికీ రాకూడదు

- భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- బస్సు ప్రమాద బాధిత కుటుంబాల పరామర్శ

సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అడిక్‌మెట్‌లోని ఒకే కుటుంబంలో 18 మంది మరణించడం బాధాకరమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆయన అడిక్‌మెట్, రాంనగర్, విద్యానగర్ ప్రాంతాల్లో పర్యటించారు. 18 మంది మృతి చెందిన కుటుంబంతో పాటు.. ఇతర బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారికి తాము అండగా ఉంటామన్నారు. ఇప్పటికే కొందరు తమ పార్టీ నాయకులు జెడ్డా వెళ్లారని చెప్పారు. భారత దౌత్య అధికారులతో మాట్లాడి వీలైనంత సహాయం చేస్తామని తెలిపారు. ఇంత పెద్ద దుఃఖం మరెవరికీ రాకూడదన్నారు. ప్రమాద ఘటన తనతో పాటు అందరికీ బాధ కలిగించిందన్నారు. శోక సమయంలో బాధిత కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో ఈ నెల 17న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందిన విషయం తెలిసిందే. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

# బిహార్‌లో కొలువుదీరిన ఎన్డీయే సర్కార్

- ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ పదోసారి ప్రమాణస్వీకారం
- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు

**వుదయం ఢిల్లీ :**




బిహార్‌లో ఎన్డీయే సర్కార్ కొలువుదీరింది. జేడీయూ అధినేత నీతీశ్ కు మార్ గురువారం ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేశారు పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్‌తో పాటు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా, పలువురు మంత్రులు ప్రమాణం చేశారు. వారిద్దరికి ఉప ముఖ్యమంత్రి పదవులు దక్కాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు. ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు సహా ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశంలో శాసనసభాపక్ష నేతగా నీతీశ్‌ను ఎన్నుకున్నారు. తాను ఎన్నిక కాగానే సీనియర్ నేతలు వెంట రాగా నీతీశ్.. గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్‌ఖాన్ వద్దకు వెళ్లి, రాజీనామా సమర్పించిన సంగతి తెలిసిందే. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నీతీశ్, మోదీల జోడీ సూపర్‌హిట్ కొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు గానూ నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే 202 సీట్లు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా భాజపా అవతరించింది. ఆ పార్టీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. దాని స్ట్రైక్‌రేట్ 88శాతంగా ఉంది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా నీతీశ్ సహా 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. వారిలో 14 మంది భాజపా నుంచి ఉండగా.. 9 మంది జేడీయూకు చెందిన నేతలు. లోక్ జన్‌శక్తి (రాంవిలాస్) నుంచి ఇద్దరు, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం), హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం) నుంచి ఒక్కొక్కరికి మంత్రి పదవులు దక్కాయి. బిహార్‌లో అత్యధిక కాలం పనిచేసిన సీఎం నీతీశ్ కుమార్.. ఇప్పటివరకు దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పనిచేశారు.

## గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో..

# కోర్టులు జోక్యం చేసుకోవు

- రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదు 'బిల్లుల' అంశంపై సుప్రీం కీలక తీర్పు
- కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు
- ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు
- పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదు



**వుదయం ఢిల్లీ :**

రాష్ట్రాల శాసనసభలు ఆమో దించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నల (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్)పై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది.సుప్రీం తీర్పులో కీలక అంశాలివే.. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. 1. బిల్లులకు సమ్మతి తెలియజేయడం 2. కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం 3. బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుంది.గవర్నర్ బిల్లును రాష్ట్రపతి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు.ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.

## పోలీసు కస్టడీలో ఐబొమ్మ రవి

# పోలీసుల ప్రశ్నల వర్షం

**వుదయం హైదరాబాద్:**



సినిమా పైరసీ కేసులో ప్రధాన నిందితుడు, ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. బషీర్ బాగ్ లోని సైబర్‌క్రైమ్ పీఎస్ కు అతడిని తరలించారు. పైరసీ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇమంది రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీలోకి తీసుకొనేందుకు బుధవారం నాంపల్లి కోర్టు అనుమతి ఇచ్చింది. భారతీయ భాషల్లోని 21 వేల సినిమాలను పైరసీ చేసిన రవిని ఇటీవల నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరేబియన్ దీవులు కేంద్రంగా చేసుకొని ఆరేళ్లుగా 66 మిర్రర్ వెబ్‌సైట్లలో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. 50 లక్షల మంది డేటా సేకరించి సైబర్ నేరస్థులు, గేమింగ్, బెట్టింగ్‌యాప్‌ల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పేర్కొన్నారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.